thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08


# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 290 కరీంనగర్ శనివారం, 27 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌తో కలిసి పనిచేస్తాం

బీజింగ్ : సరిహద్దుల వద్ద శాంతి, సుస్థిరత నెలకొల్పేందుకు భారత్‌తో కలిసి పనిచేసేందుకు తమ సైన్యం సిద్ధమని చైనా ప్రకటించింది. రెండు దేశాల సైనిక భవిష్యత్ సంబంధాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఝాంగ్ జియావోగాంగ్ స్పందిస్తూ ఈ విషయం చెప్పారు. అత్యంత పురాతన నాగరికతలు కలిగి ఉన్న ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన స్థానాలను ఆక్రమించాయన్నారు. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.




## ఐదు రాష్ట్రాల ఎన్నికలతో...
# దేశం మొత్తం ఎలక్షన్ మోడ్‌లోనే!
## బీజేపీ అసలు ఆట మొదలు...!!

భారత రాజకీయాల్లో ఎన్నికలు అంటే పండుగల్లానే మారిపోయాయి. ఆరు నెలల గ్యాప్ లేకుండా ఏదో ఒక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన ఏడాదిన్నరలోపే హర్యానా, జమ్మూకశ్మీర్, బీహార్, మహారాష్ట్ర ఎన్నికలు పూర్తయ్యాయి. నిన్నటివరకు బీహార్ రాజకీయ హడావుడి దేశాన్ని ఊపేసింది. ఇప్పుడు కొత్తగా మరో ఐదు కీలక రాష్ట్రాల ఎన్నికల సందడి మొదలవుతోంది. మార్చి – ఏప్రిల్ నెలల్లో బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఐదు రాష్ట్రాలే దేశ రాజకీయ దిశను ప్రభావితం చేసే శక్తి కలిగినవిగా బీజేపీ భావిస్తోంది. అందుకే ఈసారి ఎన్నికలను తేలిగ్గా తీసుకోవడం లేదు. ఎన్నికల రాజకీయాలే ఊపిరిగా పనిచేసే బీజేపీ పెద్దలు ఇప్పటికే అసలు రాజకీయాన్ని స్టార్ట్ చేశారు.

**మొదటి అడుగు – కేంద్ర కేబినెట్ రీషఫుల్! :** బీజేపీ పెద్ద నిర్ణయాలన్నీ రాబోయే ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకునే తీసుకుంటుందన్నది రాజకీయాల్లో ఓ ఓపెన్ సీక్రెట్. ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు మొదటగా జరిగే పని – కేంద్ర మంత్రివర్గ మార్పులు. బెంగాల్‌లో ఎలాగైనా గెలవాలని, అస్సాంలో అధికారాన్ని నిలబెట్టుకోవాలని, తమిళనాడు –కేరళల్లో పార్టీ ఉనికిని బలపరచాలని బీజేపీ గట్టిగా ప్లాన్ చేస్తోంది. అందుకే ఆయా రాష్ట్రాల సామాజిక సమీకరణలకు తగ్గట్లుగా అక్కడి నేతలకు కేంద్ర కేబినెట్‌లో కీలక పదవులు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఏడాది కాలంగా పనితీరు ఆశించిన స్థాయిలో లేని మంత్రులను తప్పించి, యువతకు, కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వాలని ప్రధాని మోదీ భావిస్తున్నారన్న ప్రచారం జోరుగా నడుస్తోంది.

**ఫిబ్రవరి బడ్జెట్‌లో వరాల వర్షం! :** ఎన్నికలు అంటే బడ్జెట్ కూడా రాజకీయ ఆయుధమే. ఫిబ్రవరిలో ప్రకటించే కేంద్ర బడ్జెట్‌లో ఈ ఐదు రాష్ట్రాలకు భారీగా తాయిలాలు ప్రకటించే అవకాశం ఉంది. ముఖ్యంగా బీజేపీ ప్రధాన టార్గెట్ అయిన పశ్చిమ బెంగాల్‌పై వరాల వర్షం కురిసే ఛాన్స్ ఎక్కువ. మమతా బెనర్జీ పదిహేనేళ్ల పాలనపై ఏర్పడిన ప్రజా వ్యతిరేకతను క్యాష్ చేసుకోవాలని బీజేపీ చూస్తోంది. అస్సాంలో కొనసాగింపుకు, కేరళలో పంచాయతీ ఎన్నికల ఫలితాల ఆధారంగా, తమిళనాడులో హిందూత్వ రాజకీయాల ఊపును ఉపయోగించుకోవాలని ప్లాన్ చేస్తోంది. అందుకే బడ్జెట్‌లో అభివృద్ధి ప్యాకేజీలు కీలక పాత్ర పోషించనున్నాయి.

**నాలుగు–ఐదు నెలలు ఎన్నికల వేడి! :** ఎప్పుడూ ఎన్నికలే జరగడం ప్రజాస్వామ్యానికి మంచిదా కాదా అనే చర్చ పక్కన పెడితే... రాజకీయాలు మాత్రం ఎప్పుడూ వాడివేడిగానే సాగుతాయి.

ఎన్నికల సమయంలో రాజకీయ ఖర్చుల వల్ల ఆయా రాష్ట్రాల్లో ఆర్థిక చలనం పెరుగుతుంది. అప్పటివరకు దాచుకున్న డబ్బు మళ్లీ ప్రజల్లోకి వస్తుంది. రాజకీయ పెట్టుబడులు, హామీలు, తాయిలాలు అన్నీ కలిసి ఓ ప్రత్యేక వాతావరణాన్ని సృష్టిస్తాయి. అందుకే కొందరు ప్రశ్నిస్తారు – వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఎందుకు? ఇలా నిరంతరం ఎన్నికల పండుగలే ఉంటేనే కదా రాజకీయాలు బతికేది!




హైదరాబాద్ : తెలంగాణలో రైతు భరోసా పథకాన్ని నిలిపివేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతోన్న ప్రచారాన్ని ప్రభుత్వం ఖండించింది. ఇందులో ఎలాంటి నిజం లేదని తేల్చి చెప్పింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఇలాంటి వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం, దురుద్దేశంతో కూడినవేనని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. "రైతు భరోసా కింద తెలంగాణలో దాదాపు 65 లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందుతున్నారు. ఈ పథకాన్ని ప్రభుత్వం నిలిపివేయడంలేదు. ప్రస్తుతం సంబంధిత జిల్లా కమిటీలు నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూసేందుకు క్షేత్రస్థాయి వెరిఫికేషన్ నిర్వహిస్తున్నాయి.

అలాగే, ఆర్థిక శాఖ సైతం లబ్ధిదారులకు చెల్లింపులు చేసేందుకు వారి జాబితాను సిద్ధం చేసి తిరిగి తనిఖీ కూడా నిర్వహిస్తోంది. రైతు భరోసా నిలిపివేస్తున్నారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. ఇది లబ్ధిదారులను తప్పుదోవ పట్టించేదిగా ఉంది" అని పేర్కొంది.

**శాటిలైట్ మ్యాపింగ్ గురించి..**"వాణిజ్య వినియోగంలో ఉన్న భూములకు సంబంధించి రైతు భరోసా ప్రయోజనాలు పొందుతున్న వారిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం జర్మన్ టెక్నాలజీ సాయంతో 'శాటిలైట్ మ్యాపింగ్' నిర్వహిస్తోంది. 2024లో చేపట్టిన ఒక గ్రౌండ్ సర్వే ప్రకారం దాదాపు నాలుగు లక్షల ఎకరాల భూమి.. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ పరిధిలో వాణిజ్య వినియోగంలో ఉంది. ఈ మ్యాపింగ్ ప్రక్రియ ద్వారా ప్రతి లబ్ధిదారుడి వద్ద ఎంత భూమి సాగు విస్తీర్ణంలో ఉందో నిర్ధారించొచ్చు. రైతు భరోసా పొందుతున్న భూమి రియల్ ఎస్టేట్ వెంచరా?బీ కొండా, రోడ్డా, ఫాంహౌసా అనే విషయాన్ని ధ్రువీకరించేందుకు కూడా ఈ మ్యాపింగ్ ఉపయోగపడుతుంది. మ్యాపింగ్ ప్రక్రియ అనేది ఫీల్డ్ డేటాను రికార్డులతో ధృవీకరించడానికి మాత్రమే. రైతు భరోసా పథకం కింద గతేడాది దాదాపు రూ. 8,500 కోట్ల నుంచి రూ. 9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. రైతు భరోసా విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి షరతులు విధించలేదు. రైతులు రబీ/ఖరీఫ్ కాలాల్లో పంటలు పండించవచ్చు. అలాంటి వారు కూడా ఈ పథకానికి అర్హులే. ఒక సీజన్‌లో ఒకే పంట పండించిన రైతులకూ ఆర్థిక సహాయం అందిస్తున్నాం. లబ్ధిదారులందరికీ రెండు సీజన్లకు ఎకరానికి రూ. 12 వేలు చొప్పున అందుతుంది.

**ఏవైనా అభ్యంతరాలుంటే..** ఒకవేళ జాబితా నుంచి పేర్లు తొలగించినా, అభ్యంతరాలు ఉన్నా వివరణ కోసం రైతులు జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులను సంప్రదించవచ్చు. గతేడాది సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం 90 రోజుల వ్యవధిలో పూర్తి చేయాల్సిన రైతు భరోసా పంపిణీ కార్యక్రమాన్ని కేవలం 9 రోజుల్లోనే పూర్తి చేసి రికార్డు సృష్టించింది.

నిజమైన లబ్దిదారులకు నష్టం జరగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ప్రజలు ఎవరూ రైతు భరోసాపై దుష్ప్రచారాలు, అసత్య వార్తలను నమ్మొద్దు" అని విజ్ఞప్తి చేసింది.




### అనుమానంతో భార్యకు నిప్పు పెట్టిన భర్త.. అడ్డుకోబోయిన కూతురిని కూడా

హైదరాబాద్ : నగరంలోని నల్లకుంటలో దారుణం జరిగింది. అనుమానంతో కట్టుకున్న భార్యను దారుణంగా హత్య చేశాడు భర్త. అది కూడా పిల్లల ముందే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. భార్యపై విచక్షణారహితంగా దాడి చేయడమే కాకుండా ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో తీవ్రంగా గాయపడిన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే.. నల్గొండ జిల్లా హుజురాబాద్‌కు చెందిన దంపతులు వెంకటేశ్, త్రివేణి నల్లకుంటలో నివాసం ఉంటున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న వీరికి ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. అయితే ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను వెంకటేశ్ తరచూ అనుమానిస్తుండే వాడు. ఈ విషయంపై భార్యను తీవ్రంగా వేధించేవాడు. వారి మధ్య తరచూ గొడవలు జరిగేవి. తాజాగా భర్త వేధింపులు తాళలేక భార్య త్రివేణి పుట్టింటికి వెళ్లింది. దీంతో అక్కడికి వెళ్లిన వెంకటేశ్.. తాను మారానని, ఇకపై బాగా చూసుకుంటానంటూ నమ్మించి త్రివేణిని హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. అయితే తీసుకొచ్చిన కొద్దిరోజులకే ఆమెను అతి దారుణంగా చంపేశాడు. ఎప్పటిలాగే అనుమానంతో భార్యతో గొడవకు దిగి విచక్షణ మరిచి ఆమెపై దాడి చేశాడు. అంతటితో ఆగకుండా త్రివేణిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అడ్డుకున్న కూతురినీ మంటల్లో తోసేసిన వెంకటేశ్ అక్కడి నుంచి పరారయ్యాడు. అరుపులు, కేకలు విన్న స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసి ఇద్దరినీ స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే త్రివేణి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కూతురు స్వల్పగాయాలతో బయటపడింది.



## ఆ మహిళలకు రేవంత్ సర్కార్ శుభవార్త..
# డ్వాక్రా మహిళలకు డెయిరీ ఫామ్‌లు
## నెలకు లక్ష సంపాదించే ఛాన్స్!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంక్షేమం కోసం, మహిళల ఆర్థిక ప్రగతి కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక సంచలన నిర్ణయాలను తీసుకుంటుంది.

ముఖ్యంగా డ్వాక్రా గ్రూపులలో ఉన్న మహిళలకు ఆర్థిక భరోసా అందించే అనేక అవకాశాలను కల్పిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం పాడి రంగంలో మహిళలను భాగస్వాములను చేయాలని నిర్ణయించింది.

**డ్వాక్రా మహిళలకు మరో అద్భుత అవకాశం...** ఇందిర మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాలకు విజయ డెయిరీ పార్లర్ లను కేటాయించడానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ పథకం ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా బలోపేతం కావాలని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఒకటి రెండు వారాలలో డి ఆర్ డి ఓ, మెప్మా సంస్థలకు ఈ పార్లర్ ల ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలు చేరుకుంటాయని అధికారులు చెబుతున్నారు.

**డెయిరీ పార్లర్ ల కేటాయింపు ఇలా..** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాడిపరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య ఎండి, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ పార్లర్ల ఏర్పాటుపై చర్చించి తగిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ ప్రణాళికలో భాగంగా ప్రతి మండలంలోనూ ఒక పార్లర్ ను, పురపాలక సంఘాలకు రెండు పార్లర్లకు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆసక్తి ఉన్న స్వయంసహాయక సంఘాలు పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్యకు వెయ్యి రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**డెయిరీ పార్లర్ మంజూరు ప్రక్రియ ఇలా...** . దరఖాస్తు చేసుకున్న మహిళా సంఘాల సభ్యులు పార్లర్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని స్వయంగా పరిశీలించి ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. స్థల పరిశీలన పూర్తయిన తర్వాత MD TGDDCF లాలాపేట పేరుతో ఐదు వేల రూపాయల డిడి తీసి అందజేయాల్సి ఉంటుంది. ఆ పత్రాలు కూడా అందిన తర్వాత పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య సంబంధిత మహిళా సంఘానికి డెయిరీ పార్లర్ ను మంజూరు చేస్తుంది.

**డెయిరీ ఏర్పాటుకు సంఘానికి ఋణం...** ఒక్కొక్క పార్లర్ ఏర్పాటు చేయడానికి సుమారు 5 లక్షల రూపాయల వరకు అవుతుంది. అయితే ఇందులో సంఘం తమ వాటాగా లక్ష రూపాయలు సమకూర్చుకుంటే, మిగిలిన మొత్తం సంఘం పనితీరును బట్టి రుణంగా అందుతుంది. ఈ పార్లర్ లను ఏర్పాటు చేసుకుంటే విజయ డైరీ ఉత్పత్తులను మాత్రమే విక్రయించాల్సి ఉంటుంది. దీనిద్వారా మహిళా సంఘాలు ప్రతినెల లక్ష రూపాయల వరకు ఆదాయాన్ని సంపాదించే అవకాశం ఉంటుంది.




## ఫోన్ ట్యాపింగ్ కేసుపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఆరా మస్తాన్ విచారణ

### హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలోని నూతన సిట్ విచారణ

### 2020 నుంచి ఫోన్ ట్యాపింగ్‌పై అనుమానం - ఆరా మస్తాన్ కాల్ రికార్డింగ్స్ పరిశీలన

### ఫోన్ ట్యాపింగ్ కేసు త్వరలో కొలిక్కి వస్తుంది: ఆరా మస్తాన్ ఆశాభావం

హైదరాబాద్, డిసెంబరు26 : తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో భాగంగా ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, 'ఆరా' పోల్ స్ట్రాటజీస్ సంస్థ వ్యవస్థాపకుడు ఆరా మస్తాన్‌ను జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక దర్యాప్తు బృందం ఇవాళ (శుక్రవారం) విచారణ జరిపింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలో ఏర్పాటైన నూతన సిట్ ఈ విచారణ ప్రారంభించింది. ఈ విచారణ సందర్భంగా ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

ఇప్పటికే రెండు సార్లు పోలీసులు ఆరా మస్తాన్‌ను ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఈసారి విచారణలో భాగంగా ఆయన గతంలో ఇచ్చిన స్టేట్‌మెంట్లను తిరిగి పరిశీలించి, కన్ఫర్మేషన్ కోసం అదే ప్రశ్నలను మరోసారి అడిగినట్లు తెలుస్తోంది.

**2020 నుంచి కాల్ రికార్డుల పరిశీలన...** సిట్ అధికారులు 2020 సంవత్సరం నుంచి ఆరా మస్తాన్ వివిధ కీలక రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులతో మాట్లాడిన ఫోన్ కాల్స్ రికార్డింగ్స్‌ను సమగ్రంగా పరిశీలించారు. ఈ కాల్ డేటా ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందా? జరిగితే ఎవరి ఆదేశాల మేరకు జరిగింది? అనే అంశాలపై సిట్ అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. సిట్ అధికారుల విచారణ అనంతరం ఆరా మస్తాన్ మీడియాతో మాట్లాడారు. నూతనంగా ఏర్పాటు చేసిన సిట్ తనను ఈరోజు విచారణకు రావాలని పిలిచిందని అన్నారు.

అధికారుల పిలుపు మేరకే తాను హాజరయ్యానని తెలిపారు. గతంలో అడిగిన ప్రశ్నలనే మరోసారి అడిగి, తన వాంగ్మూలాన్ని నిర్ధారించుకున్నారని వెల్లడించారు. సిట్ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు తాను స్పష్టమైన సమాధానాలు ఇచ్చానని చెప్పుకొచ్చారు.

**ఫోన్ ట్యాపింగ్‌పై అనుమానం...** తన ఫోన్ ట్యాపింగ్ 2020 సంవత్సరం నుంచే జరుగుతోందన్న అనుమానం ఉందని తెలిపారు. అప్పటి నుంచి తన కాల్స్, కమ్యూనికేషన్‌పై నిఘా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ అంశాన్ని విచారణలో సిట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

**నూతన సిట్‌పై విశ్వాసం...** నూతనంగా ఏర్పాటు చేసిన సిట్ ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసిందని ఆరా మస్తాన్ అభిప్రాయపడ్డారు. గతంతో పోలిస్తే ఇప్పుడు విచారణ మరింత సమగ్రంగా, స్పష్టంగా కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. నూతన సిట్ దర్యాప్తు ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ కేసు త్వరలోనే ఒక స్పష్టమైన దశకు చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని సిట్ అధికారులు తనకు చెప్పారని అన్నారు. తాను చట్టపరమైన ప్రక్రియలకు పూర్తిగా సహకరిస్తానని, నిజాలు బయటకు రావాలన్నదే తన ఆకాంక్ష అని ఆరా మస్తాన్ స్పష్టం చేశారు.

**కేసు ప్రాధాన్యత...** ఫోన్ ట్యాపింగ్ కేసు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిందా?, అధికార దుర్వినియోగం జరిగిందా? అనే ప్రశ్నలు ఈ కేసుతో ముడిపడి ఉన్నాయి.

ప్రముఖ రాజకీయ విశ్లేషకుడైన ఆరా మస్తాన్ పేరు ఈ కేసులోకి రావడంతో మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

**రాజకీయాలపై ప్రభావం...** ఈ కేసులో సిట్ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తోండటంతో రానున్న రోజుల్లో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని రాజకీయ, న్యాయవర్గాలు భావిస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది ఫలితం రాష్ట్ర రాజకీయాలపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.





హైదరాబాద్, డిసెంబర్ 26: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ ముగిసింది. ఈరోజు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రభాకర్ రావుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల తర్వాత ప్రభాకర్ ఇంటికి వెళ్లిపోయారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో 14 రోజుల పాటు ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారించారు. ఆయన స్టేట్‌మెంట్‌ను ఫైనల్ ఛార్జ్ షీట్‌లో పొందుపర్చనున్న సిట్.. జనవరి 16న సుప్రీంకోర్టుకు నివేదిక ఇవ్వనున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు తుది అంకానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఈకేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావును సిట్ దర్యాప్తు బృందం 14 రోజుల పాటు విచారించింది. మొదటి దశలో డిసెంబర్ 12 నుంచి 18 వరకు ప్రభాకర్ రావును విచారించింది సిట్ బృందం. అయితే విచారణలో ఎస్ఐబీ మాజీ చీఫ్ సిట్‌కు సహకరించలేదని.. అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 19 నుంచి 25 వరకు మరోసారి కస్టోడియల్ విచారణకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో మొత్తం 14 రోజుల పాటు ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారించారు. ఈ కేసులో మిగిలిన నిందితులుగా ఉన్న తిరుపతన్నరావు, భుజంగరావు, రాధాకిషన్ రావును విచారించినట్లు తెలుస్తోంది. వీరందరినీ వేర్వేరుగా సిట్ అధికారులు విచారించి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసినట్లు సమాచారం. అప్పట్లో ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న సమయంలో అప్పటి మాజీ మంత్రి హరీష్‌రావును ఎందుకు కలిశారని ప్రశ్నించగా.. అతనికి ప్రాణహానీ ఉండటంతో రక్షణ కోసం కల్పించడం కోసమే కలిసినట్లు సిట్ అధికారుల ఎదుట ఒప్పుకున్నారు. వీటితో పాటు ప్రభాకర్ రావు పదవీవిరమణ అయినప్పటికీ పదవిని కొనసాగించడంలో ఆంతర్యమేంటి అనే దానిపై ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అయితే అప్పటి సీఎంగా పనిచేసిన కేసీఆర్‌కే తెలియాలంటూ సిట్ అధికారులకే ప్రభాకర్ రావు ఎదురు ప్రశ్న వేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ కేసుకు సంబంధించి అప్పట్లో మంత్రిగా పనిచేసిన హరీష్‌రావుతో పాటు మాజీ సీఎం కేసీఆర్‌ను కూడా విచారించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ప్రభాకర్ రావు కుమారుడు నిశాంత్ రావును కూడా సిట్ అధికారులు విచారించారు. గతంలో ఆరువేల ఫోన్ నెంబర్లు ట్యాపరింగ్ చేసి రాజకీయ నేతలతో పాటు వ్యాపారవేత్తలను బెదిరించి వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఆర్థిక లావాదేవీలపై ప్రభాకర్ రావు బంధువుల స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డ్ చేసినట్లు తెలుస్తోంది. నెలలోపు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి దర్యాప్తును పూర్తి చేయాలని కొత్తగా ఏర్పడిన సిట్ బృందానికి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో జనవరి 16లోపు పూర్తి వివరాలు రాబట్టేందుకు సిట్ బృందం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.




హైదరాబాద్: మేడిగడ్డను కూల్చివేసిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు చెక్‌డ్యామ్‌లను పేల్చివేస్తున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది కూల్చివేతలు, పేల్చివేతలు, ఎగవేతలు మాత్రమేనని వ్యాఖ్యానించారు. శేరిలింగంపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు నేడు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "ఎన్నో హామీలిచ్చిన రేవంత్‌రెడ్డి అన్నీ ఎగవేశారు. ఆయన కిస్మత్ బాగుండి పేమెంట్ కోటాలో సీఎం అయ్యారు. హామీల గురించి ప్రశ్నిస్తే రేవంత్ బూతులు తిడుతున్నారు.

తిట్ల భాష మాకూ వచ్చు.. కానీ మేం తిట్టం. పెంచుతామన్న పింఛన్లు ఎప్పటి నుంచి ఇస్తారో సీఎం చెప్పాలి. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను వరుసగా రెండుసార్లు గెలిపించారు. హైదరాబాద్ ప్రజలకు నేను పాదాభివందనం చేసినా తక్కువే. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ తట్టుకోలేరు" అని కేటీఆర్ అన్నారు.

## మెరిట్ కోటాలో సీఎం అయిన రేవంత్ రెడ్డి: చామల కుమార్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 26: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుద్ధి, జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి మెరిట్ కోటాలో సీఎం అయ్యారన్నారు. నువ్వు మేనేజ్‌మెంట్ కోటాలో రాజకీయాల్లోకి వచ్చావంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అదే కోటాలో వచ్చి సిరిసిల్ల ఎమ్మెల్యే అయి.. మంత్రి అయ్యావంటూ వ్యంగ్యంగా అన్నారు. రేవంత్ రెడ్డి ఇండిపెండెంట్‌గా జడ్పీటీసీ, ఎమ్మెల్యేగా గెలిచారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి ఎంపీగా గెలిచి.. ప్రస్తుతం సీఎం అయ్యారని వివరించారు. మెరిట్ కోటా,పేమెంట్ కోటా, మేనేజ్‌మెంట్ కోటా ఎవరిదో తెలంగాణ ప్రజలకు తెలుసునన్నారు. పీసీసీ అధ్యక్షుడుగా రేవంత్ రెడ్డి అయిన తర్వాతనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. ఎప్పుడు అధికారం తమకే ఉంటుందని బీఆర్ఎస్ హయాంలో నియంత పాలన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బీఆర్ఎస్‌కు గుండు సున్నా..** 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని రేవంత్ రెడ్డి ఓడించి ఇంటికి పంపారని చెప్పారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి చేతిలో మీకు ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. దమ్ముంటే రేవంత్ రెడ్డి ఛాలెంజ్ స్వీకరించాలంటూ కేటీఆర్‌ను ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఐరెన్ లెగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అని అభివర్ణించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి గుండు సున్నా వచ్చిందని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో తాను ఏదో పొడిచానని చెప్పుకున్న కేటీఆర్‌ను కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు ఓడగొట్టారని గుర్తు చేశారు.

**పిచ్చి ఆలోచనలు మానుకోవాలి కేటీఆర్..** పిచ్చి ఆలోచనలు మానుకోవాలంటూ కేటిఆర్‌కు ఆయన హితవు పలికారు. నిర్మాణత్మక ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషించాలంటూ బిఆర్ఎస్ నేతలకు సూచించారు. కేసీఆర్‌ను అసెంబ్లీకి తీసుకుని రావాలంటూ కేటీఆర్‌కు తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే ప్రధాన ప్రతిపక్ష నేత హోదాను కేటీఆర్ తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. తద్వారా ప్రభుత్వానికి సలహాలు,సూచనలు ఇవ్వాలని కేటీఆర్‌కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు. తాను బూతులు మాట్లాడతానంటూ కేటీఆర్ అంటున్నారన్నారు. కట్టే, కొట్టే, తెచ్చే అనేది మీ కుటుంబానికి వర్తిస్తుందంటూ కేటీఆర్‌కు తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణ ప్రజలను మీరు వంచించ లేదా? అని కేటిఆర్‌ను సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ ఉద్యమకారుడి అవతారం ఎత్తి, పిట్ట కథలు కట్టి, సీఎం పదవిని అధికారాన్ని చేపట్టి.. రాష్ట్రాన్ని అప్పుల చేసి మీ కుటుంబానికి సంపద తెచ్చారని విమర్శించారు.

**హైడ్రా వల్ల నగర ప్రజలు సంతోషం...** హైడ్రా చేస్తున్న పనుల పట్ల హైదరాబాద్ నగర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో నాలాలను కబ్జాలు చేసి ఇళ్ళు నిర్మించారని.. దాంతో వానాకాలం వస్తే ఇళ్లనీ మునిగి ప్రజలకు ఆస్తి నష్టం వాటిల్లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాలనీలు, పార్కులను కబ్జాలు చేసి దండుపాళ్యం ముఠాలా దోచుకున్నారని మండిపడ్డారు. మీరు కబ్జాలు చేసి దోచుకున్న వాటిని హైడ్రా కూల్చివేస్తుందని హెచ్చరించారు. ప్రజల కోసం హైడ్రా కూల్చివేతలు చేపడుతోందని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇళ్ళు ప్రజలకు ఇచ్చారా..? అని కేటీఆర్‌ను ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం అంటే నగదు ఇవ్వడం కాదని.. మహిళలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఇవ్వడం ద్వారా కోటి మంది మహిళలు కోటీశ్వరులు అవుతారని కేటీఆర్‌కు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సోదాహరణగా వివరించారు.



## వేములవాడ రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

వేములవాడ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ముందు భక్తులు వేములవాడ రాజన్నకు కోడె మొక్కులతో పాటు వివిధ ఆర్జిత సేవల మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీనికి తోడు వరుస సెలవులు రావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకొని అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని బోనా లు, పట్నం మొక్కులు చెల్లించారు. దీంతో క్యూలైన్లతో పాటు ఆలయ పరిసరాలు భక్తజనసంద్రంగా మారాయి. స్వామివారి దర్శనానికి 5గంటలకు పైగా సమయం పడుతోంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ఈవో రమాదేవి పర్యవేక్షించారు. ఏఎస్పీ రిత్విక్ సాయి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

## సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం.. కేసీఆర్‌కు గుబులు మొదలైంది: మంత్రి వివేక్



హైదరాబాద్: గజ్వేల్ నియోజకవర్గంలోని 90కి పైగా స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచి అభ్యర్థులు గెలవడంతో కేసీఆర్ గుండెల్లో గుబులు మొదలైందని మంత్రి వివేక్ అన్నారు. అందుకే ఆయన ఇష్టానుసారం మాట్లాడుతున్నారని విమర్శించారు. "కేసీఆర్ తనను గెలిపించిన గజ్వేల్ ప్రజల సమస్యలు పట్టించుకోలేదు కానీ తోలు తీస్తాడట. గతంలో కంటే ఎక్కువగా దుబ్బాకలో 56 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. పార్టీ కార్యకర్తల కష్టం వల్లే ఇన్ని స్థానాలు గెలుపొందాం. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పథకాలపై ప్రజల్లో మంచి స్పందన ఉంది. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు బలం లేదు అన్నారు.. కానీ, 20వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందాం" అని మంత్రి వివేక్ అన్నారు.




## వెండి ధగధగలు.. రూ.2.37 లక్షలు దాటి పరుగులు

హైదరాబాద్: దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు రోజురోజుకు ఆకాశాన్నంటుతున్నాయి. వెండి రికార్డులు కొల్లగొడుతూ పరుగులు పెడుతోంది. హైదరాబాద్‌లో శుక్రవారం కేజీ ధర ఏకంగా రూ.2.37 లక్షలు పలికింది. ఇక 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర ఒక దశలో రూ. 1,42,800 లక్షలకు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,28,350గా ఉంది. అంత ర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు చుక్కలను తాకుతున్నాయి. ఔన్సు బంగారం ధర 4,507 డాలర్లు, వెండి ధర 75 డాలర్లకు చేరింది. ఈ నెల 18 నుంచి వెండి ధర దాదాపు రూ.29 వేలు(14.33 శాతం) పెరగడం గమనార్హం. ఈ ఏడాదిలో ఇప్పటికే పుత్తడి ధర దాదాపు 70శాతం వరకు ఎగబాకింది. 1979 తర్వాత ఇదే అతిపెద్ద వార్షిక లాభమని నిపుణులు చెబుతున్నారు. వచ్చే ఏడాది మరోసారి అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత పెడుతుందన్న అంచనాలతో బంగారం, వెండి ని సురక్షిత పెట్టుబడి సాధనాలుగా మదుపర్లు భావిస్తు న్నారు. దీంతో ఈ లోహాల ధరలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. 2026 ప్రారంభంలోనూ ఈ లోహాల ధరల పరుగు కొనసాగొచ్చని అంచనా వేశారు. ద్రవ్యోల్బణం, డాలర్ బలహీనత, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు ఈ పెరుగుదలకు కారణమవుతున్నాయి.

# తెలుగు కవులను తెలుగేతరులకు పరిచయం చేసిన జర్నలిస్ట్ ధూళిపాళ

## డిసెంబర్ 27... ధూళిపాళ వర్ధంతి



ధూళిపూడి ఆంజనేయులు, సుప్రసిద్ధ ఆంగ్ల రచయిత. పుట్టింది, పెరిగింది తెలుగు రాష్ట్రంలో అయినా, ఆంజనేయులు కేవలం ఇంగ్లీషులోనే రాసి గొప్ప జర్నలిస్టుగా ఖ్యాతి చెందారు. డి.ఎ.అని పాఠకులకు పరిచితులు. 1924 జనవరి 10న గుంటూరు జిల్లా తెనాలి తాలూకా ఎలవర్రులో పుట్టి, ముందు నుండే జర్నలిస్టు జీవితాన్ని ఎంపిక చేసుకున్న ఆంజనేయులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా, సమాచార శాఖలో జర్నలిస్టుగా, ఆకాశ వాణిలో వాణి పత్రికా సంపాదకులుగా, హిందూ పత్రిక సంపాదక బృందం బాధ్యులుగా, పేరెన్నిక గన్నారు. కోటం రాజు రామారావు నడిపిన "ఇండియన్ రిపబ్లిక్" లో తొలుత జర్నలిజానికి ఆయన శ్రీకారం చుట్టారు. మొదట ఇండియన్ ఎక్స్ ప్రెస్ సంపాదక వర్గంలో 1948లో చేరి 1953లో ది హిందూ పత్రికలో చేరి అనుభవం సంపాదించిన తర్వాత 1959 లో ఆకాశవాణి వారి వాణి పత్రిక సంపాదక బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగరీత్యా ఆంజనేయులు ఢిల్లీ, హైదరాబాద్, మద్రాసులో ఉంటూ సమాచార శాఖలో జర్నలిస్టుగా వృత్తిధర్మం నిర్వర్తించారు. ఉద్యోగంలో వున్నా వివిధ పత్రికలకు రాస్తూ ఆంజనేయులు మంచి పేరు తెచ్చు కున్నారు. అంతకుమించి, ఎన్నో రచనలు ప్రచురించారు. ఆయన రాసిన పత్రికలు క్వెస్ట్, ఇండియన్ రివ్యూ,థాట్, ఇండియన్ లిటరేచర్, త్రివేణి, ఫైనాన్షియల్ ఎక్స్ ప్రెస్, ఎకనామిక్ టైమ్స్, ఇండియన్ రైటింగ్ టుడే పేర్కొనదగినవి. తెలుగు పత్రికలకు ఇంగ్లీషులో రాసి పంపగా, అనువదించి వేసుకునే వారు. స్వతంత్ర టైమ్స్, దక్కన్ హెరాల్డ్, న్యూస్ టుడే, ఇండియన్ బుక్ క్రానికల్ పత్రికలు కూడా ఆంజనేయులు వ్యాసాలు ప్రచురించాయి. భవాన్స్ జర్నల్ లో ఎన్నో విలువైన వ్యాసాలు ఆంజనేయులు రాశారు. వృత్తిచేస్తూనే అనేక సెమినార్లకు, చక్కని వ్యాసాలు రాయడం ఆంజనేయుల జర్నలిస్ట్ కృషిలో భాగం అయింది. దీని ఫలితంగా జీవిత చరిత్ర, కళ గురించేగాక, నెహ్రూ, రాధాకృషన్, అంబేద్కర్, నిరాద్ చౌదరి మొద లైన వారిపై లోతైన పరిశీలనా వ్యాసాలు రాశారు. ?తెలుగు సాహిత్యాన్ని, రచయితల్ని తెలుగే తరులకు అందించడం ఆయన విశిష్టత. ఇందులో భాగంగా గ్లింప్సెస్ ఆఫ్ తెలుగు లిటరేచర్ రాయగా, కలకత్తా రైటర్స్ వర్క్ షాప్ వారు వెలువ రించారు. ఆయన ఏది రాసినా, చెప్పినా స్పష్టంగా, మృదువుగా, మర్యా దగా ఉండేది. సున్నిత హాస్యం, విమర్శ ఆయన రచనల్లో కనిపించేది. వృత్తి రీత్యానూ, వ్యక్తి దృష్ట్యా ఆంజనేయులుకు ఎందరో సన్నిహితులయ్యారు. వారిలో నార్ల వెంకటేశ్వరరావు, సంజీవదేవ్, బి.ఎస్.ఆర్.కృష?, కె.శ్రీనివాస అయ్యంగార్, వామనరావు, పట్టాభిరాం, ఎ.ఆర్.బాజీ, భావరాజు నరసింహా రావు ప్రభృతులెందరో వున్నారు. నార్ల వెంకటేశ్వర రావు తన ఇంగ్లీషు రచనల్ని ముందుగా ఆంజనేయులు పరిశీలించిన తరువాత ప్రచురించేవారు. విశ్వనాథ సత్యనారాయణ, గోపీ చంద్, బైరాగి, పాలగుమ్మి పద్మ రాజు, శ్రీశ్రీ, సి. నారాయణ రెడ్డి, దాశరథి, దేవులపల్లి కృష?శాస్త్రి మొద లైన వారిని తెలుగేతరులకు తన రచనల ద్వారా పరిచయం చేసిన గొప్పతనం ఆయనదే. పత్రికలకు ఇంగ్లీషులో రాసి పంపగా, అనువదించి వేసుకునే వారు. స్వతంత్ర టైమ్స్, దక్కన్ హెరాల్డ్, న్యూస్ టుడే, ఇండియన్ బుక్ క్రానికల్ పత్రికలు కూడా ఆంజనేయులు వ్యాసాలు ప్రచురిం చాయి. భవాన్స్ జర్నల్లో ఎన్నో విలువైన వ్యాసాలు ఆంజనేయులు రాశారు. వ ృత్తిచేస్తూనే అనేక సెమినార్లకు, చక్కని వ్యాసాలు రాయడం ఆంజనేయుల జర్నలిస్ట్ కృషిలో భాగం అయింది. దీని ఫలితంగా జీవిత చరిత్ర, కళ గురించేగాక, నెహ్రూ, రాధాకృష?న్, అంబేద్కర్, నిరాద్ చౌదరి మొదలైన వారిపై లోతైన పరిశీలనా వ్యాసాలు రాశారు. ద్వివేదుల విశాలాక్షి రచన "గ్రహణం విడిచింది" ఇంగ్లీషులోకి అనువదించారు. ఆంజనేయులు రచనలను... కట్టమంచి రామలింగారెడ్డి, సాహిత్య అకాడమీ, కందుకూరి వీరేశలింగం, కేంద్ర ప్రచురణ సంస్థ ప్రచురించాయి. ఆయన రష్యా, యూరప్ దేశాలు పర్యటన అనుభవాలను 'విండో టు ది వెస్ట్' అని పుస్తకంగా ప్రచురించారు. ఆంజనేయులు రిటైర్ అయిన తరువాత మద్రాసులో స్థిరపడి, హిందూ లో "బిట్వీన్ యు అండ్ మి" అనే శీర్షిక 10 సంవత్సరాలు (1981–91) నిర్వహించారు. మద్రాసు ప్రెస్ క్లబ్ లో 30 సంవత్సరాలు అధ్యక్షులుగా ఉన్నారు. సాహిత్య విమర్శ, సాంఘిక సంస్కరణలపై కూడా రచనలు చేశారు. ఆంజనేయులు సెక్యులర్ జీవితం గడిపారు. కుమార్తె వివాహం రిజిస్టర్ చేయించి, కన్యాదాన పద్ధతి నిరసించారు. సంగీతం, సంస్కృతం, సాహిత్యం అంటే ప్రత్యేకాభి మానం. స్వంత గ్రంథాలయం దేశంలో అతి పెద్దదైన వ్యక్తిగత గ్రంథాలయాలలో ఒకటి. తెలుగువారు గర్వించదగిన ఇంగ్లీషు జర్నలిస్టు తన 75వ ఏట 1998 సంవత్సరం డిసెంబరు 27 తేదీన చెన్నైలో తుది శ్వాస వదిలారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ఆధునిక ఖగోళశాస్త్ర పితామహుడు జోహాన్స్ కెప్లర్

## డిసెంబర్ 27...జోహాన్స్ కెప్లర్ జయంతి



జోహాన్స్ కెప్లర్ 1571 డిసెంబరు 27న జర్మనీలో జన్మించిన ఖగోళ శాస్త్రంలో అత్యంత ముఖ్యమైన వ్యక్తులలో ఒకరు. ఖగోళశాస్త్రం, గణితశాస్త్రం, మరియు తత్వశాస్త్రంలో ఆయన కృషి ప్రపంచం మొత్తం మీద ఖగోళ శాస్త్రంలో విప్లవాత్మక మార్పులకు కారణమైంది. కెప్లర్ ప్రతిపాదించిన "గ్రహాల గమన నియమాలు" ఖగోళ శాస్త్రంలో ఒక నూతన దిశా నిర్దేశం చేశాయి.

**జీవితం...** జోహాన్స్ కెప్లర్ ఒక పేద కుటుంబంలో జన్మించాడు. చిన్నతనంలోనే అనారోగ్యం, ఆర్థిక సమస్యలు ఎదురైనప్పటికీ, ఆయన తల్లిదండ్రుల సహకారం, గణిత పట్ల ఉన్న ప్రత్యేకమైన ఆసక్తి కారణంగా విద్యలో అత్యుత్తమ ప్రగతి సాధించాడు. ప్రాథమిక విద్య పూర్తిచేసిన తర్వాత, కెప్లర్ స్టుట్‌గార్ట్ విశ్వవిద్యాలయంలో ఖగోళశాస్త్రం అధ్యయనం చేశాడు. విశ్వవిద్యాలయంలో గణితంలో మరియు ఖగోళశాస్త్రంలో అసాధారణ ప్రతిభను ప్రదర్శించాడు.

**ముఖ్య కృషి...** జోహాన్స్ కెప్లర్ తన జీవితంలో ఖగోళశాస్త్రం, గణితశాస్త్రం, మరియు ఆప్టిక్స్‌లో అనేక పరిశోధనలు చేశాడు.

**గ్రహాల గమన నియమాలు...** కెప్లర్ తన పరిశోధన ద్వారా గ్రహాల కదలికలను వివరించడానికి మూడు ప్రాథమిక నియమాలను రూపొందించాడు. ఇవి ఖగోళ శాస్త్రానికి ఆధారభూతంగా నిలిచాయి. మొదటి నియమం (ఎలిప్టికల్ ఆర్బిట్స్): గ్రహాలు సూర్యుణి? ఎలిప్స్ ఆకారంలో చుట్టివేస్తాయి, సూర్యుడు ఆ ఎలిప్స్‌కు ఒక ఫోకస్ పాయింట్‌గా ఉంటాడు. రెండవ నియమం (ఈక్వల్ ఏరియాస్): గ్రహాలు సూర్యునికి దగ్గరగా వచ్చినప్పుడు వేగంగా కదులుతాయి, సూర్యునికి దూరంగా ఉన్నప్పుడు నెమ్మదిగా కదులుతాయి, ఒక సమాన కాలంలో సమాన వైశాల్యం కవర్ అవుతుంది. మూడవ నియమం (హార్మోనిక్ లా): ఒక గ్రహం యొక్క కక్ష్య కాలం యొక్క చదరంగము, సూర్యానికి దూరం యొక్క ఘనాంకంతో ప్రామాణిక సంబంధం కలిగి ఉంటుంది.


**ఆప్టిక్స్‌లో పరిశోధన...** కెప్లర్ ఆప్టిక్స్‌లోనూ అత్యంత ముఖ్యమైన కృషి చేశారు. కాంతి యొక్క ప్రకృతి, ప్రతిబింబం, రిఫ్రాక్షన్ పై తన పరిశోధన ద్వారా ఆప్టికల్ టెలిస్కోప్ రూపకల్పనలో కీలకమైన మార్పులు తీసుకు వచ్చాడు. కెప్లర్ టెలిస్కోప్ అనే డిజైన్, మరింత శక్తివంతమైన టెలిస్కోపుల తయారికి పునాది వేసింది.

**తారాగణాల పరిశోధన..** కెప్లర్ తారాగణాల స్థితిగతులు, వాటి కదలికల గమనాన్ని పరిశీలించి, అనేక వివరాలను వెల్లడించాడు. ఈ క్రమంలో నూతన నక్షత్రాలను గుర్తించడంతో పాటు, వాటి ప్రవర్తనపై అధ్యయనం చేశాడు.

**కెప్లర్ మరియు అంతరిక్ష పరిశోధన...** కెప్లర్ పరిశోధనల ద్వారా ఖగోళ శాస్త్రానికి బలమైన శాస్త్రీయ పునాది ఏర్పడింది. %చీూూూ% 2009లో ప్రారంభించిన "కెప్లర్ స్పేస్ టెలిస్కోప్" జోహాన్స్ కెప్లర్‌కు ఘన నివాళిగా రూపుదిద్దుకుంది. ఈ టెలిస్కోప్ ఉపయోగించి 2,600కి పైగా గ్రహాలను, అలాగే అనేక నూతన నక్షత్రాలను గుర్తించారు. కెప్లర్ టెలిస్కోప్ అనేక ఎక్సోప్లానెట్‌ల (సౌర వ్యవస్థ వెలుపల ఉన్న గ్రహాలు) ఆవిష్కరణకు దోహద పడింది. కెప్లర్ కృషి ఖగోళ శాస్త్రానికి మాత్రమే కాక, మొత్తం శాస్త్ర ప్రపంచానికి విలువైన సమాచారంగా నిలిచింది. ఆయన పరిశోధనలు ఆర్థిక, సాంకేతిక రంగాల్లో నూతన మార్గాలను చూపాయి. గ్రహాల కక్ష్య నియమాలు ఆధారంగా నేడు అంతరిక్ష శాటిలైట్‌లు మరియు అంతరిక్ష నౌకలు విజయవంతంగా పనిచేస్తున్నాయి. కెప్లర్ తన జీవితాన్ని పరిశోధనకు అంకితం చేసి, ప్రకృతిని అర్థం చేసుకోవడంలో మానవాళికి ఒక శాశ్వత చిహ్నంగా నిలిచాడు. ఆయన విప్లవాత్మక ఆలోచనలు శాస్త్రంలో ఒక సువర? అధ్యాయంగా నిలుస్తాయి. "మోడర్న్ ఖగోళశాస్త్ర పితామహుడు" అనే బిరుదు కెప్లర్ అందుకున్న గౌరవానికి అర్హతను స్పష్టంగా ప్రతిపాదిస్తుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# టీకాల అవిష్కరణకు ఆద్యుడు పాశ్చర్

## డిసెంబర్ 27... లూయీ పాశ్చర్ జయంతి



ఆంత్రాక్స్, రబీస్ తదితర వ్యాధులకు మందులను కనిపెట్టడంలో మూలపురుషుడై అవిరళ కృషి సల్పిన సూక్ష్మజీవ శాస్త్రవేత్త లూయీ పాశ్చర్. 19 వ శతాబ్దంలో గాలి సోకడం వల్ల అంటువ్యాధులు వస్తాయని నమ్మేవారు. గాలిలో రోగకారక క్రిములని మోసుకొచ్చే వస్తువుల వల్ల అంటు వ్యాధులు కలుగు తాయని అప్పుడు ఎవరికీ తెలీదు. సొంత కుంటుంబంలో జరిగిన విషాద సంఘటనలు, పాశ్చర్ తన పరిశోధనలను కలరా, మశూచి వ్యాధులకు మూలమైన వ్యాధి కారకాలను కనుగొనే దిశలో కొనసాగేట్లు చేశాయి. నేడు మనం చిన్న పిల్లలకు కలరా, మశూచి, పోలియో రాకుండా ముందుగానే వేయిస్తున్న 'టీకాలు' ఆ మహానుభావుని ఆలోచనే. వ్యాధి వచ్చినప్పటి కంటే రాకుండా తీసుకోనే జాగ్రత్తలే మేలని ముందుగా "వ్యాక్సి నేషన్" ద్వారా వ్యాధులను రాకుండా ముందుగానే కట్టడి చేయవచ్చని సూచించాడు. అంతేకాదు వ్యాధి సోకినా దానిని నియంత్రించి, రూపుమాపే మందులను కూడా కనుగొనేందుకు మార్గం చూపించాడు. పాశ్చర్ తన ప్రయోగాలను ఉపయోగించి సూక్ష్మజీవులు వాస్తవానికి ఇతర సూక్ష్మజీవుల నుండి ఉత్పత్తి అవుతాయని, ఊరికే గాలిలోంచి ఊడిపడవని నిరూపించారు. నేడు లక్షలాది అంటు రోగాలను తగ్గించేందుకు మన ఆధునిక వైద్యశాస్త్ర రంగంలో మందులున్నాయి. దానికి ఎంతో కృషి సల్పిన, నేటికీ నిత్యం శ్రమిస్తున్న ఎంతో మంది సూక్ష్మ జీవశాస్త్రవేత్తలకు లూయీ పాశ్చర్ వంటి వారు ఏర్పరిచిన శాస్త్రీయ విధానమే మూలాధారం. లూయీ పాశ్చర్ (డిసెంబరు 27, 1822 %--% సెప్టెంబరు 28, 1895) ప్రముఖ ఫ్రెంచి జీవ శాస్త్రవేత్త. వ్యాధులకు కారణం సూక్ష్మక్రిములను కనుగొని రోగ నివారణకు పాశ్చర్ బాటలు వేశారు. టీకాల ఆవిష్కారానికి ఇతడు ఆద్యుడు. మొదటి సారిగా రేబీస్ వ్యాధి కోసం టీకాను తయారుచేశాడు. రాబర్ట్ కోచ్, ఫెర్డినాండ్ కాన్తో పాటు జీవశాస్త్ర వ్యవస్థాపక త్రయంలో ఒకరు. పాలు ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టే పద్ధతిని ప్రవేశ పెట్టిన వ్యక్తిగా సుపరిచితుడు. ఈ పద్ధతిని నేడు "పాశ్చరైజేషన్" అంటారు. కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. పాశ్చర్ కొన్ని అదుతే ప్రయోగాలు చేసి సూక్ష్మ జీవులు ఒకదాన్నుండి ఒకటి పుడతాయని, గాల్లోంచి ఊడి పడవని నిరూపించాడు. ఆయన ప్రతిపాదించిన రోగకారక క్రిమి సిద్ధాంతం వైద్య శాస్త్రంలో ఒక విప్లవాత్మకమైన భావనగా చెప్పుకోవచ్చు. అంతేకాక ఆయన వ్యాధి యొక్క వ్యాప్తిని అరికట్టేందుకు ఆస్పత్రులలో చేతులు కడుక్కోవడం వంటి పరిశుభ్రతా పరమైన పద్ధతులు ప్రవేశ పెట్టాడు. పాశ్చర్ అత్యంత సునిశితమైన, క్రమబద్ధమైన ప్రయోగాలు చేసి ఎన్నో ప్రమాద కరమైన సూక్ష్మజీవులను కనుగొన్నారు. ఆ సూక్ష్మజీవులని అరికట్టే వాక్సిన్ లు రూపొందించి మనుషులనే కాక, జంతువులను కూడా ఎన్నో భయంకరమైన వ్యాధుల నుంచి కాపాడారు. పాశ్చర్ 1822 సంవత్సరం డిసెంబరు 27న ఫ్రాన్స్ లోని డోల్ గ్రామంలో జన్మించాడు. పాశ్చర్ పాఠశాలకు వెళ్ళకుండా కొంతవరకు విద్యావంతుడయ్యాడు. చిత్రలేఖనంలో మంచి ప్రతిభ కనపరిచేవాడు. తల్లిదండ్రులతో పాటు ఇరుగుపొరుగు వారివి, స్నేహితులవి బొమ్మలు పెయింట్ చేశాడు. గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రాలంటే ఇష్టమున్న పాశ్చర్ ఉపాధ్యాయ జీవితాన్ని గడపాలను కొనేవాడు. పదహారేళ్ల వయసులో కాలేజీ చదువు కోసం పారిస్ లో అడుగుపెట్టాడు. డాక్టరేట్ పూర్తిచేసి 1848లో స్ట్రాస్ బర్గ్ విశ్వ విద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా నియమితులయ్యారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కూతురు మేరీ లారెంట్ ను పెళ్ళిచేసుకోగా, అయిదుగురు పిల్లలు పుట్టినా, టైఫాయిడ్ వల్ల ఇద్దరు, మశూచి వల్ల ఒకరు, ముగ్గురు మరణించారు. పాశ్చర్ అంగారక పదార్థాలు ధ్రువిత కాంతిని ఏ విధంగా విచలనం చెందిస్తాయో అధ్యయనం చేసి "స్టీరియో కెమిస్ట్రీ" అనే కొత్త రసాయన శాస్త్రాన్ని రూపొందించారు. తరువాత తన పరిశోధనలను పులియడం (ఫెర్మెంటేషన్ ) వంటి అంశాలపై కొనసాగించి సూక్ష్మక్రిములపై అనాదిగా ఉన్న భావాలను ఖండించి కొత్త సిద్ధాంతాలను రూపొందించాడు. ద్రాక్షసారా (వైన్) వల్ల వచ్చే వ్యాధులు, నిల్వచేసే పద్ధతులు, వెనిగర్ తయారీ మొదలైన అనేక అంశాలపై కొత్త విషయాలు కనుగొన్నాడు. రేబీస్ అనేది వైరస్ ల వల్ల కలిగే ఓ భయంకరమైన వ్యాధి. అది కుక్కల నుండి మనుషులకి సోకుతుంది. ఈ వైరస్ బాక్టీరియాల కన్నా అతి చిన్నదైన వస్తువు. కనుక పాశ్చర్ వాడిన సూక్ష్మదర్శినిలో ఇది కనిపించ లేదు. ఆ వైరస్ వ్యాధితో కేంద్ర నాడీ వ్యవస్థ పై ప్రభావితం చేస్తుంది. పాశ్చర్ ఆ వ్యాధి సోకిన జంతువుల వెన్నుపాము నుంచి ద్రవం సంగ్రహించి, వివిధ పద్ధతుల చేత ఆ ద్రవం యొక్క రోగ తీవ్రతని క్షీణపరిచి, ఆ ద్రవాన్ని తిరిగి కుక్కల మీదకి ఎక్కించి రేబీస్ కి వాక్సిన్ ని రూపొందించారు. కోళ్లకు వచ్చే కలరా వంటి పారుడు వ్యాధిపై పరిశోధన జరిపి వ్యాధి కారకాలైన సూక్ష్మజీవులను బలహీనపరచి ఇతర కోళ్ళకు ఎక్కించి వాటిలో రోగనిరోధక శక్తి పెరిగి తర్వాత కాలంలో రోగం రాకుండా రక్షిస్తుందని నిర?యానికి వచ్చారు. 1870 దశాబ్దంలో టీకా పద్ధతులను పశువులలో వచ్చే ఆంత్రాక్స్ వ్యాధి మీద ప్రయోగించాడు. ఈ విధంగా కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. అందువలన మనిషులు గాని, జంతువులు గాని అంటు వ్యాధితో మరణిస్తే ఆ శవాన్ని దహనం చేయాలని చెప్పారు. భూమిలో పాతిపెడితే శరీరంలోని క్రిములు బయటకు వచ్చి వాటివలన ఇతరులకు ఆ వ్యాధులు వ్యాపిస్తాయని వివరించాడు. పాశ్చర్ తన పూర్తి జీవితాన్ని శాస్త్ర పరిశోధనలకు అంకితం చేశారు. సంకల్ప బలం, నిరంతర శ్రమతో విజయాన్ని సాధించవచ్చని పాశ్చర్ విశ్వాసం. పాశ్చర్ సూక్ష్మ జీవశాస్త్రంలో అత్యుత్తమ గౌరవమని పిలిచే లీవెన్ హాక్ బహుమతిని 1895లో పొందాడు. రెండు సార్లు గుండె పోటు, తరువాత పక్షవాతం వచ్చినా జీవితాంతం పరిశోధన చేసి మానవాళికి వెలకట్టలేని సేవ చేసిన పాశ్చర్ 1895 సెప్టెంబరు 28న పరమపదించారు. లూయిస్ పాశ్చర్ జ్ఞాపకర్థంగా ఆయన మరణించిన రోజైన సెప్టెంబరు 28న ప్రపంచ రేబీస్ దినోత్సవం జరుపు కుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# మాల ధారణం... నియమాల తోరణం



మంచు కురిసే శీతాకాలం ప్రారంభమయిందంటే స్వామియే శరణం అయ్యప్పా అని భక్తాగ్రేస రుల భజనలు పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రతిధ్వనిస్తాయి.

గతంలో పట్టణాలకు మాత్రమే పరిమిత మైన ఈ దీక్షలు, నేడు మారుమూల గ్రామాలకు సైతం విస్తరించి, భక్తజనం నానాటికీ పెరుగుతు న్నది. కార్తీక మాసం ప్రారంభం నుండి వివిధ సమయాలలో ఆచరించే అయ్యప్ప స్వామి దీక్షలు భక్తి శ్రద్ధలకు, పవిత్రతకు, నియమాలకు ప్రతీకలు.

**అయ్యప్ప అవతారము...** ప్రతి యుగంలోనూ ధర్మసంస్థాపనార్ధం శ్రీమహా విషు?వు అవతారాలెత్తుతూ సనాతన ధర్మాన్ని సంరక్షిస్తాడు. కాని దత్తాత్రేయుడు భక్తజనోద్ధరణ కొరకు శాశ్వత అవతార పురుషుడుగా భూమి యందు అవతారాలు ఎత్తుతూ 'చతుర్యుగ అవ తార మూర్తి'గా ఖ్యాతినొందాడు. త్రిమూర్తుల అంశాలుగా జన్మించిన దత్తాత్రేయుని అవతారాల్లో ఒకటి అయ్యప్పస్వామి, మోహిని రూపంలో ఉన్న హరికి, శివునికీ కలిగిన పుత్రుడైనందున 'హరిహర సుతుడని' ధర్మశాస్త్రా, భూతనాథుడు, అయ్యప్ప అని కీర్తించ బడుతున్నాడు.

మహావిషువుచే మణి హారమును మెడలో వేయబడి నందున 'మణికంఠుడని' సార్ధక నామధేయుడైనాడు. పాండ్య దేశ రాజైన రాజశేఖరుడు, మహారాణి పేరిందేవి, ప్రేమతో అయ్య, అప్ప' అని పిలిచినందున 'అయ్యప్ప'గా పిలువబడు తున్నాడు. రాజశేఖర మహారాజు, అగస్త్య మహాముని' ఆదేశానుసారం 'ఎరుమేలి వద్ద ధర్మశాస్తా దేవాలయంను నిర్మించెను.

శబరి తపస్సు చేసిన స్థలంలో విశ్వకర్మ అయ్యప్ప దేవాలయమును, ఎడమ వైపు మాలికాపురత్తమ్మ ఆలయాన్ని, అయ్యప్ప ఆలయానికి తూర్పున 18 మెట్లు, వాటికిరువైపుల కరుప్ప, కడుత్త దేవాలయాలు నిర్మించెను. పవిత్రమైన మకర సంక్రాంతి రోజు శనివారం కృష పంచమి, ఉత్తరా నక్షత్రాన పరుశురాముడు అయ్యప్ప విగ్రహాన్ని ప్రతిష్టించెను.

**మాల ధారణం...** 18సార్లు శబరిమల పదునెట్టాంబడిని అధిరోహించి, దైవ సాక్షాత్కారం కలిగిన గురుస్వామి మంత్రోచ్ఛారణలతో మాలధారణ చేస్తాడు. దీక్షా నియమాలు త్రికరణ శుద్ధిగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయిస్తాడు. ఏకాగ్రతతో అత్మ సాక్షాత్కారార్థమై పాపములు తొలుగుటకు, లౌకిక విషయాలపై వ్యామోహం తగ్గుటకు, కోపతాపాలు ఉపశమించేందుకు ఉదయం, సాయంత్రం 108 సార్లు శరణు ఘోష చేస్తూ, 41 రోజులకు తక్కువ కాకుండా దేవుడిని పూజిస్తూ సాధన చేయడం సాంప్రదాయం. నల్ల దుస్తులు ధరించుట, నుదుటిపై విభూతి చందన, కుంకుమలు ధరించుట, తులసి, రుద్రాక్ష మాల ధారణం, బ్రహ్మచర్యం, సాత్వికాహారం, భజన, అన్నదానం, పవిత్ర స్నానాలు, వైరాగ్య సంకే తాలైన గడ్డం, గోళ్లు పెంచుట దీక్షలో ప్రధానాంశాలు. కొబ్బరికాయ మూడు కన్నులలో ఒక కన్నుకు రంధ్రం చేసి, నీటిని తొలిగించి పరిశుద్ధ మైన నెయ్యితో నింపి, ఇరుముడిలో ఒక ముడిలో కడుతూ, రెండవ ముడిలో యాత్రకు కావలిసిన ఆహార పదార్థాలు కడతారు. ఇరుముడిని తలపైకి ఎత్తుకున్నాక వెనక్కు తిరిగి చూడక బయలుదేరు తారు. ప్రయాణంలో ఎరుమేలి, కాళికట్టి, అశుదా నది, కలిడంకుంద్రం, కరిమల, పంపానది, నీలి మలై, శరంగుత్తియాల్, శబరిపీఠం, సన్నిదానం చేరుకుంటారు. 41రోజులకు తక్కువ గాకుండా గురుస్వామి ద్వారా 108 పూసలు గల తులసి లేదా రుద్రాక్ష మాలధారణ, ఉదయం, సాయంత్రం చన్నీటి స్నానం విభూతి, చందనం, కుంకుమ ధరించి 108 సార్లు అయ్యప్ప శరణు ఘోష పలకడం, కర్పూర హారతి, ఫలాదిక సమర్పణం దుస్తులు ధరించడం, రోజుకొక్క సారైన దేవాలయ సందర్శనం చేస్తారు. ఇవే కాకుండా పాదరక్షలు తొడగక పోవడం, ధూమపానం మత్తు పదార్థాలు, తాంబూలం, మాంసాహార నిషేధం, ఒక్కసారి భోజనం, అల్పాహారం, క్షవరం, గోళ్ళు తీయడం నిషేధం. మంచంపైగాక చాపపై మాత్రమే నిద్రించడం, పగలు నిద్రించక పోవడం, దీక్షాకాలంలో బ్రహ్మచర్యం పాటించడం, వినోద కార్యక్రమాలు చూడక పోవడం, స్నానం చేసే వరకు మంచినీరు త్రాగక పోవడం, కుల మత ధనిక పేద భేదం లేక అయ్యప్పలకు నమస్కారం చేయడం, ఆధ్యాత్మిక పుస్తక పఠనం, సత్సంగం, విధిగా భజనలో పాల్గొనడం, కనీసం మూడు సార్లయినా ఇతరుల యింటికి భిక్షకు వెళ్ళడం, అన్న దానం చేయడం అయ్యప్ప దీక్షా సమయంలో విధిగా పాటించాల్సిన నియమాలు. మొదటిసారి దీక్షను తీసుకున్న కన్నెస్వాములు మకర సంక్రాంతి సమయంలో కనిపించే మకర జ్యోతిని సందర్శించు కుంటారు. చాలా వరకు స్వయంపాకాన్నే భుజిస్తూ ఒకపూట భోజనం, ఒకపూట అల్పాహారం మితంగా భుజిస్తూ, దీక్షను స్వీకరించేవారు దైవభక్తి, ఆత్మ సంయమనంతో పాటు, ఆరోగ్యవంతులుగా ఉండ గలరనేది నిర్వివాదాంశం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

చురకలు

## సంపాదకీయం

# బంగారు నక్క తోక తొక్కిన చైనా!

అన్ని రంగాల్లోనూ తనదైన శైలిలో దూసుకుపోతూ, అమెరికాకున్న అగ్రరాజ్యం అనే టైటిల్ కు ఎప్పుదు చెక్ పెట్టేద్దామా అన్నట్లుగా ఎదురు చూస్తోన్న డ్రాగన్ కంట్రీ చైనాకు ప్రకృతి ఓ గుడ్ న్యూస్ చెప్పింది! ఇందులో భాగంగా... చైనా తూర్పు లియానింగ్ ప్రావిన్స్ లో దేశ చరిత్రలోనే అతిపెద్ద బంగారు గని కనుగొనబడింది. దీంతో.. చైనా బంగారు నక్క తోక తొక్కిందా అనే కామెంట్లు వినిపిస్తున్నాయి. అవును... 1949 తర్వాత చైనాలో తాజాగా ఓ అతిపెద్ద బంగారు నిక్షేపం కనుగొనబడింది. గత ఏడాది భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు కనుగొన్న గని కంటే ఇది చాలా పెద్దది. అది సుమారు 83 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దాచిపెట్టగా.. తాజా గనిలో సుమారు 1440 టన్నుల బంగారం నిల్వలున్నాయని.. దీని మొత్తం విలువ సుమారు 192 బిలియన్ డాలర్లు ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే... భారత కరెన్సీలో సుమారు 17,08,000 కోట్ల రూపాయలు అన్నమాట! ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, శాటిలైట్స్, అత్యాధునిక టెక్నాలజీతో ఈ గనిని గుర్తించారు. దీనికి సంబంధించిన ప్రాజెక్టులో సుమారు వెయ్యి మంది ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 15 నెలలపాటు అన్వేషించి, తవ్విన తర్వాత ఈ స్థాయిలో భారీ బంగారు గని బయటపడిందని చెబుతున్నారు. గతంలో బంగారు గని అభివృద్ధి భాగస్వామ్యాన్ని ఏర్పరచుకున్న తర్వాత.. చైనా నేషనల్ గోల్డ్ గ్రూప్, లియోనింగ్ మినంల్ జియాలజీ గ్రూప్, యింగ్ కౌ మునిసిపల్ ప్రభుత్వం.. తాజాగా ఓ భారీ పారిశ్రామిక సముదాయాన్ని నిర్మించడం ద్వారా స్థానిక బంగారు పరిశ్రమను ప్రోత్సహించడానికి సుమారు 2.82 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నాయి.

**బహుశా ఎప్పటినుంచో వెతుకుతున్న 'ఎల్ డోరాడో' ఇదే కావొచ్చు!:** ఈ సందర్భంగా స్పందించిన సీపీసీ షెన్యాంగ్ మున్సిపల్ పార్టీ స్కూల్ ప్రొఫెసర్ వాంగ్ యాన్.. చైనా డైలీతో మాట్లాడుతూ.. ఈ గనిలోని వెయ్యి టన్నులకు పైగా నిల్వలు జాతీయ బంగారు వ్యూహాత్మక నిల్వలను గణనీయంగా భద్రపరుస్తాయని అన్నారు. ఇది ప్రపంచ మార్కెట్ లో దాని పోటీతత్వాన్ని మరింత పెంచుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే.. బహుశా మనం ఎప్పటినుంచో వెడుతుకున్న ఎల్ డొరాడో ఇదే కావొచ్చు అనే కామెంట్లు ఇప్పుడు చైనా నుంచి వినిపిస్తున్నాయి. కాగా.. ఎల్ డొరాడో అనేది ఒక పౌరాణిక నగరం! ఇది బంగారంతో నిండి ఉందని నమ్ముతారు. దీనికి స్పెయిన్ లోని పురాణగాథల నుంచి మూలాలు ఉన్నాయి.

# తాత మాటలే విప్లవ బాట పట్టించాయి.!

### -ఎన్కౌంటర్ తర్వాత గణేష్ లేఖ వైరల్

### కంట తడి పెట్టిస్తున్న హనుమంతు (గణేష్ ఉయికె) తల్లికి రాసిన ఉత్తరం



చురకలు,నల్గొండ జిల్లా ప్రతినిధి -డిసెంబర్ 25న ఒడిషాలోని కాంథమాల్ అటవీ ప్రాంతంలో పోలీసులు ఎన్కౌంటర్లో మావోయిస్టు కేంద్ర నాయకుడు పాక హనుమంతు అముద్రిత రచన ఇది. ఆయన సుమారు మూడు ఏళ్లక్రితం తన తల్లికి రాసిన లేఖ గణేశ్ మరణానంతరం అభ్యమైంది. 2022 సెప్టెంబర్‌లో తన తండ్రి మరణించాడనే వార్త విని ఆయన ఈ రచన చేసినట్లు ఇందులోని ఆధారాలనుబట్టి తెలుస్తోంది. ఆయన తల్లి కూడా ఆ తర్వాత దుఠరే దారిద్ర్యంలో, అనారోగ్యంతో, వయో భారంతో మరణించింది. ఇంతకూ ఈ లేఖ జీవించి ఉన్నప్పుడు ఆ తల్లికి చేరిందో లేదో తెలియదు. కొడుకు ఉత్తరంతో సుదీఠ నిరీక్షణ భారం నుంచి ఆమెకు సాంత్వన కుదిరిందో లేదో తెలియదు. ఆయన మరణ సందఠరేలో కూడా ఒక ప్రముఖ దిన పత్రిక దీన్ని ప్రచురించకుండా తిరస్కరించినప్పటికీ, పాఠకులకు ఇది చేరాలని భావిస్తూ..

**ప్రియమైన అమ్మా**

%ఈ విషాద సమయం ఇలా వస్తుందనుకోలేదు. 90 సంవత్సరాల వయసులో నాన్న సెప్టెంబర్ 30, 2022న మనల్ని వదిలి వెళ్లిపోయాడనే దుఃఖకరమైన సమాచారాన్ని పేపర్లో చూశాను. నేను మిమ్మల్ని విడిచి విప్లవ పథంలో అడుగు పెట్టాక నాన్న మరణ వార్తతో నాకు నాలుగు దశాబ్దాల కిందటి విషయాలన్నీ గుర్తుకు వచ్చాయి. నీతో, నాన్నతో, మన కుటుంబసభ్యులతో, ఊళ్లో వాళ్లతో గడిపిన రోజులన్నీ నా మనసులోకి వచ్చాయి. నేను విప్లవంలోకి రావడానికి ముందు మీ అందరి ప్రేమతో, వాత్సల్యంతో జీవించడం వల్లే ఇప్పుడు ఇలా నేను ఎంచుకున్న మార్గంలో నడవగలుగుతున్నానని అనిపించినప్పుడల్లా మీ అందరి మీదా మరింత గౌరవం కలుగుతోంది. ముఖ్యంగా నాన్న నా కోసం, నా తోబుట్టువుల కోసం, మన ఇంటి కోసం ఎంతో కష్టపడ్డాడు. ఈ దేశంలో సగటు మానవులందరూ అలా జీవిస్తున్నవారే. అందులోని బాధ్యత, ప్రేమ, శ్రమ చేసే సుగుణం చాలా గొప్పవి.

చిన్నప్పుడు మా తాత పుల్లయ్య, నాయనమ్మ పెద్దమ్మ ఒడిలో ఆటలాడుకున్న రోజులు నా బాల్యమంత సజీవమైనవి. నాన్న మోటగొట్టి, పొలం, చెలక దున్ని, పెంటకొట్టివిత్తనాలు వేసి పంటలు పండించేవాడు కదా. ఆయన చేసిన కష్టమంతా నీదే. మీ ఇద్దరు కడు బీదతనంతో మమ్మల్ని సాదడానికి అప్పులు చేసి ఎన్ని కష్టాలు పడ్డారో కదా. అంత శ్రమ చేసినా ఆ రోజుల్లో మన కుటుంబమంతా పస్తులు వున్న రోజులూ ఉన్నాయి. నాకు అవన్నీ చెరగని జ్ఞాపకాలే. ఈ దేశంలో మన లాంటి ఎన్నో కుటుంబాలు అట్లా బతుకుతున్నవే. మీరు కడుపు కట్టుకొని మమ్మల్ని సాదిన తీరు నాకు ఎప్పుడూ గుర్తు వస్తుంటుంది. తల్లిదండ్రులందరూ ఎవరైనా, ఎక్కడైనా ఇట్లాగే ఉంటారని నాకు ఆ తర్వాత చాలాసార్లు అనుభవంలోకి వచ్చింది. అంత కష్టంలో కూడా మీకు భవిష్యత్‌పై గొప్ప ఆశ ఉండేది. బహుశా మన సొంత జీవితంలో మీరు చూసిన ఆశే నాకు మానవాళి మీద, ఈ దేశ చరిత్ర మీద ఆశావాదంగా మారింది కావచ్చు. అందుకే నీవూ, నాన్నా ఆ రోజుల్లో చెప్పిన మాటలు నేనెన్నటికీ మరువలేను.

ఇంటి పెద్దకొడుకుగా నాపై మీరు చూపిన అమితమైన ప్రేమ, వాత్సల్యం, నమ్మకం నన్ను నా విప్లవ పంథాలో సదా రాటుదేలుస్తున్నాయి. ఆ రోజుల్లో నేను చదువుకోడానికి మన ఊరు నుండి నల్లగొండ టౌన్‌కు వెళ్లడానికి బస్ కిరాయికి కూడా డబ్బులు లేకపోతే నీవు రెండు రోజులు నాట్ల కూలికి పొయ్యి తెచ్చి ఇచ్చిన డబ్బులతో నేను బయల్దేరాను. నేను పై చదువులు చదివి ఏదైనా కొలువు చేసి కుటుంబాన్ని సాదుతానని మీరు అందరు అమ్మనాన్నల్లాగే అనుకున్నారు. కానీ, నేను విప్లవ మార్గం ఎంచుకున్నాను. అయితే నేను ఆ బాధ్యతల నుండి తప్పుకోలేదని, సరైన దారిలోనే ఉన్నానని మీరు ఆ తర్వాతైనా అర్థం చేసుకున్నారని తెలిసి చాలా సంతోషించాను. నేను ప్రాథమిక చదువులు చదువుతున్న రోజుల్లో తాత పుల్లయ్య తాను నలభయ్యవ దశకంలో నల్లగొండ జిల్లలో జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న అనుభవాలను చెప్పేవాడు. ఆ రోజుల్లో గ్రామాల్లో కొనసాగుతున్న దొరల దౌర్జన్యాలను, దోపిడి పీడనలను, వెట్టిచాకిరీని ఆయన కళ్ళకుకట్టినట్టుగా చెప్పేవాడు కదా. ఆనాడు కమ్యూనిస్టు గెరిల్లాలను అణచడానికి నైజాం పోలీసు బలగాలు, రజాకార్ల దాడులు, నెహ్రూ, పటేల్ నాయకత్వంలోని భారత సైన్యం నల్లగొండ జిల్లాను ఎట్లా చుట్టుముట్టినవో చెప్పేవాడు. గ్రామాలలో పేదల ఇండ్ల దహనం, లూటీలు, దౌర్జన్యాలు, మహిళలపై కొనసాగించినఅత్యాచారాలు ఒక్కొక్క ఘటనను వివరంగా చెప్పేవాడు.

మన పల్లెల్లో తాతలాగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న అనుభవం ఉన్న పెద్దలు ఎంతో మంది ఉన్నారని నాకు కాస్త పెద్దయ్యాక తెలిసింది. అట్లాగే ఆనాటి విప్లవ వారసత్వాన్ని, వేలాది మంది అమరుల త్యాగాలనూ ఎత్తి పడుతూ నక్సల్బరి, శ్రీకాకుళ పోరాట యోధులు కొనసాగుతున్నారని తెలుసుకున్నాను. అంతగా తాత తన పోరాట అనుభవాలతో నా మీద చెరగని ముద్ర వేశాడు. ఆయన మాటల వల్ల నా యవ్వన కాలంలో నేను సమాజంలో జరుగుతున్న దోపిడి, అసమానతల గురించి సీరియస్‌గా ఆలోచించే అవకాశం కలిగింది. విప్లవ రాజకీయాలతో ప్రభావితమై రాడికల్ విద్యార్థి సంఘంలో సభ్యుడిగా చేరి జిల్లా కమిటీలో వుంటూ పనిచేశాను. 1981లో కాలేజీలో డిగ్రీ చదువుతూ కాలేజీ చదువులను మధ్యలో వదిలేసి, మనలాంటి పేద ప్రజల బతుకులు బాగుపడాలని, కోట్లాది పేద రైతులను, మీలాంటి తల్లి దండ్రులను, ప్రజలను దోపిడి పీడనల నుండి, మహిళలను పితృస్వామ్యం అణిచివేతల నుండి అత్యాచారాల నుండి, విముక్తి చెయ్యాలనే ఒక న్యాయమైన ఆలోచనతో విప్లవోద్యమంలోకి వెళ్లాను. నీవూ నాన్న అందించిన నిజాయితీ, శ్రమ చేసే తత్వం, తాత అందించిన పోరాట అనుభవాలు నన్ను ఇప్పటికీ నడిపిస్తున్నాయి. మీరు నేర్పిన మానవీయ విలువలు సామాజిక విలువలుగా, విప్లవ ఆదర్శాలుగా, విప్లవాచరణగా నాలో మారాయని చెప్పడానికి సంతోషిస్తున్నాను. స్వార్థం లేకుండా జీవించాలనే విలువ నా విప్లవ ప్రస్థానాన్ని నిత్యం గట్టిబరుస్తున్నాయి.

ఈ నలభై ఏళ్లలో పోలీసు బలగాలు అనేకసార్లు మన యింటిపై దాడులు చేసి మిమ్మల్ని ఇబ్బంది పెట్టినట్లు నేను తెలుసుకున్నాను. ముఖ్యంగా నాన్నను చండూర్ పోలీసు స్టేషన్ తీసుకెళ్లి నా ఆచూకి కోసం అవమానపరుస్తూ హింసించారు. నన్ను లొంగిపొమ్మని పత్రికా ముఖంగా ప్రకటించాలని నాన్నను ఎన్నోసార్లు వేధించినప్పటికీ ఆయన తలవంచలేదు. ఒక విషయంలో స్పష్టత ఉంటే ఎన్ని కష్టాలు వచ్చినా దాని కోసం నిలబడి ఉండాలనే విలువను ఆయన తన సొంత జీవితంలో పాటించాడు. నా వల్ల వచ్చిన నిర్బంధాన్ని తట్టుకొనే విషయంలోనూ కొనసాగించాడు. కార్మికులు, రైతులు, దళితుల, మహిళల విముక్తి కోసంవిప్లవకారునిగా నా కొడుకు పని చెయ్యడాన్ని గర్వంగా భావిస్తున్నానని ధైర్యంగా చెప్పేవాడని తెలుసుకొని నేను ఉప్పొంగిపోయాను. మీవంటి తల్లిదండ్రులు ఈ దేశంలో వేల, లక్షల మంది ఉన్నారు. దేశవ్యాపితంగా విప్లవోద్యమం పురోగమించడంలో వీలాంటి తల్లిదండ్రుల ఆకాంక్షలు కూడా భాగం. అలాంటి ఆలోచనలతోనే నాన్న తన తుది శ్వాస వదిలి ఉంటాడని నేను ఊహించగలను.

ఈ రోజు అనేక మంది విప్లవకారులు తమ ప్రియమైన తల్లిదండ్రులను తోడబుట్టిన వాళ్లను తలచుకోవడమే తప్ప కలుసుకోలేని విధంగా దోపిడీ రాజ్యం నిర్బంధం విధించింది. విప్లవకారులను హత్య చెయ్యడానికి తహతహలాడుతూ తలలకే కాదు మేం ధరించిన ఆయుధాలకూ బహుమతులు ప్రకటించింది. అనేక కుట్రలు, కూహకాలతో దేశవ్యాప్తంగా ఆల్‌ఔట్ వార్ కొనసాగిస్తున్నది. బీహార్–జార?ండ్ మొదలుకొని దండకారణ్యం, ఒడిశా, తెలంగాణ వరకూ దాదాపు 7 లక్షల పోలీసు, కమాండోలు, అర్థ సైనిక బలగాలను మోహరించి కార్పెట్ సెక్యూరిటీని విస్తరింప చేస్తూ దేశవ్యాప్తంగా విప్లవోద్యమాన్ని 2022 వరకు సమూలంగా నిర్మూలించాలని ఆపరేషన్ సమాధాన్ పేరుతో బహుముఖ దాడులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాయి. పట్టణ ప్రాంతాల్లో ప్రజాస్వామిక, అభ్యుదయ, విప్లవ ప్రజాసంఘాల నాయకులపై మేధావులపై, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అణచివేత ప్రయోగిస్తున్నది. తెలంగాణ ప్రభుత్వంతో సహా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంతో మిలాఖత్ అయి అర్బన్ నక్సలైట్ల పేరుతో వాళ్లను నిర్బంధిస్తున్నాయి. దేశీయ, విదేశీ కార్పొరేట్ సంస్థల దోపిడీ కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఈ విధానాలను వ్యతిరేకిస్తూ పోరాడుతున్న ఆదివాసుల మీద అర్ధ సైనిక బలగాలను, పోలీసు కమాండోలు యుద్ధం చేస్తున్నాయి. డ్రోన్ల ద్వారా బాంబులను గుమ్మరిస్తున్నారు. ఈ ఫాసిస్టు నిర్బంధం మూలంగా రక్తసంబంధీకులు మరణించిన సందఠరేలో కూడా మేం మిమ్మల్ని కలవలేకపోతున్నాం. విప్లవకారులు అమరులైనప్పుడూ, వాళ్ల రక్త సంబంధీకులు చనిపోయినప్పుడూ ఎందరో ప్రజలు, ప్రజాసంఘాల సభ్యులు కలిసి అంతిమ వీడ్కోలు పలికే సంప్రదాయం చాలా ఏళ్లుగా కొనసాగుతున్నది. నాన్నను కూడా అట్లే గౌరవంగా సాగనంపారని తెలిసి ఈ విషాదంలో కూడా సంతోషం కలిగింది. వాళ్లందరికీ విప్లవాభివందనాలు తెలియజేస్తున్నాను. ఉంటాను..

**నీ బిడ్డ**
**పి. హనుమంతు**
**కేంద్ర కమిటీ సభ్యుడు**
**15 నవంబర్, 2022**
**(అవని న్యూస్ వెబ్ సైట్ సౌజన్యంతో)**

# డిసెంబర్ 27...జనగణమన మొదటిసారి కలకత్తా కాంగ్రెసు సభలో పాడిన దినం




భారత జాతీయ గీతమైన జనగణమన 1911లోరవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన, మొదటిసారి పాడిన గీతాన్ని 1911 డిసెంబర్ 27 న కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో మొదటి సారిగా పాడారు. జనగణ మన భారత జాతీయగీతం. నోబెల్ బహుమతి గ్రహీత, రవీంద్రనాథ్ టాగోర్ రాసిన బెంగాలీ గీతం లోని మొదటి భాగం ఇది. భారత జాతీయ గీతం సంస్కృత పద భూయిష్టమైన బెంగాలీ భాషలో ఉంది. 1912 జనవరిలో ఈ గీతాన్ని "తత్వ భోదిని" అనే పత్రిక "భారత విధాత" అనే పేరుతో ప్రచురించింది. 1950 జనవరి 24 న జాతీయగీతంగా రాజ్యాంగ సభ స్వీకరించింది. ఈ గీతానికి సంగీత బాణీ కూడా ముందుగా ఠాగూర్ సృష్టించారు. బాణీ కనుగుణంగా ఈ గీతాలాపన చేసేందుకు 52 సెకండ్లు పడుతుంది. అప్పుడ ప్పుడు మొదటి, చివరి పాదాలను మాత్రమే పాడే పద్ధతి కూడా ఉంది. దీనికి 20 సెకండ్లు పడుతుంది. భారతదేశ జాతీయగీతం 'జనగణమన' గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నిజానికి 1911లోనే రాశారు. అదే ఏడాది డిసెంబర్ 27న కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో దానిని ఆలపించారు. ఆ తర్వాత కూడా జాతీయోద్యమం నేపథ్యంలో ఆ గీతాన్ని అనేక సార్లు, అనేక వేదికల మీద ఆలపించారు. అయితే ఇప్పుడు మనం వినే ట్యూన్‌లో కాకుండా, నిర్దిష్టమైన స్వర కల్పన లేకుండా, ఎవరికి నచ్చిన రాగంలో వాళ్లు పాడుకునే వారు. జనగణ మనకు ఆ స్వరాన్ని కట్టింది ఒక ఐరిష్ జాతీయు రాలైతే... దానికి వేదికైంది చిత్తూరు జిల్లా మదనపల్లె అనే విషయం చాలా మందికి తెలియని తెలియదు. భారత స్వాతంత్రో ద్యమాన్ని బలపరిచిన డాక్టర్ అనీబిసెంట్ మదన పల్లెలో థియోసాఫికల్ కాలేజీని స్థాపించారు. ఐరిష్ జాతీయుడైన ప్రముఖ విద్యావేత్త జేమ్స్ హెన్రీ కజిన్స్ దాని ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. లండన్ మ్యూజిక్ కాలేజిలో చదువుకున్న ఆయన భార్య మార్గరెట్ కజిన్స్ అక్కడ సంగీతాన్ని నేర్పించేవారు. 1919లో దక్షిణ భారతదేశ పర్యటనలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ ఒకరోజు బెంగళూరు చేరుకున్నారు. అక్కడ ఉన్నపుడే ఆయనకు మదనపల్లె వాతా వరణం, జేమ్స్ కజిన్స్ కవిత్వం అంటే చాలా ఇష్టమైన ఠాగూర్, కజిన్స్ అక్కడే ఉన్న విషయం తెలుసుకుని, ఆయన విశ్రాంతి కోసం మదనపల్లెలోని థియోసాఫికల్ కాలేజీ చేరు కున్నారు. ఠాగూర్‌కు ప్రశాంత వాతావరణం కలిగిన థియో సాఫికల్ కాలేజీలో ప్రతి బుధవారం భోజనాల తర్వాత విద్యార్థులంతా కలిసి పాటలు పాడేవాళ్లు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఠాగూర్, ఒక కార్యక్రమంలో పాల్గొని, ఆ సందఠరేగా ఆయన స్వయంగా తన గొంతుకతో జనగణ మన ఆలపించారు. ఠాగూర్ కంఠస్వరం నుంచి వెలువడిన ఆ పాటకు విద్యార్థులంతా గొంతు కలిపారు. మార్గరేట్ కజిన్స్ కూడా ఆ సమయంలో అక్కడే ఉండి, పాటలోని దేశభక్తిని, జాతీయ భావాన్ని గమనించారు. కానీ అప్పటికి జనగణమనను ఎవరికి వారే తోచిన రీతిలో పాడుకునే వారు. ఎవరూ రాగయుక్తంగా పాడ లేదు. కనుక దానిని తానే స్వర బద్ధం చేయాలని నిర?యించు కున్నారు. తెల్లవారి ఆమె ఠాగూర్ ను కలిసి జనగణమనను స్వర బద్ధం చేయాలన్న తన కోరికను వెలి బుచ్చారు. దీనికి అంగీక రించిన ఠాగూర్, ఆమెకు ఆ పాట అర్థాన్ని వివరించారు. దానికి స్వరం ఎలా ఉంటే బాగుంటుందో సూచిం చారు. తర్వాత మార్గరేట్ కజిన్స్ తన విద్యార్థినుల సహాయంతో ప్రతి పదానికి అర్థం తెలుసుకుంటూ దానికి. బాణీ సమకూర్చారు. తర్వాత ఠాగూర్‌కు తాను కట్టిన స్వరాన్ని వినిపించారు. కొన్ని చిన్న చిన్న సంగీత పరికరాలతో విద్యా ర్థులు రాగయుక్తంగా పాడిన జనగణమన గీతాన్ని విన్న ఠాగూర్ ఆమెను ఎంతగానో అభినందిం చారు. బెంగాల్‌లో పుట్టిన జనగణ మన గీతం మదనపల్లెలో స్వరాన్ని సమకూర్చు కున్నది. రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లెలో ఉన్న సమయంలోనే ఒక ఉదయాన థియోసాఫికల్ కాలేజీ ప్రాంగణం లోని చెట్టుకింద కూర్చుని జనగణమనను ఆంగ్లం లోనికి అనువదించారు కూడా. ఆ తర్వాత దానిని తన అందమైన చేతిరాతతో రాయడమే కాకుండా, కింది భాగంలో దాని పేరు 'మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా' అని రాశారు. దాని కింద ఫిబ్రవరి 28, 1919 అని రాసి, సంతకం చేసి, మార్గరేట్ కజిన్స్‌కు బహుమానంగా ఇచ్చారు. మదనపల్లె కాలేజీ వదలివెళ్లే ముందు ఠాగూర్ దానిని 'దక్షిణ భారతదేశపు శాంతినికేతన్' అని కీర్తించారు. నిజానికి జనగణమన దేశభక్తి గేయం. 'జన గణ మన' ఇక నుంచీ మన కొత్త గణతంత్ర రాజ్యానికి జాతీయ గీతమనీ, దీన్ని అంతా గౌరవించి ఆదరించాలనీ 1950 జనవరి 24న రాజ్యాంగ సభ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఓ ప్రకటన చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహోన్నత పాత్ర పోషించిన 'వందేమాతరం' గీతాన్ని కూడా జన గణ మనతో సమానంగా గౌరవించి ఆదరించాలి" అని ఆ రోజున రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. భారతదేశ రాజ్యాంగం ఆర్టికల్ 51ఏలో ఈ గీతాన్ని గౌరవించా లంటూ ప్రజలకు విజ్ఞప్తి చేసిన ప్రస్తావన కనిపిస్తుంది. "ప్రతి పౌరుడూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. జాతీయ పతాకం, జాతీయ గీతం వంటి రాజ్యాంగ ఆదర్శాలు, లక్ష్యాలు, సంస్థలను గౌరవించాలి" అని ఈ చట్టం పేర్కొంటున్నది. ప్రార్థనగా, కృతజ్ఞతగా పఠించే 52 సెకన్ల ఈ చిన్న గీతానికి ఉన్నంత గుర్తింపు , భారత దేశంలో, ప్రపంచంలో కూడా మరే గీతానికీ లేదు. మన జాతీయ గీతం దేశ సమైక్యతకు సరైన ప్రతీకగా నిలిచింది. జాతీయ గీతం, జాతీయ పతాకం పట్ల గౌరవం, ప్రేమాభిమానాలు ప్రదర్శించడ మంటే మాతృభూమిని గౌరవించుకోవడమే అవుతుంది. ఇది ప్రతి ఒక్కరిలో దేశభక్తిని, జాతీయ భావాన్ని నింపడానికి ఉపకరిస్తుంది. జనగణమన పాడినప్పుడు దాని అర్థాన్ని కూడా ఒక్కసారి మననం చేసుకోవాలి. దాని నేపథ్యాన్ని, అర్థాన్ని, ప్రాధాన్యతను గుర్తించి, తర్వాత తరం వారికి చేర్చాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. ఠాగూర్ వ్రాసిన ఈ గీతం లో అయిదు చరణాలు ఉండగా కొన్ని రాజకీయ కారణాల వలన కేవలం ఒకే చరణాన్ని మాత్రమే జాతీయ గీతం లో చేర్చడం జరిగింది.

**పూర్తి గీతం ఇలా ఉంది...** జనగణమన అధినాయక జయ హే! భారత భాగ్య విధాతా పంజాబ్, సింధు, గుజరాత, మరాఠా, ద్రావిడ, ఉత్కళ, వంగా వింధ్య హిమాచల యమునా గంగా, ఉఛలే జలధి తరంగా తవ శుభనామే జాగే, తవ శుభ ఆశిష మాగే, గాహే తవ జయ గాథా, జనగణ మంగళదాయక జయ హే! భారత భాగ్య విధాతా జయ హే! జయ హే! జయ హే! జయ జయ జయ, జయ హే!

2వ చరణం... అహరహ తవ ఆహ్ బాన్ ప్రచారిత, శుని తవ ఉదార వాని(ణి), హిందు, బౌద్ధ్, శిఖ్, జైన్, పారశిక్, ముసల్మాన్, క్రిస్తాని, పూరబ్ పశ్చిమ ఆశే, తవ సింఘాసన పాశే, ప్రేమ్ హార్ హెయె గాథా జనగణ ఐక్య విధాయక జయ హే! భారత భాగ్య విధాతా జయ హే! జయ హే! జయ హే! జయ జయ జయ, జయ హే!

3వ చరణం... పతన అభ్యుద్దయ్ బన్ధుర్ పంథా, యుగ్ యుగ్ ధావిత యాత్రి, హే చిరొ సారొథి, తవ రథ్ చక్రే, ముఖరిత పథ్ దిన్ రాత్రి దారుణ విప్లవ మాఝే, తవ శంఖధ్వని బాజే సంకట దుఃఖ త్రాతా జనగణ పథ్ పరిచాయక జయ హే! భారత భాగ్య విధాతా జయ హే! జయ హే! జయ హే! జయ జయ జయ, జయ హే!

4వ చరణం... ఘోర తిమిర్ ఘన నిబీడ నిశీథే, పీడిత మూర్చిత దేశే జాగృత ఛిల తవ అవిచల మంగళ, నత నయనే అనిమేషే దుస్స్వప్నే ఆటంకే, రక్షా కరిలే అంకే, స్నేహమయి తుమి మాథా జనగణ దుఃఖ త్రయకా జయ హే! భారత భాగ్య విధాతా జయ హే! జయ హే! జయ హే! జయ జయ జయ, జయ హే! జయ హే!

5వచరణం... రాత్రి ప్రభాతిలా ఉదిల రవిఛావి, పూర్వ ఉదయగిరి భాలే, గాహే విహంగమ్ పుణ్య సమీరన్, నవ జీవన రస్ ఢాలే తవ కరుణారుణ రాగే, నిద్రిత భారత జాగే, తవ చరణె నత మాథా జయ జయ జయ హే! జయ రాజెశ్వర్, భారత భాగ్య విధాతా జయహే! జయహే! జయహే! జయ జయ జయ జయహే!


**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# 12 జోన్లు.. 60 సర్కిళ్లు

హైదరాబాద్ : డివిజన్ల పునర్విభజన పూర్తవడంతో.. తదుపరి కార్యాచరణపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ దృష్టి పెట్టారు. అందుకు సంబంధించిన ప్రణాళికను కేంద్ర కార్యాలయం ఇప్పటికే రూపొందించింది. దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సర్కారు ఆమోదం తెలపగానే.. ప్రస్తుత డివిజన్లు, సర్కిళ్లు, జోన్ల హద్దులను మార్చుతూ.. ఉత్తర్వు వెలువడుతుంది. ఈ ప్రక్రియ మొత్తం వారంలో పూర్తవనున్నట్లు ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు.

**పరిధి పెరగడంతో..**

ఇటీవలి వరకు జీహెచ్ఎంసీ 650చ.కి.మీ పరిధిలో ఉండేది. ఆరు జోన్లు, 30 సర్కిళ్ల ద్వారా పరిపాలన సాగింది. 27 శివారు పట్టణ స్థానిక సంస్థల విలీనంతో గ్రేటర్ హైదరాబాద్ విస్తీర్ణం 2,053 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. గ్రేటర్‌లో కలిసిన మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో పరిపాలన సమస్యలు తలెత్తకూడదన్న ఉద్దేశంతో.. కమిషనర్ ఆయా స్థానిక సంస్థలను సర్కిళ్లుగా పేర్కొంటూ.. దగ్గరలోని జోనల్ కార్యాలయాలకు అనుసంధానం చేశారు. ఒక్కో ఖైరతాబాద్ జోన్‌కు మినహా.. మిగిలిన ఐదు జోన్లలో కొత్త ప్రాంతాలు కలిశాయి. జోనల్ కార్యాలయాల నుంచి శివారు ప్రాంతాల బాగోగులు చూసుకోవడం జోనల్ కమిషనర్లకు కష్టంగా మారింది. ఉదాహరణకు.. ఎల్బీనగర్‌లోని జోనల్ కార్యాలయం నుంచి పెద్దఅంబర్‌పేట్ సర్కిల్‌లోని పారిశుద్ధ్యం, వీధిలైట్లు, రహదారుల నిర్వహణ పనులను పరిశీలించడం




కష్టమైనది. ఇదే అభిప్రాయాన్ని దాదాపు అందరు జడ్జీలు కమిషనర్ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లడంతో.. జోన్లను ఆరు నుంచి 12కు, సర్కిళ్లను 60కి పెంచాలని జీహెచ్ఎంసీ నిర్ణయించి ంది. అంటే.. ఒక్కో జోన్ పరిధిలో ఐదు సర్కిళ్లు ఉండనున్నాయి.

**జనవరిలో జనగణన మొదలైతే..**

జన గణన మొదలైతే.. తర్వాత ఏడాది నుంచి రెండేళ్ల వరకు నగరంలో డివిజన్ల పునర్విభజన చేపట్టడం సాధ్యపడదు. జనవరిలో జన గణన మొదలవుతుండడం.. రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా జీహెచ్ఎంసీలో శివారు స్థానిక సంస్థలను విలీనం చేసి డివిజన్ల పునర్విభజన చేపట్టింది. దానికి కొనసాగింపుగా.. జోన్లు, సర్కిళ్ల పునర్ వ్యవస్థీకరణ త్వరలో జరగబోతుంది. ఆ పునర్ వ్యవస్థీకరణ.. భవిష్యత్తులో జీహెచ్ఎంసీని మూడు మహానగరపాలక సంస్థలుగా విభజించాలన్న సర్కారు ఆలోచనలకు అనుకూలంగా ఉండనుంది.

**మూసీ హద్దుగా..**

మూసీ నది హద్దుగా దక్షిణం వైపున ఉండే ప్రాంతాలన్నింటినీ కలిపి ఓ కార్పొరేషన్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ఉత్తరం వైపు భాగాన్ని సికింద్రాబాద్, సైబరాబాద్ కార్పొరేషన్లుగా ఏర్పాటు చేయాలని సర్కారు ప్రాథమికంగా నిర్ణయించింది. పాతబస్తీతో ఏర్పాటయ్యే మహానగరపాలక సంస్థకు జీహెచ్ఎంసీ పేరు అలాగే కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.


# టెండరు దశ దాటలే..

నిజామాబాద్: నిజామాబాద్ నగరపాలికతో పాటు జిల్లాలోని బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ పురపాలికల్లో మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం 4 నెలల క్రితం నిధులు కేటాయించింది. ఆ పనులు ఎక్కడా ప్రారంభం కాలేదు. అధికారులు టెండర్లు పిలిచారు. అయినా గుత్తేదారులు ముందుకు రావడం లేదు. కొన్నిచోట్ల టెండర్లు ముగిసినా పనులు చేపట్టడంలో తాత్సారం జరుగుతోంది. కాలనీల్లో సీసీ రోడ్లు లేక రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మట్టిదారులపై మురుగు చేరుతోంది. విస్తరణకు నోచని పట్టణ కూడళ్లు ట్రాఫిక్ సమస్యకు కేరాఫ్ నిలుస్తున్నాయి.

ఆర్మూర్ పురపాలికకు రూ.18.70 కోట్లు మంజూరయ్యాయి. పెర్కిట్ కూడలి, మామిడిపల్లి, పార్కుల్లో అభివృద్ధి పనులు.. మామిడిపల్లి నుంచి హెచ్‌పీ పెట్రోల్‌బంక్ వరకు మురుగుకాల్వ, పలు కాలనీల్లో సీసీ, బీటీ రోడ్లు నిర్మించాల్సి ఉంది. హైమాస్ట్ దీపాలకు నిధులు వెచ్చించాలి. ఈ పనులేవీ ప్రారంభం కాలేదు.

భీమ్‌గల్ పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.15 లక్షలు కేటాయించారు. ఈ పనులూ పట్టాలెక్కలేదు.

బోధన్ పురపాలికలో ప్రధాన రోడ్డు మరమ్మతులు, వరద కాలువల



నిర్మాణం, శివారు కాలనీల్లో మొరం రోడ్లు, పార్కుల అభివృద్ధి తదితర పనులకు రూ.20.17 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులనూ గ్రహణం వీడటం లేదు.

నిజామాబాద్ నగరపాలికలో పులాంగ్ చౌరస్తాతో పాటు, ఎన్టీఆర్ చౌక్, బైపాస్ వద్దనున్న కూడలిని విస్తరించాల్సి ఉంది. వీటితో పాటు పలు ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించారు. టెండర్ దశకే పురోగతి పరిమితమైంది. శివారు కాలనీల్లో మురుగు కాలువల పనులు నత్తనడకన సాగుతున్నాయి. కూడళ్ల విస్తరణ పూర్తిచేస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందని నగరవాసులు పేర్కొన్నారు.

**ప్రభుత్వ నిధులతో**

అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభిస్తాం. టెండర్ల పూర్తికాగానే నగరంలో కావాల్సిన చోట్ల మౌలిక వసతులు కల్పిస్తాం' అని నిజామాబాద్ నగర కమిషనర్ దిలీప్‌కుమార్‌తో అన్నారు.

# నేలపై..దోమలకు నెలవై



తుంగతుర్తి : ఊళ్ల మధ్యలో ఏళ్ల నాటి నేల బావులు ప్రమాదకరంగా మారాయి. దరులు కూలి, మురుగు కూపాలై, దోమలు, విషపురుగులకు నెలవై ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో ఇవి మృత్యుకుహరాలుగా మారుతున్నాయి.

**నాడు గొంతు తడిపి:** పూర్వ కాలంలో తాగునీటి కోసం తవ్వారు. నాడు ప్రజల గొంతులు తడిపాయి. ప్రస్తుతం ఇంటింటికీ నల్లా వచ్చింది. కాలక్రమేణ ఈ బావులు కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారాయి.

**నేడు ప్రాణాంతకంగా మారి:** ఏళ్లుగా బావుల నీటిని ఉపయోగించక శిథిలమయ్యాయి. నీరు పాకురు పట్టి పరిసరాల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. ఆ ప్రాంతాల్లో వీధి దీపాల్లేక రాత్రి వేళ తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మేతకు వెళ్లిన మూగజీవులు అందులో పడి మృతి చెందుతున్నాయి. ఇక రాత్రుల్లో మందుబాబులు తూలుతూ అదుపుతప్పి పడిన సందర్భాలున్నాయి. వృథాబావులు చెత్త డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. చెట్ల పొదలతో నిండి విషసర్పాలకు నిలయమవుతున్నాయి. మరోవైపు దోమలు వ్యాప్తి చెంది పరిసర ప్రాంత వాసులు వ్యాధుల బారిన పడుతున్నారు.

**ఇలా చేస్తే మేలు:** నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యులు ఊరి మధ్యలో వృథా బావులను గుర్తించి ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని పూడ్చివేసి ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**ఆరేళ్లుగా అర్జీలు:** తమ ఇంటి సమీపంలో ప్రమాదకరంగా మారిన పాత బావిని పూడ్చివేయాలని ఆరేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు అర్జీలు పెట్టినా పట్టించుకోలేదని వెలుగుపల్లికి చెందిన తూం రవీందర్ వాపోయారు.

**అధికారి ఏమంటున్నారంటే?:** గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. పెద్ద బావుల పూడ్చివేతకు రూ. లక్షల వ్యయం అవుతుంది. నిధులు మంజూరైన వెంటనే పూడ్చివేయిస్తామని తుంగతుర్తి ఎంపీడీవో శేషకుమార్ చెప్పారు.

# 'రాళ్ల' మాటున.. కాసుల వేట



నల్గొండ: అధికారంలో ఉన్నప్పుడే 'నాలుగు రాళ్లు' వెనకేసుకోవాలన్న దురాశతో.. ప్రజాప్రతినిధులే స్వయంగా రంగంలోకి దిగి యమ'కంకరు'లుగా మారుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా గుట్టలను కొల్లగొట్టి క్రషర్ యంత్రాలను వినియోగించి రాత్రికి రాత్రే కంకర తయారు చేసి భారీ వాహనాల్లో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఓ చోట అనుమతులు తీసుకుని మరోచోట దందా చేస్తూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి ప్రభావిత గ్రామాల ప్రజలకు నిద్ర కరవు చేస్తున్నారు. జిలెటిన్ స్టిక్స్, నిషేధిత పేలుడు పదార్థాలు ఉపయోగించి గుట్టలను పిండి చేసి పర్యావరణానికి, పంటలకు కీడు చేస్తున్న 'రాళ్ల'దొంగలను రాజకీయ జెండాలు అడ్డుకుంటున్నాయి. గ్రామాల్లో కిలోమీటర్ల కొద్ది రహదారులు నిర్మిస్తామని టన్నుల కొద్దీ కంకరను ఎలాంటి లెక్కాపద్దులు లేకుండానే బహిరంగ లూటీ చేస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఎక్కడెక్కడంటే..!**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో ముఖ్య రాజకీయ నేతకు సంబంధించిన గుట్టలను తొలచి కంకర తయారు చేస్తున్నారు. ఈ క్రషర్ సంస్థలకు ఎలాంటి అనుమతులు లేవు. రాజాపేట మండలంలో ఓ బినామీ వ్యాపారి పేరిట స్థానిక ముఖ్య ప్రజాప్రతినిధి డబ్బులు వెనకేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

నల్గొండ జిల్లాలో నాగార్జునసాగర్‌కు చెందిన సీనియర్ ప్రజాప్రతినిధికి చెందిన గుత్తేదారు సంస్థ కనగల్, తిప్పర్తి, నాంపల్లి మండలాల్లో కి.మీ. మేర తారు రహదారులు నిర్మిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా కంకర తవ్వకాలు జరుగుతున్న క్వారీల వద్ద గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు తుంగతుర్తి, గరిడేపల్లి, కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లోనూ జోరుగా స్థానిక ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే కంకర రాళ్ల అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతుందనే ఫిర్యాదులు వ్యక్తమవుతున్నాయి.

రహదారుల నిర్మాణానికి కంకర తవ్వకాల అనుమతులు తీసుకున్నా.. రవాణా విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. కంకర లారీపై పట్టా కప్పాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. వెనుక వచ్చే వాహనదారులపై దుమ్ము, ధూళి పడి శ్వాసకోశ వ్యాధులకు గురికావాల్సి వస్తుందని వాహనచోదకులు చెబుతున్నారు.

జిల్లా గనులు, భూగర్భవనరుల శాఖ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో గుత్తేదారులు ఏం చేస్తున్నారు, ఎంత మొత్తంలో కంకర నిల్వలు తీసుకెళుతున్నారనే విషయాలను వదిలేస్తున్నారు. దీనిపై జిల్లా గనులశాఖాధికారి జాకబ్ శ్యామూల్‌ను వివరణ కోరగా.. అక్రమ కంకర రవాణాపై ఫిర్యాదు చేస్తే క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# చర్చ జరగాలి.. కదలిక రావాలి..!

కొత్తగూడెం : కేంద్ర పర్యావరణశాఖ లేవనెత్తిన అభ్యంతరాల కారణంగా రెండున్నరేళ్లుగా నిలిచిపోయిన సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ అంశం మరోసారి తెరపైకి రానుంది. (ఈనెల 29) నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించి కృష్ణా, గోదావరి జలాలతో పాటు వాటిపై చేపట్టిన ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, వెచ్చించిన ఖర్చులు తదితరాలపై సమగ్రంగా చర్చించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో అశ్వాపురం మండలంలో గోదావరి నదిపై చేపట్టిన సీతమ్మసాగర్ నిర్మాణ అంశాన్ని చర్చించాలని ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వాసులు ఆశిస్తున్నారు. సీతమ్మసాగర్‌తో పాటు సీతారామ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలని కోరుతున్నారు.

**రూ.19,954 కోట్లు.. 36.57 టీఎంసీలు**

భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6.74లక్షల ఎకరాలకు సాగునీరు, 282.80 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తే లక్ష్యంగా బహుళార్థ సాధక ప్రాజెక్టుగా సీతమ్మసాగర్ ప్రాజెక్టును గత ప్రభుత్వం చేపట్టింది. రూ.19,954కోట్ల అంచనా వ్యయంతో 36.57 టీఎంసీల నిల్వ సామర్థ్యం, 67 టీఎంసీలు ఎత్తిపోసేందుకు అశ్వాపురం-దుమ్ముగూడెం మధ్య గోదావరిపై బ్యారేజీ నిర్మాణానికి పూనుకుంది. ప్రాజెక్టు పనులు 2023 మే 29నాటికి 56.80% పూర్తవగా.. రూ.11,361కోట్లు (56.94శాతం) ఖర్చయ్యాయి. జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ) ఉత్తర్వుల నేపథ్యంలో రెండున్నరేళ్లుగా పనులు నిలిచిపోయాయి.

**సీతమ్మసాగర్ పూర్తయితేనే..**

సీతమ్మసాగర్ బ్యారేజీని అధారంగా చేసుకుని మూడు జిల్లాలకు సాగునీరందించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా మూడు పంప్‌హౌస్‌లు, 104కి.మీ. ప్రధాన కాల్వ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఖమ్మం జిల్లాలోని సాగర్ చివరి ఆయకట్టుకు గోదావరి జలాలు తరలించేందుకు రాజీవ్ లింక్ కెనాల్‌ను నిర్మించారు. భద్రాద్రి జిల్లాలో డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. సీతారామ ప్రాజెక్టు లక్ష్యం నెరవేరాలంట్టే గోదావరిలో నీరు నిల్వ ఉండాలి. అంతకంటే ముందు సీతమ్మసాగర్ పనులు పూర్తిచేసి 36.57 టీఎంసీల నీటిని నిల్వచేస్తేనే.. సీతారామ ప్రధాన కాల్వ ద్వారా 9వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేందుకు వీలుంటుంది.

**ఈఐఏ విచారణ పూర్తయితేనే..**ముందస్తు పర్యావరణ అనుమతులు లేకుండా చేపట్టిన ప్రాజెక్టులపై గతంలో సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును రీకాల్ చేస్తూ త్రిసభ్య ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. అపరాధ రుసుము చెల్లించి, పర్యావరణ అనుమతులు తీసుకుని ప్రాజెక్టులు నిర్మించవచ్చునని సూచించింది. ఈతీర్పు ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం సీతమ్మసాగర్ నిర్మాణ పనులు చేపట్టేందుకు పర్యావరణ ప్రభావం అంచనా(ఈఐఏ)కు వివరాలు సమర్పించింది. దీనిపై ఈఐఏ విచారణ జరిపి పర్యావరణ అనుమతులు(ఈసీ) ఇవ్వాల్సి ఉంటుంది. అనుమతులు రాగానే ఎన్జీటీ విధించిన రూ.54కోట్లు చెల్లించి పనులు ప్రారంభించుకోవచ్చు. 'మార్చి నాటికి ఈఐఏ విచారణ ముగిసి పర్యావరణ అనుమతులు వచ్చే అవకాశాలున్నాయి. ఆ తరువాత సీతమ్మసాగర్ పనులు పునఃప్రారంభమవుతాయి' అని భద్రాద్రి కొత్తగూడెం నీటిపారుదలశాఖ ఈఈ శ్రీనివాసరెడ్డి కు తెలిపారు.

# అడ్డంకులను అధిగమిస్తూ.. రోడ్లను విస్తరిస్తూ..!

ఖమ్మం : దినదినాభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరంలో ప్రధాన రహదారులు ప్రస్తుత వాహనాల రద్దీకి అనుగుణంగా లేవు. మురుగుకాల్వలను ఆక్రమించి మెట్లు, దుకాణాల షెడ్లు నిర్మిస్తుండటంతో రోడ్లూ కుచించుకుపోయాయి. వీటిని బృహత్ ప్రణాళిక(మాస్టర్ ప్లాన్)కు అనుగుణంగా విస్తరిస్తే ట్రాఫిక్ సమస్యను తగ్గించవచ్చని నగరపాలక సంస్థ భావిస్తోంది.

**అవగాహన కల్పిస్తూ.. భరోసా ఇస్తూ**

జిల్లాకేంద్రంలో బైపాస్, వైరా రోడ్లు మాత్రమే పూర్తిస్థాయిలో విస్తరణకు నోచుకున్నాయి. మిగిలినవి చాలాచోట్ల 30-40 అడుగుల్లోపే ఉన్నాయి. బృహత్ ప్రణాళిక ప్రకారం ప్రధాన రహదారులను కనీసం 60 అడుగులకు విస్తరించాలని కేఎంసీ ప్రణాళిక విభాగం అధికారులు నిర్ణయించారు. తొలిదశలో చెరువుబజార్, రిక్కాబజార్, రైల్వేస్టేషన్ రోడ్లలో మార్కింగ్ చేసి ఇళ్ల యజమానులకు నోటీసులిచ్చారు. సొంతంగా ఆక్రమణలను తొలగించుకోవాలని సూచించారు. మరికొన్నిచోట్ల యజమానుల అంగీకారంతో అడ్డుగా ఉన్న ప్రహరీలు, ఇళ్ల స్లాబ్‌లను



నిర్దేశిత దూరం వరకు తొలగించి రహదారిని విస్తరించారు. విస్తరణ పనులతో నష్టపోతున్నామని పలువురు వినతిపత్రాలు అందజేశారు. పూర్తిగా ఇళ్లు కోల్పోయే వారికి పరిహారంగా పునరావాస కల్పన లేదా ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్(టీడీఆర్) ఇవ్వటంపై అధికారులు అవగాహన కల్పిస్తూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. ఇప్పటికే చెరువుబజార్, పీఎస్ఆర్ రోడ్డులో సుమారు 20మందికి టీడీఆర్ ఇచ్చినట్లు సమాచారం.

రైల్వేస్టేషన్ రోడ్డులో ఒకవైపు విస్తరణ పనులు పూర్తవగా.. మరోవైపు ఆక్రమణలను తొలగిస్తున్నారు. ముగ్గురు యజమానుల ఇళ్ల తొలగింపు పనులు మొదలుకాలేదు. ఒకరు సొంతంగా తొలగించుకుంటామని హామీ ఇవ్వగా, ఇద్దరికి సంబంధించి న్యాయస్థానంలో కేసు పెండింగ్ ఉన్నట్లు తెలిసింది.

పీఎస్ఆర్ రోడ్డు విస్తరణలో జాప్యం విమర్శలకు తావిచ్చింది. తొలగింపు పనులు చేపట్టకుండా ఇద్దరు వ్యక్తులు ప్రయత్నించటంతో అధికారులు ఆయా ఇళ్లపత్రాలు పరిశీలించి నోటీసులు జారీ చేశారు. జిల్లా రవాణాశాఖ కార్యాలయం రహదారికి రెండోవైపు స్వల్పంగా కూల్చివేతలు ప్రారంభించారు. ఇక్కడ తొలగించిన ప్రహరీని పునర్నిర్మించనున్నారు.వ్యవసాయ మార్కెట్ నుంచి శ్రీనివాసనగర్ వరకు..

మిరప మార్కెట్‌ను ఆధునికీకరిస్తుండటంతో భవిష్యత్తులో కొనుగోళు పెరిగితే వాహనాల తాకిడి అధికంగా ఉండనుంది. వ్యవసాయ మార్కెట్, సుందరయ్యనగర్ నుంచి ప్రకాశ్‌నగర్ వరకు రోడ్డును ప్రణాళిక విభాగం అధికారులు అభివృద్ధిపరచనున్నారు. వ్యవసాయ మార్కెట్‌కు అనుసంధానంగా ప్రకాశ్‌నగర్ నుంచి శ్రీనివాసనగర్ వరకు రోడ్డును అభివృద్ధిపరచటానికి రెండువైపులా మార్కింగ్ చేశారు. రాళ్లను తొలగించి బాట వేశారు. అధికారులు చదును చేసిన రహదారిపై కొంతమంది రాళ్లు పాతి కంచె వేయటం అనుమానాలకు తావిస్తోంది. 'రహదారిపై వేసిన కంచెను తొలగిస్తాం. ఇళ్ల యజమానులను ఒప్పించి రహదారుల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నాం' అని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య కు తెలిపారు.

# డ్రైవింగ్ పరీక్ష నామమాత్రమే

కామారెడ్డి : రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్యను తగ్గించడానికి జిల్లా పోలీసుశాఖ తీవ్ర కసరత్తు చేస్తోంది. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తూ రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తున్న చోదకులకు జరిమానాలు విధిస్తోంది. చోదకులకు డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేసే కామారెడ్డి రవాణా శాఖ కార్యాలయంలో నిబంధనలు పట్టించుకోకపోవడం విస్తుగొలుపుతోంది.

**సిబ్బందే రాశారు**

డ్రైవింగ్ లైసెన్స్ రావాలంటే తొలుత లెర్నింగ్ లైసెన్స్ పరీక్ష రాయాలి. ఈ పరీక్ష కోసం మంగళవారం కామారెడ్డి ఆర్టీఏ కార్యాలయానికి దరఖాస్తుదారులు వచ్చారు. కాగా ఈ పరీక్షను కార్యాలయ సిబ్బందే స్వయంగా రాస్తున్న ఉదంతం పరిశీలనలో బయటపడింది. దరఖాస్తుదారుల్ని పక్కనే కూర్చొబెట్టుకొని వారికి బదులుగా అధికారులే రాయడం విస్తుగొలుపుతోంది. మరికొందరు దరఖాస్తుదారులు లేకున్నా సిబ్బందే రాయడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. ఇదేంటని సదరు సిబ్బందిని ప్రశ్నించగా.. దరఖాస్తుదారుడు మరుగుదొడ్డికి వెళ్లాడని.. అందుకే రాస్తున్నానని చెప్పడం గమనార్హం. దీనిపై ఇన్‌ఛార్జి డీటీవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. ఆయన సమాధానం చెప్పడానికి నిరాకరించారు.

**ఏజెంట్ల ద్వారానే..**



లైసెన్స్‌ల కోసం వచ్చిన 9 మంది యువకులతో మాట్లాడగా.. అందులో ఏడుగురు ఏజెంట్‌ల ద్వారా వచ్చినవాళ్లే. వారిలో కొందరికి లెర్నింగ్ పరీక్ష ఉంటుందనీ తెలియకపోవడం గమనార్హం. డిజిటల్ సంతకం చేసి, రవాణా శాఖ సిబ్బంది వెంట కూర్చుంటే మొత్తం వారే చూసుకున్నారని తెలిపారు. ఏజెంట్‌కు రూ.4,200 ఇస్తే ద్విచక్రవాహనం, కారుకు లైసెన్స్‌లు ఇప్పిస్తున్నారని అన్నారు. డ్రైవింగ్ పరీక్షా అంతంతమాత్రంగానే ఉంది. కారు రివర్స్ తోలకుండానే లైసెన్స్‌లు ఇస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. డ్రైవింగ్ ట్రాక్ సరిగా లేదని చెబుతున్నారు.

**మీ సేవలో అవకాశమున్నా..**డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తుదారులు మీ సేవలో దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లోనూ చేయొచ్చు. కానీ చాలా మంది ఏజెంట్లనే ఆశ్రయిస్తున్నారు. ఆర్టీఏ కార్యకలాపాలన్నీ ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నా.. ఏజెంట్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. చాలా పనులకు ఏజెంట్ల ద్వారా వెళ్తే తప్ప పనులు జరగడం లేదని కార్యాలయానికి వచ్చిన వారు వాపోతున్నారు.

చరకలు




# మీ డబ్బు.. మీ హక్కు

కొత్తగూడెం : 'కష్టపడి దాచుకున్న ప్రతి రూపాయి విలువైనదే.. అయితే కొన్నిసార్లు వివిధ కారణాల వల్ల మన కుటుంబ సభ్యులు లేదా మనం పాత బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేసిన సొమ్మును క్లెయిమ్ చేయటం మర్చిపోతుంటాం. అలాగే బ్యాంకు ఖాతాదారులు అకస్మాత్తుగా మరణించినా.. వారి ఖాతాల్లోని డిపాజిట్ల వివరాలు వారసులకు తెలియవు. ఖాతాదారుల నామినీ వివరాలు సక్రమంగా లేకపోవటంతో రూ.వేల కోట్లు బ్యాంకుల్లో మూలుగుతున్నాయి. అలాంటి అన్‌క్లెయిమ్ ఆస్తులను తిరిగి అసలైన వారసులకు చేరవేయటమే లక్ష్యంగా కేంద్ర ఆర్థికశాఖ 'మీ డబ్బు- మీ హక్కు' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

**1.98 లక్షల ఖాతాలు.. రూ.46.43 కోట్లు**

బ్యాంకులో పదేళ్లపాటు నిర్వహించని ఖాతాలను ఇన్‌ఆపరేటివ్ ఖాతాలుగా పరిగణించి అందులోని మొత్తాన్ని బ్యాంకులు ఆర్బీఐ నిర్వహించే డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్(డీఈఏ) ఫండ్‌కు బదిలీ చేస్తాయి. ఇలా పదేళ్లపాటు క్లెయిమ్ చేయకుండా భద్రాద్రి



కొత్తగూడెం జిల్లాలోని 12 బ్యాంకుల పరిధిలో 1.98 లక్షల ఖాతాలకు సంబంధించి రూ.46.43కోట్లు, ఎల్ఐసీ ఆఫ్ ఇండియాలో 3,869 ఖాతాల్లో రూ.2.93కోట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆయా ఖాతాల్లోని క్లెయిమ్ చేయని ఆస్తులను వారి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు బుధవారం (ఈనెల 24) ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4 వరకు కలెక్టరేట్‌లో అవగాహన కల్పించనున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంరెడ్డికు తెలిపారు. బ్యాంకుశాఖ, బీమా సంస్థ, మ్యూచువల్ ఫండ్స్ తదితరాల్లో దేనికి సంబంధించి అయినా అధికారులను సంప్రదించవచ్చునని సూచించారు.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్- గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్(ఉద్గమ్) పేరిట పోర్టల్‌ను ఏర్పాటుచేసింది. ఇందులో వివరాలు నమోదుచేయటం ద్వారా అన్‌క్లెయిమ్డ్ ఖాతాదారుల వారసులు ఆ మొత్తాన్ని తిరిగి పొందవచ్చు.

# ఇల్లు ఒకరికి.. బిల్లు మరొకరికి!

దుమ్ముగూడెం : దుమ్ముగూడెం మండలం పెదనల్లబెల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం విషయంలో ఇరువర్గాల మధ్య సోమవారం తీవ్ర వివాదం జరిగింది. మట్టా ముత్తయ్య- భద్రమ్మ దంపతుల పేరిట ప్రభుత్వం మొదటి దశలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. ఇదే గ్రామంలో మట్టా ముత్తయ్య-రాజమ్మ పేరిట ఇంకో జంట ఉంది. అసలైన లబ్ధిదారు కాకుండా అధికారుల తప్పిదం వల్ల ముత్తయ్య-రాజమ్మ దంపతులు పునాది వరకు నిర్మాణ పనులు పూర్తిచేశారు. ఇటీవల అసలైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి మొదటి బిల్లు రూ.లక్ష జమచేసింది. ఇల్లు నిర్మించకుండానే బ్యాంకు ఖాతాలో సొమ్ము జమవటంతో రూ.20వేలను ముత్తయ్య-



భద్రమ్మ దంపతులు డ్రా చేశారు. మిగిలిన రూ.80వేలు తీసుకోవాలని, బ్యాంకు అధికారులు చెప్పటంతో ఆనందంతో ఇంటికి వచ్చేశారు. సొమ్ము డ్రా విషయం బయటికి పొక్కడంతో గ్రామంలో ఇరువర్గాల మధ్య తీవ్ర దుమారం చెలరేగింది. పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రావును నిలదీయడంతో అది కాస్త రాజకీయ రంగు పులుముకుంది. అప్పులు చేసి ఇల్లు నిర్మిస్తున్నామని, తమకు డబ్బు ఇవ్వకుండా అన్యాయం చేశారని ముత్తయ్య-రాజమ్మ దంపతులు లబోదిబోమంటున్నారు. అసలైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి బిల్లు నగదు ఇవ్వొద్దని బ్యాంకు అధికారులకు లిఖితపూర్వకంగా దరఖాస్తు చేయడంతో ప్రస్తుతం ఫ్రీజింగ్ పెట్టారని కార్యదర్శి వివరణ ఇచ్చారు.

# నిఘా నేత్రం.. నియంత్రణాస్త్రం

ముథోల్ : రేషన్ బియ్యం తూకంలో తేడాలు రాకుండా పౌరసరఫరాల సంస్థ చర్యలు తీసుకుంటోంది. అన్ని ఎంఎల్ఎస్ గిడ్డంగుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. త్వరలో టెండర్లు పిలిచి లేనిచోట అమర్చనున్నారు. పనిచేయని చోట కొత్తవి ఏర్పాటు చేయనున్నారు. వీటిని వినియోగంలోకి తీసుకొచ్చి అక్రమాలకు అడ్డుకట్ట వేయనున్నారు. మూడేళ్ల క్రితం ఎంఎల్ఎస్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అవి పనిచేయడం లేదు. తాజాగా మళ్లీ అన్ని మండలస్థాయి గిడ్డంగుల్లో కొత్త కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా ఖానాపూర్, నిర్మల్, భైంసా, ముథోల్‌లో ఎంఎల్ఎస్ గోదాంలు ఉన్నాయి. వీటిలో నిర్మల్, ముథోల్‌లో కోతుల బెడదతో సీసీ కెమెరాలు సరిగ్గా పనిచేయడం లేదు. ఖానాపూర్ ఎంఎల్ఎస్ గోదాంలో రెండేళ్ల క్రితం 18 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతేడాది నుంచి సాంకేతిక సమస్యలతోపాటు కోతులు వాటి తీగలను తొలగించడంతో పనిచేయడం లేదు. వాటికి మరమ్మతులు చేయలేదు.

**అధికారులకు ఫిర్యాదులు**

ఎంఎల్ఎస్ కేంద్రాల నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యం ఒక్కో సంచి 50 కిలోల బరువు ఉండాలి. కానీ చాలా రేషన్ దుకాణాలకు సరఫరా చేసిన సంచులు రెండు, నుంచి రెండున్నర కిలోల బరువు తక్కువగా ఉంటోంది. పలుమార్లు రేషన్ డీలర్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో మోసాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

ప్రతిపాదనలు పంపించాం జిల్లాలో ఖానాపూర్, ముథోల్, భైంసా, నిర్మల్‌లో నాలుగు ఎంఎల్ఎస్ గోదాములు ఉన్నాయి. రెండుచోట్ల సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. మిగతా రెండు చోట్ల పనిచేయడం లేదు. ముథోల్, నిర్మల్‌లో సీసీ కెమెరాలతోపాటు ధర్మకాంటాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే నూతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తాం.

సుధాకర్, డీఎం, పౌరసరఫరాల శాఖ, నిర్మల్

# సింగరేణిది.. ఆ'గని' ప్రయాణం




కొత్తగూడెం : సింగరేణి సంస్థ నేడు రాష్ట్రానికే వెలుగులు నింపుతోంది. తన గర్భంలో దాచుకొన్న బొగ్గును వివిధ పరిశ్రమలకు తరలించటంతో పాటు స్వయంగా థర్మల్ విద్యుత్తు, సౌర విద్యుత్తు తయారుచేస్తోంది. తాజాగా అరుదైన ఖనిజాల అన్వేషణకు హక్కులు సాధించింది. ఇప్పటికే రెండు 600మెగావాట్ల థర్మల్ యూనిట్లను జైపూర్‌లో నడుపుతుండగా భవిష్యత్తులో నైనీ బ్లాకులో రెండు లేదా మూడు 800మెగావాట్ల విద్యుదుత్పత్తి యూనిట్లు ఏర్పాటుచేయాలని భావిస్తోంది. రాజస్థాన్‌తో కుదిరిన ఒప్పందం మేరకు మరో 800మెగావాట్ల విద్యుదుత్పత్తి యూనిట్ను నెలకొల్పనుంది. మణుగూరులో కోల్‌గ్యాసిఫికేషన్ ప్రాజెక్టును ఓఎన్‌జీసీతో కలిసి చేపట్టనుంది. బహుముఖ విస్తరణ దిశగా కొనసాగుతున్న సింగరేణి సంస్థ దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు పరిశ్రమగా విరాజిల్లుతోంది. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కథనం.

**రాళ్లు మండిన అద్భుతంతో సింగరేణి ఆవిర్భావం**

వంటకు ఉపయోగించిన రాళ్లు మండిన ఘటనే సింగరేణి సంస్థ ఏర్పాటుకు కారణమైంది. 1870లో భద్రాచలం వెళ్లే భక్తులు కారేపల్లి సమీపంలోని అడవిగుండా ప్రయాణిస్తూ రాత్రి వంట చేసుకునేందుకు మూడు రాళ్లను పేర్చారు. దేదీప్యమానంగా మండుతున్న ఆ రాళ్లను గుర్తించి అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ అధికారులకు తెలియజేశారు. భూగర్భ పరిశోధకుడు(జియాలజిస్టు) సర్ విలియం కింగ్‌ను పరిశోధించాలని సర్కారు సూచించింది. ఆయన వివిధ పరిశోధనలు జరిపి ఇది బొగ్గు అని, ఇంధనంగా ఉపయోగపడుతుందని కనుగొన్నారు.

**1889లో తొలి గని ఏర్పాటు**

1886లో హైదరాబాద్ దక్కన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్‌గా ఏర్పడి 1889లో ఇల్లెందులో బొగ్గుగనిని ప్రారంభించింది. 1921లో ఈ కంపెనీ 'ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్'గా రూపొందింది. 3,007.94 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ప్రాణహిత, గోదావరి నదుల పరీవాహక ప్రాంతాల్లో 350కి.మీ. పరిధిలో విస్తరించాయి. వీటిలో 1,422.24 మిలియన్ టన్నుల బొగ్గును సింగరేణి వెలికితీసింది.

**అవీ.. ఇవీ..**

సింగరేణి లాభాలబాట పట్టిన 2000 సంవత్సరం నుంచి ఆవిర్భావ వేడుకలు జరుగుతున్నాయి. మొత్తం 39 గనులు (భూగర్భంలో 22, ఉపరితలంలో 17) ఉన్నాయి.

పరిశ్రమ కుమురం భీం, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్, భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో విస్తరించింది. 40,378 మంది ఉద్యోగులు (వీరిలో మహిళలు-2,088) మంది పనిచేస్తున్నారు.

సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వం 51శాతం, కేంద్ర ప్రభుత్వం 49శాతం వాటా కలిగి ఉన్నాయి.

సింగరేణి వెలికితీసిన బొగ్గులో 84శాతం విద్యుదుత్పత్తి సంస్థలకు, 9శాతం ఇతర పరిశ్రమలకు, 4శాతం సిమెంటు పరిశ్రమలకు, 3శాతం క్యాప్టివ్ పరిశ్రమలకు సరఫరా అవుతోంది.

ఉత్పత్తి అయిన బొగ్గులో 65శాతం రైళ్లు, 34శాతం రోడ్డు, ఒక్కశాతం బొగ్గు రోప్ ద్వారా రవాణా అవుతోంది.

# రారండోయ్.. గిరిజన మ్యూజియం చూసొద్దాం



భద్రాచలం : భద్రాచలం రాములవారి దర్శనానికి వచ్చే భక్తులకు చూడచక్కని ప్రదేశంగా ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం గుర్తింపు పొందింది. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చేవారు ఇక్కడ ప్రశాంతమైన వాతావరణంలో ఆహ్లాదాన్ని ఆస్వాదించవచ్చు. గంటల తరబడి వీక్షించినా తనివి తీరని గిరిజన సంప్రదాయ పరికరాలు, ఆవాసాలు కనువిందు చేస్తున్నాయి. వ్యవసాయమే జీవనాధారంగా చేసుకున్న అడవి బిడ్డల సంస్కృతికి అద్దం పట్టే విధంగా ఈ మ్యూజియం సాక్షాత్కరిస్తుంది. ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు వచ్చే యాత్రికులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక విద్యుద్దీపాలు అలంకరిస్తున్నారు. చిన్నపాటి మరమ్మతులను పూర్తిచేస్తున్నారు. రారండోయ్ మ్యూజియానికి అంటూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ పర్యాటకులను ఆకట్టుకుంటున్నారు.

**1.20 లక్షల మంది సందర్శన** గతంలో గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివాసీల సంప్రదాయాలను పరిరక్షించేవారు. నిధుల కొరతతో పాటు సరైన అధికారి అందుబాటులో లేకపోవటంతో ఈ విభాగం నామమాత్రంగా మారింది. శ్రీరామనవమికి ముందు మ్యూజియాన్ని వీక్షించేవారే కరవయ్యారు. ఒకానొక దశలో దీన్ని ఇక్కడి నుంచి భక్తులు పర్యటించే ప్రధాన రహదారి వైపు తరలించాలని అధికారులు భావించారు. ఈక్రమంలో ఐటీడీఏ పీఓ రాహుల్ చొరవ తీసుకుని రూ.50లక్షలతో అదనపు సొబగులు తీర్చిదిద్దారు. అదేస్థాయిలో ప్రచారం కల్పించారు. ఏప్రిల్ 7న శ్రీరామ పట్టాభిషేకం వేడుకకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరై ఈ మ్యూజియాన్ని ప్రారంభించారు. ఇప్పటివరకు 1.20 లక్షల మంది పర్యాటకులు సందర్శించారు. మరో రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ నిధులతో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించారు. ఆదివాసీ సంప్రదాయ రుచులు ఇక్కడ ప్రత్యేకం. త్వరలో గిరిజన సంస్కృతిని చాటే ఆడియో విజువల్, హస్తకళలు, ఆర్ట్స్ గ్యాలరీ, గ్రంథాలయం, వసతికి ఏసీ గదులు, గిరిజన వేషధారణ గల మైనపు బొమ్మలు వంటివి అందుబాటులోకి రానున్నాయి. **ఉత్సాహం.. ఉల్లాసం** 5-15 ఏళ్ల చిన్నారులకు మ్యూజియం ప్రవేశ రుసుము రూ.5, పెద్దలకు రూ.10. బోట్ షికార్, రిమోట్ బ్యాటరీ కార్ డ్రైవింగ్ వంటివి చిన్నారులకు సంతోషం కలిగిస్తున్నాయి. విలువిద్యలో భాగంగా బాణాలను వదిలే క్రీడ, గిరిజన ఆచార ప్రతిమల వద్ద ఫొటోలు దిగటం, బాక్స్ క్రికెట్, బీచ్ వాలీబాల్ వంటి ఆటల్లో పాల్గొనేందుకు అన్ని వయస్సుల వారికి ఏర్పాట్లు ఉన్నాయి. వీటికి తగిన రుసుము చెల్లించాలి. ఇలాంటి రుసుముల ద్వారా ఇప్పటివరకు రూ.14 లక్షలు సమకూరినట్లు మ్యూజియం ఇన్‌ఛార్జి ప్రభాకర్‌తెలిపారు.

# అర్హులు.. అనర్హులై.. కలలు కల్లలై

ఆదిలాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ తర్వాత చేసిన ఇంటింటి సర్వేలో పొందుపర్చిన అంశాలకు.. లబ్ధిదారుల వివరాలకు పొంతన కుదరడం లేదు. ముందు అర్హులుగా గుర్తించినవారు.. అనర్హులుగా మారిపోతున్నారు. తొలివిడత జిల్లాలో ప్రభుత్వం 16,373 ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటివరకు కేవలం 39 ఇళ్ల నిర్మాణం పూర్తయితే.. మరో 8,379 వివిధ దశల్లో ఉన్నాయి.

**మంజూరు.. తకరారు** తాంసి మండలం పొన్నారికి చెందిన ఈమె జంగంవార్ సుజాత.. భర్త లేదు.. ఇద్దరు కుమారులతో రేకుల షెడ్డులో నివాసం ఉండేది.. ఇందిరమ్మ ఇల్లు మంజూరవగా దాన్ని కూల్చివేసి నిర్మాణం చేపట్టింది. పునాది వరకు రూ.లక్ష బిల్లు వచ్చింది. స్లాబ్ వరకు నిర్మాణం పూర్తిచేసి బిల్లుకోసం వెళ్తే ఇల్లు ఎల్-3 కింద నమోదై ఉంది. దీంతో ఆమె పరిస్థితి దయనీయంగా మారింది. ఇలా ఎల్-1 లబ్ధిదారులుగా అర్హులై ఉన్న 141 మందిని ఎల్-3లో(అనర్హులు) చేర్చటంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. అత్యధికంగా ఇంద్రవెల్లి మండలంలో 53 మంది, గాదిగూడలో 40, ఆదిలాబాద్ గ్రామీణంలో 23 మంది ఉన్నారు.

**ఎల్-1, 2, 3 అంటే**

ప్రభుత్వం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను ఎల్-1, 2, 3 అని మూడు రకాలుగా విభజించింది. ఎల్-1 అంటే ఇంటి నిర్మాణానికి స్థలం కలిగి ఉండి, పక్కానివాసం లేని నిరుపేదలు.. అలాంటివారికి రూ.5 లక్షలతో ఇళ్లు నిర్మించి ఇవ్వాలనేది తొలిప్రాధాన్యత.

ఎల్-2 అంటే ఇంటి స్థలంతోపాటు ఇల్లు లేనివారు. అలాంటివారికి భూసేకరణ చేసి నిర్మించి ఇవ్వటమా.? లేక మరేదైనా సాయం చేయటమా.? అనేది తేల్చడం..ఎల్-3 అంటే సొంత స్థలం, పక్కా ఇల్లు ఉన్నవారుగా గుర్తిస్తారు. ఇందిరమ్మ ఇళ్లకు వీరు అర్హులు కాదనేది ప్రభుత్వం విధానం. జిల్లాలో ఎల్-1 కిందనే 16,373 ఇళ్లు మంజూరు చేసినా.. తర్వాత ఇంటింటి సర్వే లెక్కలతో సరిపోనందున కొంతమందిని ఎల్-3 కింద చేర్చడం సమస్యగా మారుతోంది.

**నిబంధనల మేరకే -ఎంపీ షాకీర్, డీఈఈ**

ఇప్పటివరకు రూ.136 కోట్ల బిల్లు చెల్లించాం. 39ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మంజూరైన మిగిలిన వాటిలో ఉన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. నిబంధనల ప్రకారమే జాబితాలు రూపొందించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాం..జిల్లాలో ఇళ్ల నిర్మాణం తీరిలా..

మంజూరు : 16,373

ముగ్గువేసినవి : 12,436

పునాది వరకు : 5044 స్లాబ్ లెవల్ : 1563 స్లాబ్ పూర్తి: 1772

పూర్తిగా నిర్మాణం : 39

# మరో భారీ గ్రీన్‌ఫీల్డ్ రహదారి

హైదరాబాద్ : ఔటర్ రింగ్ రోడ్డుతో ప్రాంతీయ రింగ్ రోడ్డును అనుసంధానించేందుకు ప్రధాన రోడ్డు మార్గాలను అభివృద్ధి చేయడం, విస్తరించడమే కాకుండా కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణాలకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే అవుటర్ రింగ్‌రోడ్డు రావిర్యాల జంక్షన్ నుంచి మీర్‌ఖాన్‌పేట, అక్కడి నుంచి ఆమన్‌గల్ వరకు 41.50 కిలోమీటర్ల పొడవుతో రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మొత్తం రూ.4,621 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఏడాదిలోపు ఈ రహదారిని సిద్ధం చేయాలని హెచ్ఎండీఏ భావిస్తోంది. దీంతోపాటు మరో భారీ గ్రీన్‌ఫీల్డ్ రహదారి కోసం ఇప్పటికే హెచ్ఎండీఏ కసరత్తు ప్రారంభించింది. బుద్వేల్ నుంచి టీజీఐఐసీ పారిశ్రామిక ప్రాంతాలను కలుపుతూ 167 జాతీయ రహదారి వద్ద కోస్గి వరకు సుమారు 81 కిలోమీటర్ల పొడవుతో నాలుగు లైన్లతో రహదారిని నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. త్వరలో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సిద్ధం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించనుంది. తొలుత కొత్వాల్‌గూడ నుంచి పరిగి వరకు 55 కిలోమీటర్ల వరకు చేపట్టాలని భావించినప్పటికీ మరిన్ని ప్రాంతాలను కలుపుతూ ఈ రహదారి విస్తీర్ణం



పెంచినట్లు ఓ అధికారి తెలిపారు.

**విడతలవారీగా పలు రహదారులకు ప్రణాళిక..**

ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్‌ఆర్‌ను అనుసంధానించేందుకు మరిన్ని రేడియల్ రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. మొత్తం 12-16 వరకు రేడియల్ రోడ్లను చేపట్టాలనేది యోచిస్తోంది. ఇందులో భాగంగా ఓఆర్ఆర్ 22 జంక్షన్ల నుంచి ఉన్న రహదారులను విస్తరించి, అభివృద్ధి చేయనున్నారు. అన్ని ప్రాంతాలను అనుసంధానించేలా..ఎంపిక చేసిన ప్రాంతాల్లో గ్రీన్‌ఫీల్డ్ రోడ్లను చేపట్టనున్నారు. భవిష్యత్తు అంతా అవుటర్, ట్రిపుల్‌ఆర్ మధ్యలో కొత్త నివాస, పారిశ్రామి, వాణిజ్య ప్రాంతాలు విస్తరించను న్నాయి. ఈ నేపథ్యంలో అన్నివైపులా ఓఆర్ఆర్, ట్రిపుల్‌ఆర్ వరకు రహదారులను ప్రాధాన్యక్రమంలో నిర్మించనున్నారు.

# సేవల్లో లోపాలు.. పోరాడితే విజయాలు


హైదరాబాద్ : అనారోగ్యంతో ఉన్న పెంపుడు జంతువును విక్రయించినందుకు నగరంలోని 'వీఆర్ పెట్స్, కెన్నెల్' పెట్ షాపు యాజమాన్యానికి జిల్లా వినియోగదారుల కమిషన్-1 జరిమానా విధించింది. కొనుగోలు చేసిన వారికి రూ.10 వేలు పరిహారం, రూ.15 వేలు న్యాయ ఖర్చులు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

వస్తువులకు సంబంధించి కొనుగోలు చేసినందుకు చెల్లించిన మొత్తానికి అందుకు తగిన సేవలు పొందే హక్కు ప్రతి వినియోగదారుకూ ఉంటుంది. వస్తువులు కొన్నప్పుడు మోసాలు జరిగితే చాలామంది సమయం, పోరాడే శక్తి లేదని కొంతమంది.. మనకెందుకులే అంటూ మరికొంతమంది వదిలేస్తుంటారు. మరికొందరు పట్టు విడవకుండా విజయాలు సాధిస్తున్నారు. నష్టపోయిన మొత్తంతో పాటు న్యాయపోరాటానికి అయిన ఖర్చులనూ తిరిగి పొందుతున్నారు. దేశంలో 1936 డిసెంబరు 24న వినియోగదారుల హక్కుల చట్టం అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి అమలులోకి వచ్చిన రోజునే 'జాతీయ వినియోగదారుల దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు. వినియోగదారుల కమిషన్ పేరిట 2020 జులై 20 నుంచి కొత్త చట్టం అమలులోకి వచ్చింది.

**నీటి మూటలా వారంటీ మాట!**

ప్రస్తుతం సాంకేతిక పెరగడంతో పాటు ఆన్‌లైన్ మోసాలు కూడా అదే స్థాయిలో అధికమవుతున్నాయి. వినియోగదారులను మోసగించడంలోనూ హైటెక్ పద్ధతుల్ని అనుసరిస్తున్నారు. మార్కెట్‌లో విక్రయిస్తున్న చాలా వస్తువుల్లో నాణ్యత కొరవడుతోంది. వాటికి నిర్దేశించిన ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. కొన్న తర్వాత అందాల్సిన సేవల్లోనూ ఉద్దేశపూర్వక తాత్సారం జరుగుతోంది. ఉచితంగా అందించాల్సిన ఆ సేవలకూ ఇష్టారీతిన రుసుములు వసూలు చేస్తున్నారు. వారంటీ మాట నీటిమూటలా మారిపోయింది. ఇవన్నీ వినియోగదారులను మోసగించే చర్యల కిందికే వస్తాయి.

**ఫిర్యాదు చేయాలి ఇలా..** వినియోగదారులు ఎలాంటి మోసాలకు గురైనా పరిష్కారం, పరిహారం కోసం పోరాడవచ్చు. జిల్లా వినియోగదా



రుల ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చు. అక్కడ న్యాయం జరగదనుకుంటే రాష్ట్ర కమిషన్‌లోనూ ఫిర్యాదు అందించవచ్చు. వీటితో పాటు ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేసే సదుపాయాన్ని కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ 'వాట్సప్ చాట్‌బాట్' సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. వాట్సప్‌లో 88000 01915 నంబరుకు 'హాయ్' అని సందేశం పంపిస్తే.. ఎలా ఫిర్యాదు చేయాలో వివరిస్తుంది. ఇందులో ఫిర్యాదు చేస్తే జాతీయ వినియోగదారుల కమిషన్ హెల్ప్‌లైన్‌లో నమోదవుతుంది. అనంతరం కేసును జిల్లా వినియోగదారుల కమిషన్‌కు పంపిస్తారు. దీంతోపాటు 1800 114000, 1915 నంబర్లకు కాల్స్, e-jagriti.gov.in, consumerhelpline.gov.in% వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫిర్యాదులు చేయవచ్చు.

చురకలు



## ముక్కిపోతున్న దొడ్డు బియ్యం

మల్యాల: ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా తెల్ల బియ్యం పంపిణీ చేస్తుండగా అప్పటికే మిగిలిపోయిన దొడ్డు బియ్యాన్ని తీసుకోకపోవడంతో ముక్కిపోయి పిండిగా మారుతోంది. జిల్లావ్యాప్తంగా మండలాల పరిధిలో 592 రేషన్ దుకాణాలున్నాయి. వాటి ద్వారా ప్రతి నెలా 6,400 నుంచి 6,500 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఆరు నెలల కిందటి వరకు డీలర్లకు సరఫరా చేసిన దొడ్డు బియ్యంలో మిగిలిన నిలువలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదు. దీంతో ఆరు నెలలుగా సంచుల్లోనే ముక్కిపోతున్నాయి. కొన్ని దుకాణాల్లో పిండిగా మారుతున్నాయని డీలర్లు పేర్కొంటున్నారు. పౌరసరఫరాల మల్యాల గోదాంలో దాదాపు 600 సంచుల దొడ్డు బియ్యం సంచులు మిగిలిపోయాయి.

**ఒక్కో దుకాణంలో 10 క్వింటాళ్లు**



జిల్లాలో ఒక్కో డీలర్ వద్ద 5-10 క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిలువలు మిగిలిపోయాయి. వాటిని వేలం వేయడం గానీ, ఎఫ్‌సీఐకి అప్పగించడం గానీ చేయకపోవడంతో ముక్కిపోతున్నాయి.
ప్రస్తుతం సరఫరా చేస్తున్న సన్న బియ్యం బస్తాల్లోనూ కొన్ని నాణ్యత లోపించిన దొడ్డు బియ్యం సంచులుంటున్నాయని కొందరు డీలర్లు తెలిపారు. వాటిని వినియోగదారులకు పంపిణీ చేయకుండా పక్కన పెట్టినట్లు పేర్కొంటున్నారు. చాలా గ్రామాల్లో బినామీ వ్యక్తులు దుకాణాలు నిర్వహిస్తున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం డీలర్ల నియామకం చేపట్టకపోవడంతో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే దుకాణాలు నడుపుతున్నారు. రేషన్ దుకాణాలకు ఎలాంటి బియ్యం సరఫరా అవుతోంది. వినియోగదారులకు పూర్తి స్థాయిలో పంపిణీ జరుగుతోందా? అన్న విషయమై అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికీ గ్రామాల్లో కొందరు రేషన్ వినియోగదారులు సన్న బియ్యాన్ని విక్రయిస్తున్నా అధికారుల నిఘా కొరవడింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు
జిల్లాలోని రేషన్ దుకాణాలతో పాటు, పౌరసరఫరాల గోదాముల్లో దొడ్డు బియ్యం సంచుల నిల్వలున్నాయి. వాటిని ఏం చేయాలన్న విషయమై ప్రభుత్వం మాకు ఆదేశాలు జారీ చేస్తే ఆ మేరకు చర్యలు తీసుకుంటాం. -జితేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరా అధికారి

## 'ఆదా'య 'సౌర'భం

జగిత్యాల : సంప్రదాయ విద్యుత్తు వాడకంతో ప్రతి నెలా రూ.వేలల్లో బిల్లు చెల్లించే వారికి పీఎం సూర్యఘర్ పథకం వరంగా మారనుంది. ఏడాది కిందటే పథకం అందుబాటులోకి రాగా జిల్లాలో పలువురు ఇళ్లపై సౌర ఫలకల ఏర్పాటు చేసుకొని డబ్బులు ఆదా చేసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 3,21,776 గృహ విద్యుత్తు కనెక్షన్లున్నాయి. ప్రతి నెలా రూ.2-4 వేల బిల్లులు చెల్లించే వినియోగదారులు పీఎం సూర్యఘర్ పథకం కింద సౌర విద్యుత్తు తయారీపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో వివిధ కేటగిరీలు కలిపి 474 మంది వినియోగదారులు ఫలకలు ఏర్పాటు చేసుకోగా అందులో 312 గృహ కనెక్షన్లున్నాయి. వాణిజ్య కనెక్షన్లలో 131, కేటగిరీ 3లో 10, కేటగిరీ 7లో 21 మంది సౌర విద్యుత్తు ప్యానెళ్లు ఏర్పాటు చేసుకున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సుదర్శన్ తెలిపారు.
వాడకాన్ని బట్టి ప్యానళ్లు
అధీకృత కంపెనీ ద్వారానే సౌర ఫలకలు ఏర్పాటు చేసుకోవాలి. టాటాతో పాటు ఇతర ప్రముఖ కంపెనీలు పీఎం సూర్యఘర్ కింద ప్యానెళ్లు బిగిస్తున్నాయి.
ఎన్ని కిలోవాట్ల విద్యుత్తు అవసరమో ముందుగా ఎలక్ట్రీషియన్‌తో



ఇంటి లోడ్‌ను లెక్కించాలి. నెలకు 200-300 యూనిట్లు వినియోగించుకునే 2 నుంచి 3 కిలోవాట్ల ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవాలి. భవిష్యత్తులో ఏసీ బిగించాలనుకొనేవారు 4 కిలోవాట్ల ప్యానళ్లు బిగించుకోవడం మేలు. ఆసక్తి కలవారు పీఎం సూర్యఘర్ పథకం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

**పూచీకత్తు లేకుండా రుణాలు**

సౌర ఫలకల ఏర్పాటుకు స్వశక్తి సంఘాల సభ్యులకు స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తున్నారు. ఇతరులకు కూడా ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.2 లక్షల వరకు ఇస్తున్నారు. ప్రతి ఇంటికీ సౌర ఫలకలు ఏర్పాటు చేయడమే పీఎం సూర్యఘర్ పథకం ఉద్దేశం. ఇందుకోసం మా శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులను ప్రోత్సహిస్తున్నాం.
-సుదర్శన్, ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ

## గుట్టలు మాయం.. ప్రకృతికి గాయం

ధర్మపురి: ధర్మపురి, బుగ్గారం మండలాల్లో కొందరు గుట్టలను కొల్లగొడుతున్నారు. ఎలాంటి మైనింగు, రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా ఎర్ర, ఇతర విలువైన మట్టిని దూర ప్రాంతాలకు గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండిపటడంతోపాటు, ప్రకృతి సహజ సంపద తరలి పోతుందని స్థానికులు వాపోతున్నారు. ప్రతి గ్రామం సరిహద్దుల్లో ఒక చిన్న గుట్ట ఉంది. ఈ గుట్టలు సహజ సంపదతోపాటు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్నాయి. వీటిని సంరక్షించాల్సిన అధికారులు మిన్నకుంటున్నారనే విమర్శలున్నాయి.
కార్యాలయాల ఎదుట నుంచే..అధికారుల కార్యాలయాల ముందు నుంచే ఎర్ర మట్టిని తరలిస్తున్నా.. అధికారుల్లో ఏమాత్రం చలనం ఉండటం లేదని పల్లె ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటుక బట్టీలకు కచ్చితంగా సర్వే నంబర్, రెవెన్యూ, మైనింగ్ ధ్రువీకరణ పత్రాలను స్వీకరించిన తర్వాతే తరలించాల్సి ఉంటుంది. ఇలా కాకుండా ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. అలాగే ధర్మపురి పరిధి మారుమూల గ్రామాలైన తీగల ధర్మారం, దొంతాపూర్, మగ్గిడి, జైన, ఆరెపల్లి ప్రాంతాల్లోని గుట్టలను గుత్తేదార్ల దాహానికి మాయమవుతున్నాయి.
రాత్రిళ్లు గుట్టుగా..నేరెళ్ల, వెల్గొండ ప్రాంతాల్లోని గుట్టల వద్ద లభ్యమయ్యే ఎర్రమట్టిని రాత్రిళ్లు జేసీబీలు పెట్టి వాహనాల్లో తరలిస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు, నిఘా పెట్టడంలేదు. రహదారుల నిర్మాణానికి, ఇతర ప్రభుత్వ, ప్రజా అవసరాలకు వినియోగించినా పర్వాలేదు. అయితే వ్యక్తిగత స్వలాభానికి విక్రయిస్తున్నారు.

# రుణాలకు.. కొత్త మెలిక

రాయికల్ : దేశ ఆర్థిక వ్యవస్థలకు వెన్నుముకగా నిలుస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎమ్ఎస్ఎమ్ఈ) అభివృద్ధికి కేంద్రం తీసుకువచ్చిందే ఉద్యమ్ రిజిస్ట్రేషన్. వ్యాపారవేత్తలు తమ సంస్థలకు సులభంగా, ఉచితంగా, పేపర్‌లెస్ విధానంలో అధికారిక గుర్తింపు పొందడానికి ఇది ఉపయోగపడుతుంది. ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌తో ఎమ్ఎస్ఎమ్ఈలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక, చట్టపరమైన, పరిపాలనపరమైన ప్రోత్సాహకాలు పొందుతారు.

**తక్కువ వడ్డీ ప్రయోజనాలు**

దీనివల్ల ప్రభుత్వ పథకాల ద్వారా హామీ లేని రుణాలు, వడ్డీ రేట్లలో రాయితీ లేదా తక్కువ వడ్డీ వంటి ప్రయోజనాలు సమకూరుతాయి. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ అనేది ఎమ్ఎస్ఎమ్ఈ మంత్రిత్వ శాఖ ద్వారా అందించబడే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ. ఈ ప్రక్రియ ఆధార్, పాన్‌కార్డు అనుసంధానంపై ఆధారపడి ఉండగా.. రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం ఆయా సంస్థలకు ఒక శాశ్వత ప్రత్యేక గుర్తింపు సంఖ్య, ధ్రువీకరణ పత్రం లభిస్తుంది. బల్దియా పరిధిలో నమోదైన స్ట్రీట్ వెండర్స్‌కు, ముద్ర రుణాల దరఖాస్తుదారులు, వ్యాపారం కోసం పీఎంఈజీపీ వంటి పథకాల్లో బ్యాంకు రుణాలు తీసుకునేవారికి ఉద్యమ్ ఆధార్ తప్పనిసరిగా కలిగి ఉండాలని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు.

**ఆన్‌లైన్ నమోదు విధానం**

%https:///www.udyamregistration.gov.in/Governm ent-India/Ministry-MSME-registration.htm% అనే హోమ్ పేజీలో 'ఫర్ న్యూ ఎంటర్‌ప్రెన్యూర్స్ హూ ఆర్ నాట్ రిజిష్టర్డ్ యెట్ యాస్ ఎమ్ఎస్ఎమ్ఈ' అనే ఆప్షన్ ఎంచుకొని ఆధార్ నంబర్, పేరు నమోదు చేసి జనరేట్ ఓటీపీ బటన్ ఎంచుకోవాలి. రిజిస్టర్డ్ మొబైల్‌కు వచ్చిన ఓటీపీని నమోదుచేసి వాలిడేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి.
వ్యాపార సంస్థ రకాన్ని ఎంచుకొని పాన్ నంబర్ నమోదు చేయగానే ధ్రువీకరణ జరుగుతుంది. అనంతరం చరవాణి నంబర్, మొయిల్ ఐడీ, సామాజిక వర్గం, జెండర్, వ్యాపార సంస్థ పేరు, చిరునామా, సంస్థ రిజిస్ట్రేషన్ వివరాలు, నిక్(నేషనల్ ఇండస్ట్రియల్ క్లాసిఫికేషన్) కోడ్, పెట్టుబడి వివరాలు తదితర నమోదు చేయాలి. అన్ని వివరాలు సరి చూసుకున్న తర్వాత సబ్మిట్ అండ్ గెట్ ఫైనల్ ఓటీపీ బటన్‌పై క్లిక్ చేయాగానే వచ్చిన ఓటీపీ నమోదు చేసి క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాలి. అనంతరం దరఖాస్తు సమర్పించాలి. దరఖాస్తు సమర్పించగానే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ నంబర్(యుఆర్ఎన్) చూపిస్తోంది. నమోదుచేసిన మొయిల్ ఐడీకి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ వస్తుంది.

# ఇకనైనా కుక్కల సమస్య తీరేనా?



కరీంనగర్ : 'విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా మైదానాలు, ఆసుపత్రులు తదితరల జన రద్దీ ఉండే బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలను సంచరించకుండా చేయాలి. వాటిని ప్రత్యేక షెడ్లకు తరలించండి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలకు ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవి..జిల్లాలోని నగర, పురపాలికల పరిధిలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. ఏ సమయంలో ఇవి దాడికి దిగుతాయో తెలియకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎనిమిల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) నిబంధనల ప్రకారం జంతు సంరక్షణ బోర్డు ఆఫ్ ఇండియా ద్వారా శునకాలకు శస్త్రచికిత్సలు చేసి సంతానోత్పత్తి తగ్గించాల్సి ఉండగా, పలు ప్రాంతాల్లో ఈ ప్రక్రియ నిలిపివేశారు. కరీంనగర్‌లో ఆపరేషన్ థియేటర్, క్యాటిల్ సక్రమంగా లేదనే ఫిర్యాదుతో ఆగిపోయింది. మరో వైపు జన సమూహ ప్రాంతాల నుంచి వీటిని తరలించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయగా ఏమేరకు సమస్యను పరిష్కరిస్తారో తెలియకుండా మారింది. పురపాలికల పరిధిలో షెల్టర్లు లేవు. వాటిని నిర్మించి శునకాలను తరలిస్తారా లేదా చూడాలి మరి.

**పెరుగుతున్న ఫిర్యాదులు**

పుర, నగరపాలికల్లో శునకాల గుంపులతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పిల్లలకు పెద్దలు తోడుగా వెళ్లాల్సి వస్తోంది.
రాత్రిపూట నడిరోడ్లపై ఉంటూ రాకపోకలు సాగించే వాహనదారుల వెంట పడుతుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.
వీధి కుక్కలను తరలించాలని జిల్లాలో ఫిర్యాదులు పెరుగుతుండగా.. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.
ఎక్కడ పడితే అక్కడ వీధుల్లో, బహిరంగ ప్రదేశాల్లో కొందరు ఆహారం పెట్టడంతో శునకాలన్నీ అక్కడికి చేరుకుంటున్నాయి.

**షెడ్లు నిర్మిస్తేనే శస్త్రచికిత్సలు**

కరీంనగర్‌లో రామగుండం బైపాసు రోడ్డులో జంతు సంరక్షణ కేంద్రం కోసం షెడ్డు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శ్లాబ్ దశకు చేరింది.
కోర్టు ఆదేశాల మేరకు షెడ్లు నిర్మిస్తే తప్ప శునకాలకు శస్త్ర చికిత్స చేసే అవకాశం లేదు.
వీధికుక్కల శస్త్రచికిత్స కోసం థియేటర్, క్యాటిల్ షెడ్డు వంటి సౌకర్యాలు అక్కడ ఏర్పాటు చేయనున్నారు.

**వేగంగా నిర్మాణ పనులు**

నగరానికి సంబంధించి జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. శునకాల తరలింపు విషయంపై మార్గదర్శకాలు రావాలి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నిర్ణయముంటుంది.
దుర్గాప్రసాద్‌రెడ్డి, పశు వైద్యాధికారి, ఒల్దియా

# సేవాలోపాల్లో 'అందరూ బాధ్యులే'




కరీంనగర్ :వినియోగదారులకు విక్రయించే ఉత్పత్తులకి సంబంధించి సేవాలోపాలుంటే తయారీదారులతో పాటు విక్రయదారులు, డీలర్లు సైతం బాధ్యులేనని తాజా తీర్పులు వెల్లడిస్తున్నాయి. సేవా లోపముంటే ప్రతి దశలో పరిష్కారం దిశగా ప్రయత్నించాలని పేర్కొంటున్నాయి. తాజాగా ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ విక్రయించిన కేసులో తయారీదారుదే పూర్తి బాధ్యత అంటూ అమెజాన్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ తప్పించుకునే ప్రయత్నం చేయగా.. సేవాలోపం ఉందని గుర్తించి పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసినందుకు బాధ్యులను చేస్తూ పరిహారం చెల్లించాలని రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు వెలువరించింది.

**లోపాలు జరుగుతున్నాయిలా..**

ఆరోగ్య సేవలు - రోగ నిర్ధారణలో తప్పులు, శస్త్ర చికిత్సలో నిర్లక్ష్యం, హాస్పిటల్ బిల్లు ఎక్కువ చూపించడంబ్యాంకింగ్, ఫైనాన్షియల్ సేవలు - ఏటీఎం నుంచి డబ్లు రాలేదు కానీ ఖాతాలో ఉపసంహరించడం, రుణానికి ఆమోదం ఇచ్చి తర్వాత తిరస్కరించడం, బీమా క్లెయిమ్ తిరస్కరణ్య టెలికాం, ఇంటర్నెట్ సేవలు - రీఛార్జ్ చేసినా డేటా రాకపోవడం, బిల్లింగ్ లోపం (ఎక్కువ బిల్), ఇంటర్నెట్ స్పీడ్ హామీ ఇచ్చి తక్కువ ఇవ్వడం ప్రయాణాలు, ఆతిథ్య సేవలు - విమాన ప్రయాణం రద్దుపై ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, హోటల్ బుక్ చేసి గది ఇవ్వకపోవడం, టూర్ ప్యాకేజీలో హామీ ఇచ్చిన స్థలాలు లేకపోవడం
ఈ కామర్స్, డెలివరీ సేవలు - ఆర్డర్ ఇచ్చిన మోడల్‌కు బదులుగా వేరేవి రావడం, డెలివరీ ఆలస్యం, రిటర్న్ పాలసీ ప్రకారం రీఫండ్ ఇవ్వకపోవడం
గ్యాస్ సిలిండర్ లీక్, సేఫ్టీ చెక్ చేయకపోవడం, నీటి సరఫరా నిలిపివేత (సమాచారం ఇవ్వకపోవడం).

**జిల్లా కమిషన్లలో కేసులు..**

రాజధాని పరిధిలో నిత్యం రూ.కోట్ల వ్యాపారం జరుగుతోంది. తక్కువ ప్రచార ఖర్చులో విక్రయాలు పెంచుకోవడానికి కొంత మంది అనుచిత వ్యాపార పద్ధతులను అవలంభిస్తున్నారు. అందించాల్సిన సేవలను విస్మరిస్తున్నారు. ఈ క్రమంలో లోపం ఉందని తెలిసి ఉత్పత్తులు విక్రయిస్తూ, నాణ్యత పట్టించుకోకపోవడం లేదు. ఈ తరహా కేసులు రాజధాని పరిధిలోని 4 జిల్లా వినియోగదారుల కమిషన్లలో ప్రతినెలా 150కిపైగా నమోదవుతున్నాయి.

**తయారీదారు బాధ్యతలివీ..**

ఉత్పత్తి సురక్షితం, నాణ్యత కలిగి ఉండాలి.- వారంటీ, గ్యారంటీ ప్రకారం సేవలు అందించాలి.- లోపం తెలిస్తే రీకాల్ చేయాలి.- ప్రమాదకరమైన ఉత్పత్తులు (ఉదా: ఆటోమొబైల్స్, ఔషధాలు) గుర్తిస్తే హెచ్చరికలు ఇవ్వాలి.

**విక్రయదారు/ డీలర్‌లవి**

లోపం ఉన్న ఉత్పత్తి విక్రయించకూడదు. తెలిసినా తెలియకపోయినా బాధ్యులే. తప్పుడు ప్రకటనలు చేయకూడదు.
వారంటీ ప్రకారం సేవలు అందించాలి. లేదా తయారీదారుకు పంపాలి.
బిల్, వారంటీ కార్డు ఇవ్వాలి. వినియోగదారుడు విక్రేతకు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు.
సేవా ప్రదాత.. సేవా ఒప్పందం, ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి అనుచిత వాణిజ్య పద్ధతులు అవలంబించకూడదు
ధర, నాణ్యత, రిస్కుల గురించి స్పష్టంగా చెప్పాలి.

# ఆధునిక వసతులు.. ఆటపాటల తరగతులు

కరీంనగర్ : ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రీప్రైమరీ పాఠశాలలకు మహర్దశ చేకూరనుంది. అయిదేళ్లలోపు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్న ఈ పాఠశాలలకు బోధనాభ్యసన సామగ్రిని సమగ్ర శిక్షా అధికారులు సమకూరుస్తున్నారు. ఆటపాటలతో చిన్నారులకు బోధన చేసేందుకు ఈ సామగ్రి ఉపయోగపడనుంది. వీటితోపాటు తరగతి గదులకు రంగులు, బాలలకు ఏకరూప దుస్తులు అందించనున్నారు. ప్రైవేటుకు ధీటుగా అధునాతన వసతులతో చిన్నారులనే కాకుండా వారి తల్లిదండ్రులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు.

**జిల్లాలో 22 బడులు ఏర్పాటు**

ఈ ఏడాది అక్టోబరులో జిల్లాలో 22 ప్రీప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేశారు. వీటికి ఒక ఇన్‌స్ట్రక్టర్, చిన్నారులను చూసుకోవడానికి ఆయాను విద్యాశాఖ నియమించింది. ప్రస్తుతం 150 మంది బాలలు చేరగా యూకేజీ తరగతులు బోధిస్తున్నారు. అయితే సాధారణ రీతిలో బోధన చేస్తుండటంతో చిన్నారులు ఆకర్షితులు కావడం లేదని తెలుస్తోంది. కిడ్స్ కేర్ పాఠశాలలను తలపించేలా ఈ పాఠశాలల్లో అధునాతన వసతులు, ఆటపాటలతో కూడిన బోధనా పద్ధతులతో తీర్చిదిద్దే విషయంపై సమగ్ర శిక్షా అధికారులు దృష్టి నిలిపారు.

**ఒక్కోదానికి రూ.1.70 లక్షలు**


జిల్లాలోని ఒక్కో ప్రభుత్వ ప్రీప్రైమరీ పాఠశాలకు రూ.1.70 లక్షల నిధులు కేటాయించి తీర్చిదిద్దుతున్నారు. సామగ్రి, బోధనాభ్యసన సామగ్రి అందించనున్నారు. ఇప్పటికే ఇవి జిల్లాకు చేరడంతో శనివారం ఎంఈవోల ద్వారా పాఠశాలలకు పంపిణీ చేశారు. పాఠశాల తరగతి గదులను అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు రూ.50 వేలతో రంగులు వేయిస్తున్నారు. రూ.20 వేలతో బాలలకు దుస్తులు, స్టేషనరీ సమకూరుస్తున్నారు. ఆటపాటలతో అభ్యసనాన్ని సాగించేందుకు పలు రకాల వస్తువులు, ఆట బొమ్మలు, రంగురంగుల ఆకారాలు వంటివి అందించనుండటంతో చిన్నారులు చదువుపై ఆసక్తి చూపిస్తారని, ఈ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

## అంతా ఏకమై.. అన్నదాతకు శాపమై..!

సూర్యాపేట : అకాల వర్షాలు, మొంథా తుపాను వరి రైతులపై అదనపు భారాన్ని మోపాయి. వానలతో నిలిచిన వరికోత పనులకు వాతావరణం ప్రస్తుతం అనుకూలించడంతో ఒకేసారి పొలాలు కోతకు వచ్చాయి. దాంతో యంత్రాల నిర్వాహకులు, వాటి మధ్యవర్తులు అన్నదాతల అవసరాన్ని ఆసరా చేసుకుని ధరలను పెంచారు. అయినా ముందుకొస్తే హార్వెస్టర్ల కొరత నెలకొంది. రెండు రోజులు ఆలస్యమైనా.. తమ పొలాన్ని నూర్పిడి చేయాలంటూ రైతులు యంత్రాల నిర్వాహకుల, మధ్యవర్తులు చుట్టూ తిరుగుతున్నారు. వాన భయంతో కొన్ని ప్రాంతాల్లో ముందస్తు చెల్లింపులు చేస్తూ బుకింగ్ చేయించుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి.

**50 శాతం పూర్తి..**

ఉమ్మడి జిల్లాలో 11.82 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా.. అత్యధికంగా ఎన్ఎస్పీ, ఎస్సారెస్పీ, మూసీ పరివాహకంలోనే సాగైంది. ప్రస్తుతానికి 50 శాతం కోతలు కాగా మరో 50శాతం కోయాల్సి ఉంది. ఇందులో దిగుబాటు పొలాలే ఎక్కువగా ఉండటంతో చైన్ హార్వెస్టర్లను ఆశ్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఫోర్ వీల్ యంత్రాలతో నూర్పిడి చేయిస్తున్నారు. చైన్ల యంత్రాల నిర్వాహకులు గతంలో ఎకరం పొలాన్ని గంట సమయంలో కోసేవారు. అందుకు రూ.3 వేల చొప్పున తీసుకునే వారు. ఇప్పుడు యంత్రాల కొరత, నూర్పిడికి డిమాండ్ ఉండటంతో గంటకు రూ.500 ధర పెంచి రూ.3,500 తీసుకుంటున్నారు. ఫోర్‌వీల్ గతంలో గంటకు రూ.2,500 తీసుకుంటే ఇప్పుడు



రూ.3 వేలు తీసుకుంటున్నారు.
మొంథా తుపాను ప్రభావంతో చాలా పొలాలు నేలవాలడంతో ఎకరం విస్తీర్ణాన్ని 1:30 గంటల నుంచి 2 గంటల పాటు కోయాల్సి వస్తుందని యంత్రాల నిర్వాహకులు చెబుతున్నారు. ఈ లెక్కన ఒక రైతు ఎకరం పొలం కోయించడానికి రూ.5,250 నుంచి రూ.6 వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. అదే 10 ఎకరాల విస్తీర్ణం కలిగిన రైతు రూ.52,500 నుంచి రూ.60 వేలు వెచ్చిస్తున్నారు.
వానాకాలం వరి కోతలు సాధారణంగా రాత్రి 8 గంటల సమయం వరకు చేస్తారు. కారణం మంచు పడి కోత చేస్తే వడ్లు నేలరాలి నష్టపోతామని రైతులు వద్దనే వారు. కానీ, ప్రస్తుతం యంత్రాల కొరత కారణంగా దాదాపు రాత్రి 11 గంటల దాకా కోత పనులు చేస్తున్నారు.
రూ.5 వేల అదనపు భారం: బోసు, పాలవరం, అనంతగిరి మండలం ఎనిమిదెకరాల్లో వరిసాగు చేశా. హార్వెస్టర్‌కు గతేడాది గంటకు రూ.3 వేలు ఉండగా.. ఈ దఫా ఒక్కో గంటకి రూ.3,500 వసూలు చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఈసారి కోత పనులకు రూ.5 వేల అదనపు భారం పడింది.

## అక్షరమే ఆయుధం.. విజయ వికాసం

మిర్యాలగూడ : చదువుతోనే భవిష్యత్తు బంగారుమయం అవుతుందని మేధావులు ఏనాడో చెప్పారు. చదువు అనగానే ప్రతి ఒక్కరికి ఉద్యోగం, వేతనం మాత్రమే గుర్తుకు వస్తుంది. కానీ అసలు చదువు అంటే విజ్ఞానం. విజ్ఞానం పొందిన వారు మంచి భవిష్యత్తుతో పాటు సమాజంలో కీర్తి ప్రతిష్ఠలు సైతం అందుకుంటారు. దేశంలో ఉన్నత విద్యకు ఆజ్యం పోసిన భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఏటా నవంబరు 11న 'జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.
**ఉమ్మడి జిల్లాలో ఇలా..** ప్రస్తుత రోజుల్లో చదువుకోవడానికి అవకాశాలు ఉన్నప్పటికీ అనేక మంది నిర్లక్ష్యం చేస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చదువు విలువ తెలిసిన వారు ఎలాంటి అవకాశాలు లేకపోయినా ఉన్న కొద్దిపాటి వనరులనే సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదివి కొలువుదీరిన వారు సైతం ఉన్నారు.

**చదువు విలువ తెలిసి...**

సైదులు, ఎక్సైజ్ ఎస్సై, వెంకటాద్రి పాలెం, మిర్యాలగూడ మండలం. అమ్మానాన్నలు భిక్షం, ఎల్లమ్మ గీత కార్మికులు. కుటుంబ పోషణ కోసం ఆరో తరగతి లోనే చదువు మానేసి పనిలో చేరాను. ఐదేళ్ల తర్వాత చదువు విలువ తెలిసి దూరవిద్య ద్వారా పదో తరగతి, డిగ్రీలో చేరాను. పరీక్షల్లో అనేక సార్లు ఫెయిల్ అయినప్పటికీ గ్రామానికి వచ్చిన అధికారులు, వారికి ప్రజలు ఇచ్చే గౌరవాన్ని చూసి నేను కూడా అదే స్థాయి గౌరవం పొందాలని నిశ్చయించుకున్నాను. ఎంతో కష్టపడి డిగ్రీ పూర్తి చేశాను. అనంతరం బీఈడీ సైతం పూర్తి చేసి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీజీ సెట్‌లో ఎనిమిదో ర్యాంకు సాధించి, ఎంఏ ఎకనామిక్స్‌లో సీటు పొందాను. పొలిటికల్ సైన్స్‌లో సైతం పీజీ పూర్తి చేసి ఉద్యోగానికి సన్నద్ధమయ్యాను. 2016లో గ్రూప్-2లో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకుతో ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం ధూల్‌పేటలో పని చేస్తున్నాను.
**తాళ్లెక్కుతూ.. కల్లు విక్రయిస్తూ...** పల్స నాగరాజుగౌడ్, సూర్యాపేట. మాది సాధారణ పేద వ్యవసాయ, గీత కార్మిక కుటుంబం. అమ్మానాన్నలు పల్స రాములు-సత్తెమ్మలు కష్టాలు పడి నన్ను, అక్క, చెల్లిని పోషించే వారు. నేను చదువుకునే వయసులోనే పొలం పనులకు, కల్లు విక్రయాలకు వెళ్లే వాడిని. పాఠశాల, కళాశాల విద్యలన్నీ ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పూర్తి చేశాను. డిగ్రీ చదువుతున్న రోజుల నుంచే తాళ్లెక్కడం, కల్లు గీయడం, విక్రయించడం వంటి పనులు చేసే వాడిని. డిగ్రీ, బీఈడీ పూర్తి చేసిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమయ్యాను. ఈ క్రమంలో ఏడాది కాలంలోనే ఎస్సైగా ఉద్యోగం సాధించాను. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పని చేశాను. ప్రస్తుతం హయత్‌నగర్ సీఐగా పని చేస్తున్నాను.

# ఊరికో రేవు.. ఉచితం కరవు

పెళ్లకూరు : రెవెన్యూ, పోలీసుశాఖల వైఫల్యంతో స్వర్ణముఖిలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. కొందరు నాయకుల అండతో మాఫియాదారులు రెచ్చిపోతున్నారు. అడ్డుకుంటున్న స్థానికులపై దౌర్జన్యానికి దిగుతున్నారు. స్థానిక అవసరాలకు మాత్రమే నదీతీరంలోని రేవుల్లో ఉచితంగా ఇసుక తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. భారీ భవంతులు, ప్రాజెక్టులు, ఇతర వాణిజ్య అవసరాలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికార ఇసుక యార్డుల నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. కలవకూరు, గూడలి ప్రాంతాల్లో అధికారికంగా తీసిన ఇసుక ఓవైపు పొరుగు రాష్ట్రాలకు అక్రమంగా పంపిస్తుండగా అనధికారికంగా మరికొందరు తరలిస్తున్నారు.

**నెలనెలా మామూళ్లు**



ఉచిత ఇసుకను ఆసరాగా చేసుకొని కొందరు నాయకులు గ్రామాల పరిధిలో ఎవరికివారు అనధికార రీచ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. అధికారులు నెలనెలా మామూళ్లు తీసుకొని తవ్వకాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో కొందరు పోలీసుల ప్రమేయం ఉందన్నది వాస్తవం. నది పొర్లుకట్టలు ధ్వంసం చేసి బాటలు ఏర్పాటు చేసుకుంటున్నారు. నదీ తీరంలోని ఫిల్టర్ పాయింట్లు ధ్వంసం చేస్తున్నారు.అక్రమ తవ్వకాల గురించి పెళ్లకూరు తహసీల్దారు హరికృష్ణతో ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.


**తవ్వకాలు ఇక్కడే**

చిగురుపాడు, భీమవరం, అయ్యప్పరెడ్డిపాళెం, మూర్తిరెడ్డిపాళెం, మర్లపల్లి, అన్నమేడు, తుమ్మూరు, ఎల్.ఎ.సాగరం పాత బీడీకాలనీ తిమ్మాజీకండ్రిగ కాజీవే ప్రాంతాలు పెన్నేపల్లి, దిగువచావలి, పెళ్లకూరు రాజిగారితోట, యడఘాడి పెరుమాళ్లపల్లి, కలవకూరు చింతపూడి, పుల్లూరు, రావులపాడు.

# విద్యాశక్తి.. గురువుల్లో అనాసక్తి!

లక్కొల్లు : ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో రాణించేలా శిక్షణ ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం 'విద్యాశక్తి' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. రూ.లక్షలు వెచ్చిస్తేగానీ లభించని శిక్షణను ఆన్‌లైన్ ద్వారా 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు అందించేలా మద్రాస్ ఐఐటీతో ఒప్పందం చేసుకుంది. నిపుణులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా లేదా రికార్డు చేసి పాఠ్యాంశాలతో బోధన సాగించేలా ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమం అమలులో జిల్లా పూర్తిగా వెనుకబడింది. పలు ఉపాధ్యాయ సంఘాలు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించడం దీనికి కారణంగా కనిపిస్తోంది.

**అదనపు భారమని..** విద్యాశక్తి కార్యక్రమం అమలును కొందరు ఉపాధ్యాయులు అదనపు భారంగా భావిస్తున్నారు. తెరపై నిపుణులు బోధన సమయంలో పర్యవేక్షణ విధులతో పాటు దానికి సంబంధించిన ఫీడ్‌బ్యాకును యాప్‌లో పొందుపరచడం, ఫొటోలు తీయడం, విద్యార్థుల



స్పందనను ఆన్‌లైన్ చేయడం వంటి పనులు చేయాల్సి వస్తోందని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి క్రాంతికుమార్ చెబుతున్నారు.

**ఇలా చేస్తే మేలు..** ఆన్‌లైన్‌లో బోధనకు నోచుకోని విద్యార్థుల కోసం విద్యాశక్తి పాఠ్యాంశాలకు సంబంధించిన లింకులను ఏరోజుకారోజు తరగతుల వారీగా ఆయా వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయడం మేలని యలమంచిలి ఎంఈవో కేవీఆర్ కృష్ణరాజు పేర్కొన్నారు. వీటిని అనుసరించి ఖాళీ సమయాల్లో విద్యార్థులు తరగతులు వినాలని సూచించారు. కనీసం దీనినైనా ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తే కొంత వరకు ఫలితాలు బాగుండే అవకాశం ఉంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సి ఉంది.

**137 పాఠశాలల్లో..** ప్రతి మండలంలో మూడు లేదా నాలుగు చొప్పున జిల్లా వ్యాప్తంగా 137 ఉన్నత పాఠశాలలను ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య, లేదా ఉదయం వేళ తరగతులకు ముందు డిజిటల్ తెరపై నిపుణులు బోధించే పాఠాలను విద్యార్థులు వినాల్సి ఉంటుంది. ప్రతి తరగతికి నిత్యం రెండు సబ్జెక్టులు ఎంపిక చేసి వాటిలో అంశాలను బోధిస్తారు.

# ఈ రోడ్లు బాగు పడతాయ్!

కొయ్యలగూడెం : ఉమ్మడి జిల్లాలో ర.భ.శాఖ పరిధిలోని మరిన్ని రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. జిల్లా ప్రధాన రహదారులు, రాష్ట్ర రహదారు(స్టేట్ హైవే)ల విభాగాల్లో ఏలూరు జిల్లాలో రూ.15.59 కోట్ల అంచనాతో కీలకమైన ఆరు పనులకు, పశ్చిమగోదావరిలో రూ.36.50 కోట్ల విలువైన తొమ్మిది పనులకు అనుమతి మంజూరైంది. వీటిలో వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు పనుల్లో సాంకేతిక ఇబ్బందుల కారణంగా రద్దయిన పనులున్నాయి. కూటమి ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించి నిధులు మంజూరు చేయడంతో గ్రామీణ రహదారులకు మోక్షం లభించింది. పనులు టెండర్ల దశలో ఉన్నాయని ర.భ. శాఖాధికారులు తెలిపారు.


**ఏలూరు జిల్లా ప్రధాన రహదారుల విభాగంలో..**

జిలుగుమిల్లి మండలం బర్రింకలపాడు- పూచికపాడు రహదారికి 11.20 కి.మీల పనులకు రూ.3.60కోట్లు, కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం- రేగులకుంట రహదారిలో కిచ్చప్పగూడెం సమీపంలోని పులి వాగు(భీముడు అడుగు) నుంచి దిప్పకాయలపాడు, మంగపతిదేవిపేట, పోలవరం మండలం రేపల్లెవాడ నుంచి పోలవరం తాలూకా కార్యాలయం వరకు 12.870కి.మీల వరకు రూ.3.30కోట్లు మంజూరయ్యాయి.

**రాష్ట్ర రహదారులలో..**

దెందులూరు- పంగిడిగూడెం(ఎస్‌హెచ్ 224)రహదారిలో 5.28 కి.మీల మేర పనులకు రూ.2 కోట్లు, నడుపూరు-వడవల్లి-కోరుకొల్లు(ఎస్‌హెచ్ 310) రహదారిలో 2.40కి.మీల పొడవున పనులకు రూ.1.55కోట్లు, ఏలూరు-మేడిశెట్టివారిపాలెం(ఎస్‌హెచ్ 020) రహదారికి రూ.1.34 కోట్లు మంజూరయ్యాయి.

# ఆవిష్కరణలు.. అందిపుచ్చుకునేలా!



విశాఖపట్నం: వైద్య సాంకేతికతలో వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్న ఏపీ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్) ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. దీంతో దేశ, విదేశాల్లోని ప్రముఖ సంస్థలు ఇక్కడకు వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇటీవల కొన్ని సంస్థలు మెడ్‌టెక్ జోన్‌తో అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) చేసుకున్నాయి. దీంతో ఇక్కడ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వైద్య సాంకేతికత రంగంలో పరిశోధనలు వేగవంతం కానున్నాయి.

**ఒకే వేదికపై వివిధ రంగాలు**

ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్న వంద విశ్వవిద్యాలయాల్లో ఒకటైన యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా (యూడబ్ల్యూఏ) మెడ్‌టెక్ జోన్‌లో కేంద్రం ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రం విద్యా కార్యక్రమాల మార్పిడి, పరిశ్రమల సహకారం, ఆవిష్కరణలకు వేదికగా పనిచేయనుంది. తద్వారా విశాఖ గ్లోబల్ హెల్త్ టెక్నాలజీ సహకార కేంద్రంగా స్థిరపడనుంది. మెడ్‌టెక్, సముద్ర విజ్ఞానం, రక్షణ, సుస్థిరాభివృద్ధి, వ్యవసాయం, డేటా సైన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి.. ప్రపంచవ్యాప్త సవాళ్లకు పరిష్కారం చూపాలని లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ రంగాల్లో భవిష్యత్తు ఉద్యోగావకాశాలను అందుకునేలా విద్యార్థులు, వృత్తి నిపుణులను సిద్ధం చేసేందుకు ఇక్కడ ప్రత్యేక కార్యక్రమాలు అందించనున్నారు. సంయుక్త పరిశోధన, దేశంలోని అగ్రస్థాయి మెడ్‌టెక్ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులు, పరిశోధకులకు కొత్త అవకాశాలు రానున్నాయి.

**పరిశోధనల మెరుగుకు**

దిల్లీకి చెందిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ (ఐఐహెచ్‌ఎంఆర్) ప్రజారోగ్యం, అనుబంధ రంగాల్లో నిర్వహణ, నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించడానికి కృషి చేస్తోంది. భారత్‌లో కీలకమైన మెడ్‌టెక్ పర్యావరణ వ్యవస్థ (ఎకో సిస్టమ్)ను బలోపేతం చేసేందుకు ఆ సంస్థ మెడ్‌టెక్ జోన్‌లో ఉపగ్రహ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.

తద్వారా మెడ్‌టెక్ రంగంలో విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలు మరింత మెరుగుపడేందుకు వీలుంటుంది. పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్య కోర్సులు, ఎగ్జిక్యూటివ్ విద్యా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య సహకారం బలోపేతమవుతుంది. **సంయుక్తంగా మాస్టర్ ప్రోగ్రాంలు..** ఆమ్‌స్టర్‌డామ్‌లోని వ్రిజె యూనివర్సిటీ (వీయూ) ఏఎంటీజెడ్‌లో ఎకోసిస్టమ్, ఆవిష్కరణ సామర్థ్యాలను వినియోగించుకోనుంది. ఇక్కడ నూతన సాంకేతికతను అభివృద్ధి చేయనుంది. అందుబాటు ధరలో రోగ నిర్ధారణ, వైద్య పరికరాల తయారీకి సంబంధించిన ఆలోచనలను ఆచరణరూపంలోకి తీసుకొచ్చే కార్యక్రమాలను వేగవంతం చేయనుంది. మెడ్‌టెక్ విశ్వవిద్యాలయంలో వీయూకు చెందిన మేనేజ్‌మెంట్, పాలసీ అనాలసిస్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ హెల్త్ అండ్ లైఫ్ సైన్సెస్ తదితర మాస్టర్ ప్రోగ్రాంలను సంయుక్తంగా అందిస్తాయి. విద్యార్థులు ఆయా కోర్సులు నేర్చుకోవడంతోపాటు ఇంటర్న్‌షిప్‌లు పొందొచ్చు.

# అందరికీ శుద్ధజలం.. అందని ద్రాక్ష



కుప్పం : దేవుడు కరుణించినా.. సామెతలా తయారైంది ఎన్టీఆర్ సుజల ప్రాజెక్టు పరిస్థితి. గత ప్రభుత్వం పథకంపై నిర్లక్ష్యం వహించడంతో శుద్ధజల కేంద్రాలు చాలాచోట్ల మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటి నిర్వహణ, యంత్రాల మరమ్మతుకు నిధులు మంజూరు చేసింది. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవటంతో పనులు నెమ్మదించాయి. అందరికీ శుద్ధజలం అందని ద్రాక్షలా మారింది. కుప్పంలో సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవతో పైలట్ ప్రాజెక్టుగా పదేళ్ల కిందట ఎన్టీఆర్ సుజల ప్రాజెక్టును ప్రారంభించారు. అప్పట్లో రూ.22 కోట్లతో 16 మదర్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టి వాటి ద్వారా నియోజకవర్గంలోని 202 పంపిణీ కేంద్రాల ద్వారా ప్రజలకు రూ.2కే 20 లీటర్ల శుద్ధజలం అందించేవారు. వైకాపా అధికారంలోకి వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పథకానికి పేరు మార్చి పార్టీ రంగులు పూశారు. రూ.2కే అందే నీటిని రూ.5కు పెంచారు. యంత్రాలు మరమ్మతుకు గురైనా పట్టించుకోకపోవడంతో క్రమంగా పంపిణీ కేంద్రాలన్నీ మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుజల ప్రాజెక్టుకు పూర్వవైభవం తీసుకురావడానికి రూ.10.32 కోట్లు మంజూరు చేసింది. **ఏజెన్సీకి రెన్యూవల్..**

పథకం నిర్వహణను ఏసర్ కంపెనీకి ప్రభుత్వం అప్పగించింది. రూ.2కే 20 లీటర్ల నీటిని ఇవ్వడంతో నష్టపోయామని చెప్పడంతో మరో సంవత్సరం పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం ఇచ్చింది. పెండింగ్‌లో ఉన్న రూ.5.5 కోట్లను మంజూరు చేసింది. ప్రస్తుతం 16 మదర్ ప్లాంట్లలో 11 ప్లాంట్లకు మరమ్మతులు చేసి, 202 శుద్ధజల పంపిణీ కేంద్రాల్లో 71 బాగుచేసి సరఫరా చేస్తున్నారు.

5జీకి ప్రతిపాదనలు.. నియోజకవర్గంలోని శుద్ధజల పంపిణీ కేంద్రాల్లో ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్‌ను 2జీ నుంచి 5జీకి మార్చేందుకు, ప్లాంటు పెయింటింగ్, మరమ్మతులు, లోగో ఏర్పాటుకు మరో రూ.2 కోట్లకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జనవరిలోపు పూర్తిస్థాయిలో బాగుచేసి ప్రజలకు శుద్ధజలం అందేలా చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్, డీఈ పురుషోత్తం పేర్కొన్నారు.

# వసతిగృహాల్లో ఆరోగ్యం ఎక్కడ?



చిత్తూరు : ఏడాదిన్నర కిందట చిత్తూరులోని ఓ సంక్షేమ వసతిగృహంలో 8వ తరగతి బాలిక తీవ్ర అనారోగ్యానికి గురైంది. వార్డెన్లు ప్రాథమిక చికిత్సతో సరిపెట్టారు. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు ప్రైవేటుగా వైద్యం చేయించినా బాలిక మృతి చెందింది. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారి రక్త నమూనాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశం చింది. ప్రతి విద్యార్థికి డిజిటల్ కార్డు రూపొందించాలని పేర్కొన్నా రక్త నమూనాల సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదు.

వైకాపా హయాంలో సంక్షేమ వసతిగృహాలు అధ్వానంగా మారాయి. ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాల నిర్వహణ లేదు. కూటమి ప్రభుత్వం రాగానే వసతిగృహాలను బాగు చేసే పని ప్రారంభించింది. నిధులు మంజూరు చేయడంతో పాటు కలెక్టర్ల ద్వారా సీఎస్‌ఆర్ నిధులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం, గదుల పెచ్చులు ఊడకుండా బాగు చేయడం, తలుపులు, కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేశారు. ఇటీవల జిల్లాలోని ఏడు వసతిగృహాల్లో రూ.2 లక్షలతో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. మిగిలిన వాటిలో ఏర్పాటు చేయాల్సి ఉంది.

**తీవ్రతను బట్టి పరీక్షలు**

వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం సాధారణ జబ్బులైన జ్వరం, దగ్గు, జలుబు, దంత, చర్మం వంటి వ్యాధులకు ప్రాథమిక చికిత్స అందిస్తున్నామని, తీవ్రతను బట్టి రక్త నమూనాలు సేకరించి తగిన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెబుతున్నారు. డిజిటల్ హెల్త్ కార్డుల ప్రక్రియను ప్రారంభించామని స్పష్టం చేశారు.

**నిత్యం పర్యవేక్షిస్తున్నాం..: విక్రమ్‌కుమార్‌రెడ్డి, సాంఘిక సంక్షేమాధికారి**

వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నాం. వార్డెన్లతో సమీక్షించి పరిస్థితులు తెలుసుకుంటున్నాం. నేరుగా తనిఖీలు చేస్తున్నాం. జిల్లాలో ఏడు వసతిగృహాల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. మిగిలిన వాటిలోనూ ఏర్పాటు చేయిస్తాం.

# ఇంటర్ పరీక్ష తీరు మారింది

కర్నూలు : ఇంటర్మీడియట్ సిలబస్‌తో పాటు పరీక్ష విధానంలో ఎన్‌సీఈఆర్‌టీ కొత్త నిబంధనల మేరకు సవరణలు చేశారు. దీంతో ఇంటర్‌లో విద్యార్థులు ఏ గ్రూప్ చదివినా.. నీట్, జేఈఈ రాసే అవకాశం ఉంటుంది. దీనిపై ఇప్పటికే కళాశాలల ప్రిన్సిపాళ్లు, పాఠ్యాంశ నిపుణులతో సమావేశాలు నిర్వహించారు. ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 23వ తేదీ వరకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించే విధంగా రాష్ట్ర ఇంటర్ బోర్డు పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది.దీనికి అనుగుణంగానే విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు.

**గణితంలో వంద మార్కులు**

గణిత పేపర్ 1990లో 150 మార్కులకు ఉండేది. తర్వాత దీన్ని గణితం-1ఎ, 1బిగా మార్చారు. ఒక్కో పేపర్‌కు 75 మార్కుల చొప్పున రెండు పేపర్ల విధానాన్ని ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. తాజాగా గణితంలో ఒకే పపర్ విధానం



అమలు చేస్తున్నారు. దీన్ని వంద మార్కులకు కుదించడం గమనార్హం.

**జవాబుల పత్రంలో పెరిగిన పేజీలు**

గతంలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు జవాబులు రాసేందుకు 24 పేజీల బుక్‌లెట్‌ను ఇచ్చే వారు. ఈ ఏడాది నుంచి ఈ బుక్‌లెట్‌లో పేజీల సంఖ్యను 32కు పెంచారు. ప్రశ్నల సంఖ్య పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

భౌతిక, రసాయనశాస్త్రాలకు కలిపి 85 మార్కుల ప్రశ్నపత్రం ఇస్తారు. ఇందులో 1, 2, 4, 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. మిగిలిన 15 మార్కులు ప్రాక్టికల్స్‌కు ఉంటాయి. 85కు 29 మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లే.

**సవరణ ఇలా..**

గతంలో ఎంపీసీలో గణిత 1ఎ, 1బి, 2ఎ, 2బి ప్రశ్నపత్రాలు ఉండేవి. వీటిలో ఒక్కో ప్రశ్నపత్రానికి 75 మార్కులు ఉండేవి. ఇలా మొదటి ఏడాది 150, రెండో ఏడాది 150 మార్కులు చొప్పున ఉండేవి. ప్రస్తుతం మొదటి ఏడాదికి వంద, రెండో ఏడాదికి 100 మార్కులకే ప్రశ్నపత్రాలు రూపొందించారు.


బైపీసీలో బోటనీకి 60, జువాలజీకి 60 మార్కులు ఉండేవి. ఇప్పుడు రెండూ కలిపి (బోటనీకి 43 మార్కులు, జువాలజీకి 42 మార్కులు) 85 మార్కులకు పరిమితం చేశారు.

ఫిజిక్స్‌కు 60, కెమిస్ట్రీకి 60 మార్కులకు చొప్పున ప్రశ్నపత్రం ఉండేది. ప్రస్తుతం రెండింటినీ 85 మార్కులకే ఇస్తారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ప్రాక్టికల్స్‌కు 15 మార్కులు చొప్పున కేటాయించారు. గతంలో 2, 4, 8 మార్కుల ప్రశ్నలు ఇచ్చేవారు. ఇప్పుడు 1, 2, 4, 8 మార్కుల ప్రశ్నలు ఇచ్చేలా ప్రశ్నపత్రాలకు రూపకల్పన చేశారు.

# నీటి బొట్టు.. ఒడిసి పట్టు

ఏలూరు: జిల్లాలో భూగర్భ జలాలు, నీటి మట్టాల పెంపే లక్ష్యంగా పొలాల్లో ఇంకుడు గుంతలు, చెక్‌డ్యాంలు నిర్మించాలని భూగర్భ జలవనరులశాఖ ప్రతిపాదించింది. ఈ ఏడాది మేలో భూగర్భ జలాలను కొలవగా జిల్లా సగటు 18.85 మీటర్లు ఉంది. అప్పట్లో నీటి మట్టం పైకి ఉంది. జిల్లాలో నిల్వలు ఎంతెంత ఉన్నాయో తెలుసుకోవటానికి జిల్లా వ్యాప్తంగా ఫీజో మీటర్ల యంత్రాలు నిర్దేశించిన ప్రదేశాల్లో ఏర్పాటు చేశారు. వాటి వద్ద ఎప్పటికప్పుడు అధికారులు నీటి స్థాయిలు కొలిచి జిల్లా సగటు చూస్తారు. గతేడాది నవంబరులో జిల్లా సగటు 17.56 మీటర్లు ఉండగా ఈ ఏడాది నవంబరులో 16.22 శాతం వచ్చింది. గతేడాది నవంబరు, ఈ ఏడాది మే నెలలో సరాసరి జిల్లా సగటుతో పోల్చి చూస్తే భూగర్భజలాలు స్వల్పంగా తగ్గాయనేది స్పష్టమౌతోంది. దీంతో అధికారులు అప్రమత్తమై వాటి పెంపుదలకు సూచనలు చేశారు.

**ప్రతినెలా 70 చోట్ల లెక్కలు**



వర్షాకాలం, శీతాకాలం, వేసవికాలం..ఇలా అన్ని కాలాల్లో భూగర్భజలాలు ఎంత లోతులో ఉన్నాయో కొలుస్తారు. జిల్లా పరిధి అంతా వచ్చేలా 70 బోరుబావుల నుంచి ప్రతి నెలా నీటి లభ్యతను నిర్ధారిస్తారు. వర్షాకాలం నీటి వాడకం తక్కువగా ఉంటుంది. భూమిలోకి ఇంకవు. దీంతో ఆ సీజన్లో కొంతమేర భూగర్భ జలాలు తక్కువగానే ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఎండా కాలంలో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఎక్కువశాతం తోడటంతో నీటి మట్టాలు కిందకు పడిపోతాయి. దాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ భూముల్లో ఇంకుడు గుంతలు, చెక్‌డ్యాంల ఏర్పాటుతో జలాలు వృద్ధి చెందుతాయని అధికారులు తెలిపారు.

**జలాల వృద్ధికి..**

పలు చెరువుల్లో పూడికలు తీయడంతోపాటు 924 బోరుల్లోకి నీళ్లు పంపించి వాటిల్లో జలాలు వృద్ధి చెందటానికి చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. 1619 చెక్ డ్యామ్‌లు, 75 వేల ఇంకుడుగుంతలు నిర్మించాలని ప్రతిపాదించారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ఇసుక నేలలు ఉండటంతో అక్కడ కొంతమేరకు జలాలు తక్కువగా ఉన్నాయి. ద్వారకాతిరుమల మండలంలోనూ ఇదే పరిస్థితి. కొయ్యలగూడెం తదితర మండలాల్లో నీటి లభ్యత బాగానే ఉందని, ఇక్కడ కొండగుట్టలు, అటవీ ప్రాంతం ఉండటమే ఇందుకు కారణంగా నిపుణులు చెబుతున్నారు.

## గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ. 5,459 కోట్లు

దేవరాపల్లి: రాష్ట్రంలో పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 5459 కోట్లు కేటాయించిందని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ బి.బాలూనాయక్ పేర్కొన్నారు. ఈ నిధులతో ఇప్పటికే కొన్ని రోడ్ల పనులు జరుగుతుండగా, మరికొన్ని టెండర్ల దశలో ఉన్నట్లు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అడవితల్లి బాట పథకం (డోలీ హేబిటేషన్ ప్లాన్) ద్వారా చేపట్టిన రోడ్లనిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అక్కడి నుంచి ఆయన దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రహదారుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. పీఎం జన్‌మన్ (అడవితల్లి బాట) ద్వారా 239 ఆవాస ప్రాంతాలకు రూ. 555 కోట్ల వ్యయంతో 206 రోడ్లు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందులో 30 రోడ్లు బీటీ వేస్తామన్నారు. 160 పనులు మార్చి ఆఖరిలోగా పూర్తి చేస్తాం.



మిగతావి ఆగస్టులోగా పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.
పల్లెపండగ–2.0 కింద ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా రూ. 1,122 కోట్ల వ్యయంతో 976 కి.మీ. మేర రోడ్లు అభివృద్ధి చేస్తున్నాం.నాబార్డు నిధులతో 1,203 కిలోమీటర్ల మేర 402 రహదారుల పూర్తికి రూ. 557 కోట్లు వెచ్చిస్తున్నాం. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంటు బ్యాంకు (ఏఐఐబి) ద్వారా రూ. 1,100 కోట్ల వ్యయంతో 963 కి.మీ రోడ్లు (561 పనులు) నిర్మిస్తున్నాం.
ఏపీ రూరల్ రోడ్స్ స్ట్రెంగ్తెనింగ్ ప్రాజెక్టు కింద 4007 కి.మీ. రోడ్డు (1299) పనులు చేపట్టడానికి రూ.2,123 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి టెండర్లు పిలవాల్సి ఉందని, ఈ ప్రక్రియ పూర్తయిన తరవాత పనులు చేపడతామని బాలూనాయక్ స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ ఎస్ఈ కె.శ్రీనివాసరావు తదితరులున్నారు.

## అంత చేసి.. ఇంతేనా తేల్చింది!

పుట్టపర్తి : చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై నవంబరు 5, 6 తేదీల్లో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్‌బాబుతోపాటు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ప్రైవేటు వ్యక్తి తలారి సోమశేఖర్‌పై అనుమానాలు రావడంతో రాత్రంతా విచారణ చేశారు. కొన్ని దస్త్రాలు సైతం పట్టుకెళ్లారు. సోమశేఖర్ ఫోన్‌పే ద్వారా పెద్దఎత్తున లావాదేవీలు జరిగాయని గుర్తించినట్లు ప్రచారం జరిగింది. గంటలపాటు విచారణ చేసినా.. నాడు పట్టుబడిన మొత్తం రూ.4 వేలే. ఆ తర్వాత ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రార్, ప్రైవేట్ వ్యక్తి వ్యవహారంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచన మేరకు కేసు నమోదు చేశారు.

**రెండోసారి.. అంతే**

ఈ ఇద్దరు వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేసేందుకు అనుమతి కోసం కోర్టుకెళ్లి సెర్చ్ వారెంట్లు తీసుకొచ్చారు. ఈ మేరకు మంగళవారం



చిలమత్తూరులో సోమశేఖర్, అనంతపురంలో ప్రసాద్‌బాబు ఇళ్లల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు నిర్వహించినా.. రూ.47 వేలు మాత్రమే దొరికింది. అలాంటప్పుడు ఇంతమంది అధికారులు, సిబ్బంది రెండు దఫాల్లో మూడ్రోజులపాటు సోదాలు చేసినా.. ఏదీ తేల్చలేకపోవడంపై విమర్శలొస్తున్నాయి. మొదటిసారి తనిఖీలు చేసిన తర్వాత రెండోసారి చేయడానికి మధ్య 45 రోజుల సమయం ఉంది. ఇంత సమయం దొరికితే ఎవరైనా.. సర్దుకోకుండా ఉంటారా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మరి సర్దుకోవడానికి ఇంత సమయం లభిస్తే వారు ఊరికే ఉంటారా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. అంత చేసి.. ఇంతేనా తేల్చింది అని ప్రజలు పెదవి విరుస్తున్నారు.
ఈ విషయంపై ఏసీబీ డీఎస్పీ ప్రసాద్‌రెడ్డిని వివరణ కోరగా.. నవంబరులో సర్‌ప్రైజ్ దాడులు చేశామని, నాడు అనుమానం రావడంతో ప్రస్తుతం ఇళ్లల్లో సోదాలు చేసినట్లు తెలిపారు. చట్టపరంగా అనుమతులు తీసుకున్న తర్వాతే సోదాలు నిర్వహించాల్సి రావడంతోనే గడువు వచ్చిందని వివరించారు.

## అసైన్డ్ భూమికి రిజిస్ట్రేషన్

చెన్నేకొత్తపల్లి : సమస్య : స్థిరాస్తి వ్యాపారులు, రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులంతా కలిసి అసైన్డ్ భూమిని రిజిస్ట్రేషన్ చేసి పట్టాగా మార్చారు.
నిదర్శనం: సమాజంలో పలుకుబడి ఉండి, క్షేత్రస్థాయి అధికారులకు అమ్యామ్యాలిస్తే... ఎంత పెద్ద పనైనా ఇట్టే అయిపోతుందనడానికి ఇది ఉదాహరణ ఎక్కడ జరిగింది?: చెన్నేకొత్తపల్లిలో 44వ జాతీయ రహదారి పక్కన సర్వే నంబరు 107–3లో మొత్తం 14.76 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఇందులోని ఏడెకరాల భూమిలో 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు నివాస పట్టాలు ఇచ్చింది. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇదే సర్వే నంబరులోని ముగ్గురు దళితులకు చెందిన 5.80 ఎకరాల భూమిని అధికార పార్టీ (వైకాపా) నేతలు కొనుగోలు చేశారు. తదుపరి దీనిని రెట్టింపు ధరకు స్థిరాస్తి వ్యాపారులకు అమ్మకం చేయగా.. తదుపరి వారు ఎన్ఓసీ తెచ్చుకుని నివాస స్థలాలుగా మార్చి క్రయవిక్రయాలు చేశారు. మరో వ్యక్తికి చెందిన 1.10 ఎకరాల భూమిని షబ్బీర్ కొనుగోలు చేశాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సర్వే నంబరును సబ్ డివిజన్ చేసి రెవెన్యూ దస్త్రాల్లో 107–3(ఏ)గా నమోదు చేసి యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు చేశారు. సబ్ డివిజన్ సమయంలో సమీపంలోని రైతులకు సమాచారం ఇవ్వలేదని చుట్టుపక్కల అన్నదాతలు ఆరోపిస్తున్నారు. ఇలా రిజిస్ట్రేషన్ అయిన భూమిని ఇప్పుడు ఒక్కో సెంటు ధర రూ.4 నుంచి 5 లక్షలకు విక్రయిస్తుండటం గమనార్హం.
చర్యలు తీసుకుంటాం సురేష్‌కుమార్, తహసీల్దార్, చెన్నేకొత్తపల్లి
107–3 సర్వే నంబరు రెవెన్యూ దస్త్రాలు పరిశీలించి.. ఆ స్థలం ఏవిధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారో విచారిస్తాం. సర్వే, రెవెన్యూ దస్త్రాల్లో వివరాల నమోదులో అవకతవకలు జరిగినట్లు తేలితే అధికారులకు తాఖీదులు జారీ చేసి చర్యలకు ఉపక్రమిస్తాం.

# వెల్దుర్తిలో ఉప్పుటేరులు



వెల్దుర్తి: వెల్దుర్తి మండల కేంద్రంలో 'ఉప్పు'టేరులు ప్రవహిస్తున్నాయి.. ఇక్కడి రైల్వే స్టేషన్‌కు నిత్యం భారీగా ఉప్పు ఎగుమతి అవుతోంది.. వ్యాగన్ల నుంచి దించే క్రమంలో కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు.. దీంతో ఉప్పు భూమిలో కలిసిపోయి జలం గరళంగా మారుతోంది. దశాబ్దాలపాటు తాగునీటి అవసరాలు తీర్చిన బోర్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం.. అధికారులు పట్టించుకోకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

**గుక్కెడు నీటికి ఇబ్బందులు**

వెల్దుర్తిలోని రైల్వేస్టేషన్ కాలనీ, జాతీయ రహదారి మార్గంలో 500 కుటుంబాలకుపైగా జీవనం సాగిస్తున్నాయి. రెండు వేలకుపైగా జనాభా ఉంది. ఉప్పు కారణంగా వెల్దుర్తి రైల్వేస్టేషన్ సమీపంలో రెండు కిలోమీటర్ల పరిధిలో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. " కాలనీలోని చేతిపంపు నీటిని గతంలో స్నానాలకు ఉపయోగించే వాళ్లం. ప్రస్తుతం నీరు ఉప్పగా వస్తుండటంతో వాడుకునే పరిస్థితి లేకుండాపోయిందని" మాధవస్వామి వాపోయారు.ప్రతి నెలా 15 వేల టన్నులు
గుజరాత్ నుంచి బోగీల ద్వారా వెల్దుర్తి రైల్వేస్టేషన్‌కు ఉప్పు తీసుకొస్తున్నారు. ఒక్కో ట్రిప్పులో 50 నుంచి 60 వ్యాగన్లలో దాదాపు 3 వేల టన్నుల ఉప్పు స్టేషన్‌కు చేరుతుంది. ఇలా నెలలో 5 సార్లు సరకు వస్తుంటుంది. ప్రతి నెలా 15 వేల టన్నుల ఉప్పును దిగుమతి అవుతుంది. దీనిని రైల్వేస్టేషన్‌లోని రెండో నంబరు ప్లాట్‌ఫామ్‌పై దించుతున్నారు. అనంతరం కర్నూలులోని ఓ పరిశ్రమకు లారీల్లో రవాణా చేస్తున్నారు.

**కనీస జాగ్రత్తలు కరవు**

ప్రతి నెలా 1,000 లారీల ఉప్పును వాహనాల్లో తరలిస్తుంటారు. సరకు దిగుమతి చేసుకునే సమయంలో ముందుగా మందంగా ఉన్న టార్పాలిన్లను ప్లాట్‌ఫామ్‌పై వేయాలి. ప్లాస్టిక్ పట్టలు వేస్తుండటంతో అవి చిరిగిపోతున్నాయి.
సరకు వ్యాగన్ల నుంచి దించుకునే సమయంలో నేలపై పడటం.. సకాలంలో లారీల్లో తరలించకపోవడం.. వర్షాలు పడిన సమయంలో లవణం కరిగి భూమిలో ఇంకుతుండటంతో జలం గరళంగా మారుతోంది.
ప్లాట్‌ఫామ్‌పై ఉప్పును కిందకు తోసేస్తున్నారు. కింద పడిన లవణాన్ని భూమిలో కరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. లారీల్లో లోడింగ్ చేసే సమయంలో పనిచేసే కార్మికులకు శిరస్త్రాణం, మాస్కులు ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు.

**తాగలేకపోతున్నాం : లక్ష్మీదేవి, వెల్దుర్తి**

రైల్వేస్టేషన్ కాలనీలో నివాసం ఉంటున్నాం.. 15 ఏళ్ల కిందట సొంతంగా బోరు వేయించారు. ఇంటి అవసరాలకు నీటిని వినియోగించుకునేవారు. గత రెండేళ్లుగా వెల్దుర్తి రైల్వేస్టేషన్‌లో ఉప్పు రవాణా జరుగుతోంది. ఇంటి బోరు నుంచి నీరు ఉప్పుగా వస్తోంది. నీరు సైతం రంగు మారింది.

# విచారణ తుస్.. చర్యలు తూచ్!



అనకాపల్లి : అధికారం అండతో గత ప్రభుత్వంలో విస్సన్నపేటలో వైకాపా నేతలు సాగించిన స్థిరాస్తి దందాపై విజిలెన్స్ విచారణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచినా.. అక్రమార్కులపై చర్యలు లేవు. అప్పట్లో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఆయన అనుచరుల కనుసన్నల్లో వేసిన లేఅవుట్ వ్యవహారాలు, అక్రమాలను వెలికి తీయాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. గత ప్రభుత్వంలో నేతలు ఆదేశిస్తే చాలు.. పొక్లెయిన్లు తీసుకుకెళ్లి మరీ నిర్మాణాలు నేలమట్టం చేసేవారు. అలాంటిది నేటికీ ఆ భూముల వ్యవహారం ఒక కొలిక్కి రాకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ప్రస్తుతం ఈ భూముల్లో ఉన్న రిసార్టులో వైకాపా నేతలు వారాంతాల్లో పార్టీలు చేసుకుంటున్నారు. ఈ విషయం పోలీసులకు, అధికారులకు తెలిసినా కనీసం కన్నెత్తి చూడటం లేదని స్థానికులు, కూటమి నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
నాటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అతని ప్రధాన అనుచరుడు బొడ్డేడ ప్రసాద్ కనుసన్నల్లో కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలోని విస్సన్నపేటలో భారీ లేఅవుట్ వేశారు. మొత్తం 609 ఎకరాల్లో భారీగా వేశారు. దీనికోసం పది అడుగులున్న గోర్జిని వంద అడుగుల రహదారిగా విస్తరించారు. పక్కనే ఉన్న కొండను తొలిచేశారు. కొండగెడ్డలను కప్పేశారు. అసైన్డ్ భూములను సైతం ఆక్రమించుకున్నారు. దీనిపై అప్పట్లో ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఓ ఆర్డీఓతో విచారణ చేయించారు. సుమారు పదెకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. ఆయనా అప్పట్లో చర్యలు తీసుకోలేదు.
గత ప్రభుత్వంలో ఈ వ్యవహారంపై జనసేన నేత దూలం గోపీనాథ్ లోకాయుక్తను ఆశ్రయించారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విస్సన్నపేట భూములను జనసేన అధినేత సందర్శించి వైకాపా నేతల దోపిడీని దుయ్యబట్టారు.
కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో అక్రమాలు వెలికి తీస్తామని అప్పట్లో గట్టిగా నేతలు చెప్పారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారని అంతా భావించారు. కానీ.. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా చర్యలకు మాత్రం పూనుకోలేదు. అప్పట్లో హడావుడి చేసిన కూటమి పెద్దలు కూడా ప్రస్తుతం మౌనం దాలుస్తున్నారు.
కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తరవాత గత ప్రభుత్వ కాలంలోని భూ వ్యవహారాలపై విజిలెన్స్ విచారణ చేయిస్తోంది. అందులో భాగంగా విస్సన్నపేట లేఅవుట్‌పైనా విచారణ చేస్తున్నారు. మూడు, నాలుగుసార్లు భూములను సైతం అధికారులు పరిశీలించారు. స్థానిక గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. ఏడాదిన్నర గడుస్తున్నా భూ ఆక్రమణదారులకు ఇప్పటికీ ఒక్క నోటీసు కూడా ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. విస్సన్నపేట భూములకు సంబంధించి విజిలెన్స్ విచారణ జరుగుతోంది. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించిన పరిశీలిస్తున్నారు. తుదినివేదిక ఆధారంగా చర్యలు చేపడతామని ఆర్డీఓ ఆయిషా తెలిపారు.

# రాజకీయ వేదికగా బాలల ప్రాంగణం..!

విశాఖపట్నం: సిరిపురంలోని వీఎంఆర్డీఏ బాలల ప్రాంగణం రాజకీయాలకు వేదికగా మారుతోంది. ఇష్టానుసారంగా కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. బాలల సాంస్కృతిక, విద్యా కార్యక్రమాల నిర్వహణ కోసం ఈ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా నిర్మించారు. అయితే గత వైకాపా ప్రభుత్వంలో దీన్ని రాజకీయ కార్యక్రమాలకు ఉపయోగించారు. ఎన్ని విమర్శలొచ్చినా పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ ఆ విధానంలో మార్పు రాలేదు. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లిస్తే ఎవరు బుక్ చేశారు, ఎందుకోసమని పట్టించుకునే వారు కనిపించడం లేదు. తాజాగా సోమవారం వైకాపాలో చేరికల కార్యక్రమానికి ఇక్కడ ఏర్పాట్లు చేయడం, అనంతరం అధికారులు విషయం తెలుసుకుని అనుమతులు రద్దు చేయడం..దీనిపై వైకాపా నాయకులు ధర్నా చేయడం..వంటి కార్యక్రమాలు జరిగాయి.

**అధికారులు ఏం చేస్తున్నారు?:** వైకాపా నాయకులు వ్యూహాత్మకంగా ఆనంద్ అనే వ్యక్తి చేత కొన్ని రోజుల కిందట వీఎంఆర్డీఏ బాలల ప్రాంగణాన్ని బుక్ చేయించారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించారు. వివరాల నమోదులో గెట్ టు గెదర్ అని నమోదు చేశారు. అనంతరం ఏర్పాట్లపై రెండు, మూడు రోజులు వీఎంఆర్డీఏ సిబ్బందిని సంప్రదించారు. ఆ సమయంలోనైనా ఏ కార్యక్రమం నిర్వహిస్తున్నారో గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారు. సోమవారం ఉదయం వైకాపా నాయకుల హడావుడి చూసి కంగారుపడి అనుమతులు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ముందే గుర్తించి ఉంటే వైకాపా నాయకుల వ్యూహాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉండేది.

**అమలుకాని హామీ:** గతంలో ఇక్కడ సినిమాలు, నాటికలు, పిల్లల కార్యక్రమాలు ప్రదర్శించేవారు. కొంతకాలంగా అవేమీ నిర్వహించడం లేదు. పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ హామీ ఇచ్చినా అమలు కాలేదు. దీనిపై కమిషనర్ తేజ్‌భరత్ వివరణ కోరగా వీఎంఆర్డీఏ నిబంధన–10 ప్రకారం బాలల ప్రాంగణంలో రాజకీయ పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయకూడదన్నారు. త్వరలో పిల్లల కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

**గత ప్రభుత్వంలో ఇష్టానుసారం**

గత వైకాపా ప్రభుత్వం బాలల ప్రాంగణాన్ని వైకాపా కార్యక్రమాలకు వేదికగా మార్చేసింది. నేతల సన్మానాలు, ఇతర వేడుకలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ పట్టించుకోలేదు. అప్పట్లో నిర్వహించిన పలు కార్యక్రమాలకు డబ్బులు సైతం చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. బాలల కోసం ఏర్పాటు చేసిన ఈ ప్రాంగణం ఇతర కార్యక్రమాలకు వేదికగా మారడంపై నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వరికోత.. అన్నదాత వ్యథ

ముదిగుబ్బ : అన్నదాత ఎంతో కష్టపడి పండించిన వరి పంటను కోత కోసేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ధరలు ఆకాశాన్నం టడంతో మిగిలేదేమీలేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఖరీఫ్‌లో వరి 9,802 హెక్టార్లలో సాగైంది. ప్రస్తుతం కోతలు సాగుతున్నాయి. ఐదేళ్ల క్రితం ఎకరం పొలంలో వరి సాగు చేయాలంటే రూ.30 వేల నుంచి రూ.40 వేలు పెట్టుబడి ఖర్చు అయ్యేది. కాలక్రమేణా వ్యయం పెరగడంతో రూ.50 వేల నుంచి రూ.60 వేలు పెట్టుబడి పెట్టాల్సివస్తోంది రైతులు వాపోతున్నారు. దిగుబడి మాత్రం ఎకరానికి 25 నుంచి 30 బస్తాలు (50 కిలోల చొప్పున) మాత్రమే వస్తున్నాయి. సాగు ఖర్చులు, నూర్పిడి యంత్రాల ధరలు పెరగడంతో అన్నదాతపై ఆర్థికభారం పడుతోంది.

**వారి చెప్పిందే ధర..**

గ్రామస్థాయిలో ఏజెంట్లంతా సిండికేట్‌గా మారి... వారు చెప్పిందే ధర ఇవ్వాల్సి వస్తోంది. తమిళనాడు, కర్ణాటకకు చెందిన వరికోత నూర్పిడి యంత్రాలు కోతలకు వస్తున్నాయి. పదుల సంఖ్యలో అందుబాటులో ఉన్నాయి. పొరుగు రాష్ట్రాలకు చెందిన వారు కావడంతో స్థానికంగా గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని ధరలను నిర్ణయిస్తున్నారు. తొలి గంటకు రూ.2వేల నుంచి ప్రారంభించి.. రూ.3,700 వరకు వసూలు చేస్తున్నారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



నెమ్మదిగా నడిపేలా... ఎకరంలో వరిపంట కోతకోయాలంటే గతంలో గంట నుంచి గంట25 నిమిషాల్లోపు పూర్తి అయ్యేది. అధునాతన యంత్రాలు అందుబాటులోకి వచ్చినా గంటన్నర నుంచి గంట45 నిమిషాల వరకు తీసుకుంటున్నారు. అందులోనూ చైన్ మిషన్లు వెడల్పు తక్కువగా ఉండటంతో అధిక సమయం పడుతోంది. కొందరు యంత్రాలను నెమ్మదిగా నడుపుతూ ఆలస్యం చేస్తుండటంతో కోత పూర్తయ్యేసరికి రైతుకు ఖర్చులు అధికమవుతున్నాయి. ఏజెంట్లకు మాత్రం గంటకు రూ.200 చొప్పున వసూలు చేసుకుంటున్నారు. ఒకేసారి కోతలు, నూర్పిడి చేస్తుండటంతో అత్యధిక శాతం మంది యంత్రాలవైపే మొగ్గుచూపుతున్నారు. రైతుల అవసరాన్ని ప్రైవేట్ వ్యక్తులు ఆసరాగా చేసుకుని ధరలు ఇష్టారాజ్యంగా పెంచుతున్నారు.

**నియంత్రణకు కృషి చేస్తాం – క్రిష్ణయ్య, ఇన్‌ఛార్జి జేడీఏ**

వరికోత నూర్పిడి యంత్రాల యజమానులు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించి ఇష్టారాజ్యంగా ధరలు పెంచకుండా నియంత్రించేలా కృషి చేస్తాం. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

## పౌష్టికాహార సరఫరాలో మాయాజాలం

అనంతపురం : అంగన్‌వాడీ కేంద్రాలకు ఇచ్చే బియ్యం, కందిపప్పు, వంట నూనె.. తదితర పౌష్టికాహారం సరఫరాలో మాయాజాలం నెలకొంది. కేంద్రాల సిబ్బంది నిర్దేశిత ఇండెంట్ ప్రకారం సరకులు ఇవ్వడం లేదు. ఇదే విషయాన్ని సూపర్‌వైజర్లు, సీడీపీఓలు సైతం జిల్లా అధికారులకు నివేదించినా ఫలితం శూన్యం. ఇది నేరుగా లబ్ధిదారులపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. చాలా చోట్లా సిబ్బందితో లబ్ధిదారులు గొడవకు దిగుతున్నారు. ఇటీవల కలెక్టర్ ఆనంద్ నిర్వహించిన సమీక్షలోనూ కొందరు సీడీపీఓలు ప్రస్తావించారు. పౌర సరఫరాల అధికారులతో మాట్లాడి ఈ తరహా సమస్య పునరావృతం కాకుండా చూస్తామని కలెక్టర్ అన్నారు. అయినా లెక్కల్లో తేడాలు తలెత్తుతున్నాయి.

**లబ్ధిదారులు ఎందరు.. ఏమి ఇస్తారు?**

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు 2302 ఉంటే.. వాటి పరిధిలో లబ్ధిదారులు 1,70,029 మంది ఉండగా.. గర్భిణులు 14,138, బాలింతలు 13,438, 0–6ఏళ్లలోపు పిల్లలు 1,42,453 ఉన్నారు. గర్భిణి/బాలింతలకు ప్రతి నెలా 3కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అరకిలో వంట నూనె ఇళ్లకే ఇవ్వాలి. పౌర సరఫరాల సంస్థ ద్వారా స్థానిక చౌకదుకాణ డీలర్ల ద్వారా కేంద్రాలకు పంపిణీ చేస్తారు. గుడ్లు, పాలు, కిట్లు.. వంటివి గుత్తేదారుల ద్వారా ఇస్తారు. డీలర్ల ద్వారా ఇచ్చే బియ్యం, కందిపప్పు, నూనె సరఫరాలో వ్యత్యాసాలు వస్తున్నాయి.

**సమీక్ష ఏదీ?**

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారానికి సంబంధించి ప్రతి మూడునెలలకోసారి జేసీ అధ్యక్షతన ఐసీడీఎస్ పీడీ, సీడీపీఓ, పౌర సరఫరాల డీఎం, డీఎస్ఓ, గుత్తేదారులతో సమీక్ష జరగాలి. ఇండెంటు, సరఫరా, పంపిణీ.. తదితర అంశాలు ప్రస్తావనకు రావాలి. ఏ నెలోనైనా ఆలస్యంగా సరఫరా జరిగిందా. ఇండెంటు తక్కువ ఇచ్చారా.. అనేదానిపై చర్చ జరగాలి. అసలు సమీక్షలే జరగడం లేదు.

**విచారణ చేయిస్తున్నాం – శివనారాయణ శర్మ, జేసీ**

పౌష్టికాహారానికి సంబంధించి తరచూ ఆరా తీస్తున్నాం. చరవాణి, వీసీల ద్వారా సమీక్షిస్తున్నాం. ఇటీవల పౌర సరఫరాలపై విచారణ చేశాం. కొన్ని కేంద్రాలకు సరిగ్గా ఇవ్వడం లేదు. నిల్వల్లో తేడాలపైనా విచారిస్తున్నాం. బాధ్యులపై తప్పక చర్యలు ఉంటాయి.
మచ్చుకు కొన్ని ఇలా..!
జిల్లాలో మొత్తం 2,302 కేంద్రాలు ఉంటే.. సెప్టెంబరులో 2,220, అక్టోబరులో 2,229, నవంబరులో 2,272 కేంద్రాలకే 3కిలోల బియ్యం ప్యాకెట్లు ఇచ్చారు. కందిపప్పు, నూనె విషయంలోనూ తేడా ఉంటోంది.
సెప్టెంబరులో 26,572 క్వింటాళ్ల బియ్యం కావాలని ఇండెంటు పెడితే 26,08 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు సిబ్బంది స్వీకరణ ఆమోదం ఇచ్చారు. 484 క్వింటాళ్ల లెక్క తేలలేదు. లీటరు ప్యాకెట్ల నూనెలో 11,164 లీటర్లకు 10,843 లీటర్లే కేంద్రాలకు చేరింది.
అక్టోబరులో 23,275 క్వింటాళ్లకు 21,950 క్వింటాళ్లు తీసుకున్నట్లు నమోదైంది. 1325 క్వింటాళ్లు తేలాల్సి ఉంది. కందిపప్పు కూడా 692 కిలోల తేడా ఉంది.
నవంబరులోనూ అదే తీరు. 3కిలోల బియ్యంలో 25,200 క్వింటాళ్లకు 24,579 క్వింటాళ్లే ఇచ్చారు.

# పెద్ద 'ప్లానే'

విశాఖపట్నం: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో కొన్ని భవనాల పార్కింగ్ సెల్లార్లను వ్యాపార సముదాయాలుగా మార్చేశారు. స్టిల్ట్ ఫ్లోర్‌లో అనధికార నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తున్నా అధికారులు తూతూమంత్రంగా స్పందిస్తున్నారు. ఫలితంగా పార్కింగ్‌లో ఉండాల్సిన వాహనాలు రోడ్లపై పెట్టించి ట్రాఫిక్ సమస్యను మరింత క్లిష్టం చేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, జనరేటర్లు పేలడం, వరద నీరు పోటెత్తినప్పుడు సెల్లార్లలో ప్రాణ నష్టం జరిగే అవకాశాలుండటం కలవరపెడుతోంది.

**కన్నెత్తి చూడని ప్రణాళిక అధికారులు :** సెల్లార్లను వాణిజ్య సముదాయాలుగా మార్చినా జీవీఎంసీ 'పట్టణ ప్రణాళిక' గుర్తించనవి చాలా ఉన్నాయి. సెల్లార్లలో బార్‌లు, హోటళ్లు, క్లీనిక్‌లు, వాటర్ సర్వీస్, మొబైల్ సర్వీస్ దుకాణాలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు.

మరికొన్ని చోట్ల స్టిల్ట్ ఏరియాను పూర్తిగా వాణిజ్య సముదాయాలుగా మార్చి ఫైనాన్స్ సంస్థలు, స్టోర్‌లకు ఇస్తున్నారు. భవన నిర్మాణ ప్లాన్ అనుమతులిచ్చాక ఆ నిర్మాణం పూర్తయ్యే వరకు పట్టణ ప్రణాళిక పర్యవేక్షణ ఉండాలి. అయితే ప్లాన్ ఒకలా తీసుకుని వేరేలా వాణిజ్య సముదాయం నిర్మించినా, సెల్లార్లలో గదులు నిర్మించి అద్దెలకిస్తున్నా అడ్డుకోవడం లేదు. కొందరు భవన నిర్మాణదారులు ఇచ్చే కాసులకక్కుర్తితో పలువురు అధికారులు కళ్లుమూసుకుంటున్నారు.



**సమన్వయంతో చేస్తేనే..**

సెల్లార్లలో నిర్వహించే వాణిజ్య సముదాయాల వద్దకు వచ్చే వినియోగదారులు రోడ్లపైనే వాహనాలను నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు నిత్యం తలెత్తుతున్నాయి. ఇలాంటి భవనాల సెల్లార్లను గుర్తించి నోటీసులిచ్చి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పట్టణ ప్రణాళికాధికారులపై ఉంది. జీవీఎంసీ పట్టణ ప్రణాళికాధికారులు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పర్యవేక్షించే పోలీసులు ఈ అంశంపై ఉమ్మడిగా ముందుకు సాగాలి. ముఖ్యమైన కూడళ్లు, రద్దీ ప్రాంతాలలో సెల్లార్ల ఆక్రమణలను తొలగించడానికి నోటీసులు జారీ చేయాలి. అనంతరం వాటిలోని వ్యాపార సముదాయాలను తొలగించి, వాహనాలు పార్కింగ్‌కు అవకాశం ఇవ్వాలని పలువురు సూచిస్తున్నారు.

**హైకోర్టు తీర్పు ఇలా..**

ఈస్ట్‌పాయింట్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో స్టిల్ట్ ఫ్లోర్‌లో అనధికార నిర్మాణాలను కూల్చివేయడానికి జీవీఎంసీ నోటీసులు జారీ చేయగా, వాటిని సవాల్ చేస్తూ సంబంధిత వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో 'పార్కింగ్‌లకు కేటాయించిన స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీల్లేదు. సెల్లార్, స్టిల్ట్ ఫ్లోర్‌లోని అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించడం జరగదు' అని తాజాగా హైకోర్టు ఆదేశాలిచ్చింది.నగరంలో షాపింగ్ మాల్స్, స్టోర్స్, వాణిజ్య సముదాయాలు: 40,000(సుమారు)

రద్దీ ప్రాంతంలో ఉన్నవి:10,000 (సుమారు)

నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లలో వ్యాపారాలు చేస్తున్నవి: 2,752

జీవీఎంసీ ఇచ్చిన నోటీసులు: 90 (సుమారు)

# అందం.. ఆరోగ్యం!

గురుద్వారా : అందమే కాదు... ఆరోగ్యమూ ముఖ్యమే అనే అవగాహన ఇటీవల బాగా పెరిగింది. అందుకే జిమ్‌లలో సాధనకు వెళ్తున్న మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. విశాఖ నగరంలో దాదాపు 250 జిమ్‌లు నిర్వహిస్తున్నారు. వీటిలో మహిళల కోసం ప్రత్యేక సమయాలు కేటాయిస్తున్నారు. కొన్నైతే మహిళలకే ఏర్పాటు చేశారు. దీంతో ఆయా వేళలు అనువుగా ఉన్న వారు సాధనకు వెళుతున్నారు. నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అదనపు సౌకర్యాలు, ప్రత్యేకంగా మహిళా శిక్షకులను అందుబాటులో ఉంచుతున్నారు. ఆరోగ్యంతో పాటు రోజంతా ఉల్లాసంగా ఉండటానికి పలు వ్యాయామాలు తోడ్పడుతున్నాయంటున్నారు.

**'జుంబా డ్యాన్స్'...** సంగీతానికి అనుగుణంగా నృత్యరూపంలో చేసే వ్యాయామం ఇది. మహిళలు సులువుగా సాధన చేసేదిగా ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. ఇందులో చిన్న వయసు నుంచి 50 ఏళ్ల పైబడిన వారూ సాధన చేయొచ్చు. అధిక బరువు సమస్య నుంచి బయటపడటానికి, మంచి శరీరాకృతి కావాలనుకునే వారికి ఈ వ్యాయామం



ఉపయుక్తం.

**ఏరోబిక్స్..** బరువు తగ్గటానికి సత్తువ కోసం ఈ తరహా వ్యాయామాలు చేస్తుంటారు. ఇవి కాస్త కష్టతరమైనప్పటికీ తొందరగా ఫలితాలు కనిపిస్తాయని నగర మహిళలు ఎక్కువగా వీటిపై దృష్టి సారిస్తున్నారు.

సరైన పద్ధతిలో సాధన చేస్తేనే: రోజూ కనీస వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. అరగంట చేసినా అది ఆయుష్షు కాలాన్ని పెంచుతుంది. ప్రస్తుత రోజుల్లో ఆహారపు అలవాట్ల వల్ల, వ్యాయామం చేయకపోవడంతో ఊబకాయ సమస్య వస్తోంది. సరైన పద్ధతిలో వ్యాయామ సాధన చేస్తే మంచి ఫలితాలు ఇస్తుంది.

కిలానీ గణేశ్, జిమ్ ట్రైనర్‌శిక్షకుల పర్యవేక్షణలోనే..: వ్యాయామం చేస్తే అనారోగ్య సమస్యలు తలెత్తవు. శీతాకాల ప్రభావంతో కీళ్లనొప్పులు, గుండె జబ్బులు, మధుమేహం ఉన్న వారికి కాస్త ఇబ్బందికరంగా ఉంటుంది. అదే పనిగా కాకుండా రోజులో అరగంట పాటు సాధన చేస్తే మేలు. ఏదైనా శిక్షకుల పర్యవేక్షణలో చేయడం ఉత్తమం. డాక్టర్ శ్రీనివాస్ శైలేస్, వైద్యుడు

# చంటోళ్ల వణుకు.. వైద్యం కునుకు



కర్నూలు : చలి వణికిస్తోంది.. నవజాత శిశువులు, చిన్నారులు ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నారు.. దగ్గు, జలుబు, ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తున్నారు. నిత్యం వెయ్యి వరకు చిన్నారుల ఓపీ ఉంటోంది. బనగానపల్లి, డోన్, ఆదోని, ఎమ్మిగనూరు వంటి పట్టణాల్లో వంద వరకు ఓపీ నమోదు అవుతోంది. 'ప్రాథమిక' వైద్యం చేసి నంద్యాల, కర్నూలు జిల్లా కేంద్రాల్లోని సర్వజన ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. అక్కడ పడకలు దొరక్క ప్రైవేటుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

**ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు**

నవజాత శిశువులను వార్మర్లు, ఇంక్యుబేటర్ల సేవలు అవసరం. కూర్చోగలిగిన చిన్నారులకు నెబ్యులైజర్లు అందుబాటులో ఉంచాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ఇవి కానరావడం లేదు. కొన్నిచోట్ల ఉన్నప్పటికీ అవసరమైన వైద్యులు, సిబ్బంది లేక నిరుపయోగంగా మారాయి. కొవిడ్‌కు ముందుకు సీహెచ్‌సీలకు విలువైన పరికరాలు అందజేశారు. వీటిని వినియోగించుకోకపోవడం.. చిన్నపాటి మరమ్మతులు చేయకపోవడంతో మూలన పడ్డాయి.

**ప్రైవేటులో భారం**

ప్రైవేటుగా నెబ్యులైజర్లు పెట్టించాలంటే రూ.200 పెట్టి ఓపీ తీసుకోవాలి. తర్వాత నెబ్యులైజరుకు రూ.20-50 వరకు ఖర్చవుతుంది. ఇక ఇంక్యుబేటర్లు, వార్మర్లు సేవలు అందాలంటే రోజుకు సరాసరిన రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు చెల్లించాల్సిందే.

కొవిడ్ సమయంలో ఆస్పత్రుల వద్ద ఎల్‌పీఎం ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వీటిని ఇష్టానుసారంగా ఏర్పాటు చేయడం.. నిపుణులను నియమించకపోవడం, నిర్వహణ కొరవడంతో మూలకు చేరాయి.

**సర్వజనం తరలివస్తోంది**

కర్నూలు సర్వజన వైద్యశాలలోని పీడియాట్రిక్ విభాగంలో ఈ ఏడాది అక్టోబరులో కేసులను పరిశీలిస్తే అప్పుడే పుట్టిన శిశువుల నుంచి నెలలోపు కేసులకు సంబంధించి 280 అడ్మిషన్లు జరిగాయి. ఇందులో 95 కేసులు ఆసుపత్రిలో జరిగిన ప్రసవాలు కాగా.. మరో 185.. బయట నుంచి వచ్చిన కేసులున్నాయి. నవంబరులో 292 న్యూబార్న్ అడ్మిషన్లు జరగ్గా.. అందులో 117 వరకు ఆసుపత్రిలో జరిగిన ప్రసవాలున్నాయి. 175 మంది బయటి నుంచి వచ్చిన కేసులే ఉన్నాయి.

నంద్యాల సర్వజన ఆస్పత్రిలో చిన్నపిల్లల ఓపీ 150 వరకు ఉంటోంది. ఐపీ 80 వరకు ఉంది. మాతాశిశు సంరక్షణ వైద్యశాలలో ఎన్‌సీయూకు సంబంధించి 20 పడకలు ఉండగా.. మరో 10 వరకు అవసరమని వైద్యులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..**

ఆదోని ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో ఆరు నెబ్యులైజర్లు ఉండగా.. మూడు పనిచేయడం లేదు. ఆక్సిజన్ ప్లాంట్ లేకపోవడంతో సిలిండర్ల ద్వారా ప్రాణవాయువు అందిస్తున్నారు.

ఎమ్మిగనూరులో 100 వరకు ఓపీ ఉంటోంది. అవసరమైన వార్మర్లు అందుబాటులో లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

పత్తికొండ: సీహెచ్‌సీలో నిత్యం 80 వరకు ఓపీ ఉంటుంది. ఇంక్యుబేటర్లు ఉన్నప్పటికీ అవసరమైన సిబ్బంది లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

ఆసుపత్రి సంఖ్య

ఏరియా 3

సామాజిక 18 ప్రాథమిక 87

# స్థలాలు ఉక్కువైనా.. అక్రమార్కులకు లోకువే!



గాజువాక: గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో ఉక్కు నిర్వాసితుల కోసం ఇచ్చిన స్థలాలకు రక్షణ కరవైంది. రాత్రికి రాత్రే షెడ్లు వేస్తూ, అనధికార నిర్మాణాలు సాగిస్తూ కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఉక్కు భూసేకరణ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మాయగాళ్లు రంగంలోకి దిగి నకిలీ డాక్యుమెంట్లు, ప్రొసీడింగ్ ఆర్డర్లు తెరముందుకు తెచ్చి కబ్జాపర్వం కొనసాగిస్తున్నారు. దీంతో వీటి రక్షణ భారం మండల రెవెన్యూ అధికారుల మీద పడుతోంది. 1970 దశకంలో గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో 64 గ్రామాలను స్టీల్‌ప్లాంట్ కోసం తరలించి అప్పట్లో 22 వేల ఎకరాల భూములను సేకరించారు. ఆయా గ్రామాలకు అర్బన్ ప్రాంతాల్లో పునరావాసం కల్పించారు. ఈ భూములన్ని స్టీల్‌ప్లాంటు భూసేకరణ, పునరావాస విభాగం పరిధిలో ఉంటాయి. అయితే వీరు దృష్టిపెట్టకపోవడంతో క్రమంగా అన్యాక్రాంతమవుతున్నాయి.

**ఇదిగో ఇలా..**

1. ఇటీవల గాజువాక వికాస్ నగర్ ఐటీఐ రోడ్డు వద్ద సర్వేనెంబర్-153 భూముల్లో తమకు అన్ని హక్కులు ఉన్నాయంటూ రాత్రికి రాత్రే 18 షెడ్ల నిర్మాణాలకు ఆక్రమణదారులు తెగించారు. రెండు రోజుల తర్వాత ఎస్‌డీసీ కార్యాలయ సిబ్బంది ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డులను పాతారు.

2. బీసీ రోడ్డు శివాలయం వద్ద 2.5 ఎకరాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉంటే ఆరేళ్లుగా ఉక్కు అధికారులు పట్టించుకోలేదు. చుట్టూ ఫెన్సింగ్ వేసినా పట్టనట్లున్నారు. ఆ తర్వాత ఇవి ఉక్కు భూములని తేలాక అక్కడ హెచ్చరిక బోర్డులను పాతారు.

**భూములు ఇక్కడ..** కార్యాలయం అక్కడ: ఉక్కు భూసేకరణ విభాగం కార్యాలయం నగరంలో జడ్పీ కార్యాలయ సమీపంలో ఉంది. అక్కడ ఒక స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ), ఆర్‌ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు, దిగువస్థాయి సిబ్బంది ఉన్నారు. ఉక్కు నిర్వాసితకాలనీలు, భూములన్నీ ఇక్కడున్నాయి. అదే అక్రమార్కులకు అనుకూలంగా మారింది. ఆయా మండలాల్లో ఆక్రమణలు, స్థలాల చదును జరిగితే అనేకమంది మండల కార్యాలయాలకు ఫిర్యాదు చేస్తుంటారు. అవి ఉక్కు భూసేకరణ పరిధిలో ఉన్నాయని రెవెన్యూ సిబ్బంది చెబుతూ వాటికి కాపలా కాయాల్సి వస్తోంది. నగర కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసే వీల్లేక మండల కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారు. **కార్యాలయం వచ్చేలా చర్యలు:** 'ఉక్కు భూసేకరణ కార్యాలయాన్ని గాజువాక రప్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటాం. రూ.కోట్లు విలువైన స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉక్కు అధికారులదే. జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి ఆ శాఖ అధికారులు గాజువాకలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం' అని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# నమ్మకమే నడిపిస్తోంది

అచ్యుతాపురం : వైకల్యం కారణంగా కాలు కిందకు పెట్టి అడుగు ముందుకు వేయలేని వ్యక్తి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేశారు. తనలాంటి ఎంతోమంది జీవితాలకు వెలుగురేఖ చూపే బాధ్యతను భుజాలకెత్తుకున్నారు. ఆయన చేసిన ప్రయత్నం ఇప్పుడు ఎన్నో బతుకులను మార్చుతోంది. దివ్యాంగులైన పిల్లలను కుటుంబ పెద్దలా సాకుతున్నారు మోసయ్యపేటకు చెందిన పి.ఎస్.టి.పట్నాయక్. దివ్యాంగుడైన ఆయన ఎక్కడకు వెళ్లాలన్నా చక్రాల కుర్చీలోనే వెళుతుంటారు. అలాంటి ఆయన పాతికేళ్ల క్రితం దివ్యాంగుల కోసం పాఠశాలను ఏర్పాటు చేశారు. కేవలం పది మందితో తాటాకు పాకలో ప్రారంభమైన పాఠశాల నేడు పక్కా భవనాలతో రూపుదిద్దుకుంది. 14 మంది దివ్యాంగ బోధకులతో విద్యాబుద్ధులను నేర్పిస్తున్నారు. ఇప్పటికే 15 బ్యాచ్‌లను పదో తరగతి పరీక్షలకు పంపించారు. ఇటీవలే డీఎస్సీ ఫలితాల్లో ఇదే పాఠశాలలో చదివిన ఒకరు ఉద్యోగం సాధించారు.

**దాతలే ఆదరవు!:** పట్నాయక్ ఈ పాఠశాలను దాతల సహాయంతో నడుపుతున్నారు. దివ్యాంగుల విద్యార్థులను ఉన్నత వర్గాలకు చెందిన వారికి దత్తత ఇచ్చి వారు అందించే సహాయంతో విద్య, వసతి, భోజనం అందిస్తున్నారు. పలువురు పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి శుభకార్యాలు ఇక్కడే ఏర్పాటు చేసుకొని దివ్యాంగులతో కలిసి ఆనందంగా గడుపుతున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, వైజాక్‌ఫోపైల్, ఎన్టీపీసీ, కృష్ణా ప్యాన్స్, రోటరీక్లబ్, విశాఖడెయిరీ, ఎంపీ నిధులు, మహిళా సమితి సహాయంతో పాఠశాలను నిర్వహిస్తున్నారు. పట్నాయక్ సేవలను గుర్తించి ప్రభుత్వం ఇప్పటికే సత్కరించింది.

**పొందిన అవార్డులు...**

2006లో జాతీయస్థాయిలో ఉత్తమ సేవకునిగా అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాం అవార్డు

2016లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా సేవా పురస్కారం.

దివ్యాంగుల సమస్యలపై అధ్యయన కమిటీలో సభ్యత్వం

ఆత్మవిశ్వాసం నింపడమే లక్ష్యం: తాము ఎందుకు పనికిరామనే అభిప్రాయాన్ని దూరం చేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే లక్ష్యం. ఈ దిశగానే ప్రతిరోజు ఆలోచన చేస్తుంటాను. ప్రభుత్వానికి అందించే నివేదికలో ఈ విషయాలనే ఉంచాలనుకుంటున్నాను. దివ్యాంగులపై జాలిచూపి సహాయం అందించి వదిలివేయకూడదు. ఆర్థికంగా నిలబడేవిధంగా వారిని తయారుచేయడానికి నిర్మాణాత్మకమైన చర్యలు అవసరం. మా పాఠశాలలో 200 మంది వరకు వసతి ఉండేవిధంగా ఏర్పాట్లు ఉన్నాయి. రక్షణగోడ లేక కొంత ఇబ్బంది పడుతున్నాం. బాలురుకు డార్మెటరీ లేదు. పీఎస్‌టీ పట్నాయక్, పాఠశాల నిర్వాహకుడు

# తప్పించుకోవద్దు.. తప్పకుండా రండి!

పాయకరావుపేట : ప్రతి పేదింటి కుసుమం జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవడానికి విద్యే ప్రధాన ఆయుధం. ఇటువంటి ఆయుధాన్ని కొందరు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరానికి చేరుకుంటుంటే.. మరికొందరు అవగాహన లేక, తల్లిదండ్రులు పట్టించుకోక పాఠశాల స్థాయిలోనే చదువులకు టాటా చెబుతుంటారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివే పిల్లలపై తల్లిదండ్రులు ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నారు. నిరంతరం పాఠశాలను సందర్శించడంతోపాటు వారి ప్రవర్త, విద్యపై ఉపాధ్యాయులతో చర్చిస్తూ మంచి ఫలితాలు పొందుతున్నారు. ఇటువంటి ప్రయత్నం ప్రభుత్వం పాఠశాలల్లోనూ జరగాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఒక వేదికపైకి తెచ్చి విద్యార్థి పురోభివృద్ధికి పాటుపడానికి మెగా పేరెంట్స్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించనుంది. పిల్లల ఎదుగుదలను రూపొందించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే కీలకపాత్రని భావించి పండగ వాతావరణంలో ఈనెల 5న నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది. వీటిపై విద్యాశాఖాధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి.

**ఈ సవాళ్లు అధిగమించాలి:** ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభంలో జులై 10న మెగా పీటీఎం ఏర్పాటు చేసి ఈ కార్యక్రమ లక్ష్యాలు, ఉద్దేశ్యాలను తల్లిదండ్రులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఉన్నతాధికారులు వివరించారు. ఈ సమావేశానికి భారీగా హాజరైన తల్లిదండ్రులు తరువాత మాత్రం పాఠశాల ముఖాన్ని చూడలేదు.

**సమావేశం ఉద్దేశాలివీ...**

పిల్లలు తరగతి గదిలో ఎలా రాణిస్తున్నారు, సహ విద్యార్థులతో ఏవిధంగా ప్రవర్తిస్తున్నారు? ఇంటి వద్ద ఏ విషయాల్లో శ్రద్ధ తీసుకోవాలని వంటి అంశాల్లో పిల్లల పురోగతిపై ఉపాధ్యాయులతో చర్చించడానికి ఇది ప్రధాన వేదిక.

పిల్లల అలవాట్లు, సవాళ్లు, నైపుణ్యాల గురించి ఉపాధ్యాయులతో చర్చించడానికి అవకాశం ఉంటుంది.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందివ్వడానికి ఉపాధ్యాయులతో కలిసి తల్లిదండ్రులు అడుగులు వేయడానికి ఇది మూలస్తంభంగా పనిచేస్తుంది. తల్లిదండ్రుల సహకారంతో పాఠశాల వాతావరణ మార్చడానికి ఉపాధ్యాయులకు అవకాశం ఉంటుంది. చెడు అలవాట్లు, పాఠశాలలకు తరచూ గైర్హాజరు అయ్యేవారు, క్రమశిక్షణ కొరవడిన విద్యార్థుల ప్రవర్తను తల్లిదండ్రులకు వివరించడంతోపాటు వారిని సరైన రీతిలో నడిపించడానికి ఉపాధ్యాయులకు వీలు కలుగుతుంది.

ప్రతినెల జరగాల్సిన సమావేశాలకు పాఠశాల కమిటీ ఛైర్మన్, ఒకరిద్దరు డైరెక్టర్లు తప్ప తల్లిదండ్రుల భాగస్వామ్యం తక్కువగానే ఉంది. కొందరు ఉపాధ్యాయులు సైతం దీనిని అంతగా పట్టించుకోకుండా కాగితాల్లో సమావేశాలను చూపించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో సింహభాగం పేద కుటుంబానికి చెందినవారే కావడంతో రోజు కూలీకి వెళ్తే తప్ప కడుపునిండని పరిస్థితులు వల్ల వారు ఈ సమావేశాలకు రావడంలేదు.

**అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం:** పీటీఎం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేశాం. పండగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాం.

జి.అప్పారావునాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు: 1,831

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు: 22

విద్యార్థుల సంఖ్య: సుమారు రూ.2.50 లక్షలు

# జంక్షన్.. టెన్షన్..

ఎలమంచిలి : చంటిబిడ్డతో దీనంగా దిగువ చిత్రంలో కనిపిస్తున్న యువతి పేరు ఆవాల శివ. ఉద్దండపురం గ్రామం. ఈమె భర్త దుర్గారావు ఏడాది క్రితం ఉద్దండపురం కూడలిలో కారు ఢీకొని మృత్యువాత పడ్డాడు. అప్పటికే వీరికి మూడేళ్ల కొడుకు ఉండగా, మరో బిడ్డ పుట్టి 14 రోజులైంది. భర్త తాపీపనిచేస్తూ తెచ్చే సంపాదనతో కుటుంబం హాయిగా గడిచిపోయేది. ప్రస్తుతం పుట్టింటివారు, అత్తింటివారే శివను చూస్తున్నారు. భర్తలేని తనకు భవిష్యత్తు కానరాక బిడ్డలతో కలిసి గుండెలనిండా బాధతో రోజులు వెళ్లదీస్తోంది.

జాతీయ రహదారిపై కూడళ్లలో జరిగిన ప్రమాదాలతో అనేకమంది జీవితాలు రోడ్డున పడ్డాయి. వాహనాల అతివేగం, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల అవగాహన రాహిత్యం, కూడళ్లలో లైటింగ్ లేకపోవడం, బ్లింకర్లు పెట్టకపోవడం తదితర రక్షణ చర్యలు కొరవడటం ఇలా అనేక లోపాలు ప్రమాదాలకు హేతువులుగా మారుతున్నాయి. అయినా ప్రమాదాల నియంత్రణకు తీసుకున్న చర్యలు అంతంతమాత్రమే.

భర్త ఫొటోతో ఉన్న ఈ మహిళ పేరు పెంకె రాణి. భర్త వీరన్న వ్యవసాయ కూలీ. అయిదేళ్ల క్రితం పనికి వెళ్తొస్తుండగా ఉద్దండపురం కూడలిలో రోడ్డు దాటుతూ.. కారు ఢీకొనడంతో గాయపడి మరణించాడు. రాణికి తొమ్మిదేళ్ల లోపున్న బాబు, పాప ఉన్నారు. ప్రస్తుతం పుట్టింటిలో ఉంటూ కూలికి వెళుతూ పిల్లలతో జీవనం సాగిస్తోంది. బీమా ద్వారా వచ్చిన సొమ్ములు వైద్యం చేయించిన అప్పులకు సరిపోయాయి.

**గతంలోనే బ్లాక్‌స్పాట్ల గుర్తింపు**



గౌతమి శాలి అనకాపల్లి ఎస్పీగా ఉన్నప్పుడు జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. అక్కడే ఎందుకు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నదీ రవాణా శాఖ అధికారులతో కలసి స్వయంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సాంకేతిక లోపాలు గుర్తించి వీటిని సవరించాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులకు సూచించారు. కానీ ఒక్క సాంకేతిక లోపాన్నీ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సరిచేయలేదు.

23 కూడళ్లలో : జాతీయ రహదారిపై అటు లంకెలపాలెం మొదలు... ఇటు పాయకరావు పేట వరకు 23 కూడళ్లలో తరచూ మృత్యుఘోష వినిపిస్తూనే ఉంది.

**భద్రతా చర్యలు చేపడతాం..** జిల్లాలో జాతీయ రహదారి చాలాచోట్ల గ్రామాల మధ్యనుంచి వెళ్లింది. ఇలాంటి చోట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జనాభా, వాహనాలు పెరుగుతున్న విషయాన్ని గుర్తించి, ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి. ఎస్పీ ఆదేశాలతో ఇలాంటి చోట్ల లైటింగ్, బ్లింకర్లు అవసరాన్ని గుర్తించి వీటిని ఏర్పాటు చేయడానికి నివేదిస్తున్నాం. దీంతో పాటు కూడళ్లలో జరిగిన ప్రమాదాలు, మృతుల వివరాలతో హెచ్చరిక బోర్డులు పెట్టిస్తాం. వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు పెంచుతున్నాం. తద్వారా భద్రతా చర్యలు చేపడతాం.పి.శ్రీనివాసరావు, డీఎస్పీ, నర్సీపట్నం

చురకలు



# ‘ఉత్తి’పోతలు..!

రాజమహేంద్రవరం: కొవ్వూరులోని కుమారదేవం ఎత్తిపోతల పథకం దుస్థితి ఇది. నాలుగు మోటార్లలో రెండే పని చేస్తున్నాయి. 4600 ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో నిర్మించారు. ప్రస్తుతం 1900 ఎకరాలకే నీటిని అందిస్తోంది. నీటి వనరులు అందుబాటులో లేక.. ఎద్దడి ఎదుర్కొంటున్న పంట పొలాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. గత వైకాపా పాలనలో కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో అవి మూలకు చేరే పరిస్థితికొచ్చాయి. ఉమ్మడి జిల్లాలో 29 పథకాలుంటే, అయిదు మాత్రమే పూర్తిస్థాయిలో సేవలందిస్తుండగా, రెండు శిథిలావస్థకు ఉన్నాయి. కొన్ని అంతమాత్రంగానే పని చేస్తున్నాయి. వీటి మరమ్మతులు, నిర్వహణకు నిధులు మంజూరుచేస్తే వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి ఆయకట్టుకు సాగు నీరందే అవకాశం ఉంది.

**నిర్వహణకు నోచుకోక...**

మోటార్ల పంపులు మరమ్మతుకు గురైతే సరి చేసే పరిస్థితి లేదు. అనేక చోట్ల పైపులైన్‌లకు లీకులున్నా కట్టడిలేదు. దీంతో శివారు



ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత లెక్కల ప్రకారం వీటిపై ఆధారపడి సుమారు 47 వేల ఎకరాలుంటే 30 నుంచి 50 శాతం ఆయకట్టుకే నీరందుతోందని ప్రాథమిక అంచనా. అనపర్తిలో కాపవరం పథకం ఆధారంగా 690 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ పథకానికి ఉన్న రెండు మోటార్లు మరమ్మతుకు గురయ్యాయి. పైపులైన్ల లీకుల సమస్య వెంటాడుతోంది.

ఆత్రేయపురం మండలంలోని వసంతవాడ పథకానికి మూడు మోటార్లు ప్రస్తుతం పని చేస్తున్నా నిర్వహణకు నిధులు అవసరం. పైపులైన్ల లీకేజీలున్నాయి. దీంతో నీరంతా వృథా అవుతోంది.

**రూ.91.32 కోట్లతో ప్రతిపాదనలు..**

దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఎత్తిపోతల పథకాల మోటార్లు, పంపుల మరమ్మతులు, పైపులైన్ల పనులకు రూ.91.32 కోట్లు అవసరమని జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

# ప్రకృతిలో ఆరోగ్య పాఠాలు!

అనంతపురం: ప్రస్తుతం దేహ దారుఢ్యం, ఆరోగ్యంపై అన్ని వయసుల వాళ్లు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. యోగాతోపాటు వ్యాయామశాలల్లో చేరి కసరత్తులు చేస్తున్నారు. ఆసనాలతోపాటు బరువులెత్తడం, ట్రెడ్‌మిల్‌పై పరుగు, సిక్స్‌ప్యాక్ కోసం కసరత్తు చేస్తూ శరీర దృఢత్వాన్ని పెంచుకుంటున్నారు. జిమ్‌లో చేసే ఈ ప్రక్రియలు యాంత్రికంగా మారిపోయాయనే భావన యువతలో మొదలైంది. ఈనేపథ్యంలో ప్రకృతిని ఆస్వాదిస్తూనే ఫిట్‌నెస్ పొందవచ్చని చెబుతున్నారు నగరానికి చెందిన తాజమ్ముల్.. అతని మిత్ర బృందం. ‘ట్రెక్కర్స్ ఆఫ్ అనంతపురం’ పేరుతో వారు నిర్వహిస్తున్న ఆరోగ్య పాఠాలు ఆసక్తిగా మారాయి.



**బరువును బట్టి..**

శరీర బరువునే ఆసరాగా చేసుకుని వ్యాయామం చేస్తూ ఫిట్‌నెస్ పొందే ప్రక్రియను కలిస్తానిక్ అంటారు. ఈ విధానంలో డిప్‌బార్‌లు, పుల్-అప్ బార్‌లు, స్ట్రెచింగ్ తదితరాలు ఉంటాయి. నిర్వాహకులు వ్యాయామంతోపాటు వారాంతాల్లో సమీపంలోని కొండల్లో ట్రెక్కింగ్ చేపడుతున్నారు. నడవడం, వాగులు, వంకలు దాటడం, ఒక రాయి నుంచి ఇంకో రాయికి దూకడం తదితర ప్రక్రియలతో శరీరంలోని కొవ్వు సహజసిద్ధంగా కరిగిపోతుందని చెబుతున్నారు.

**ప్రతి వారాంతంలో..**

తాజమ్ముల్, దినేష్, వసీం, సిద్ధార్థ్ మిత్ర బృందం అనంత చుట్టుపక్కల కొండల్లో ప్రతి ఆదివారం ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 20 మంది సభ్యులు ఉన్నారు. ఆసక్తి ఉన్నవారిని ట్రెక్కింగ్‌లో పాల్గొనేలా చేస్తున్నారు. ట్రెక్కింగ్‌లో జాగ్రత్తలు, నియమాలపై ముందుగా వివరిస్తారు. అనుమతి పత్రంపై సంతకం తీసుకున్న తర్వాతే తీసుకెళుతున్నారు. బయట నుంచి వచ్చేవారి కోసం మెడికల్ కిట్ అందిస్తున్నారు. గంపమల్లయ్యకొండ, దేవరకొండ, గోనిమడుగుల ఆలయం, గుత్తి కోట వంటి ప్రాంతాల్లో ట్రెక్కింగ్ చేపట్టారు. ఇప్పటివరకు 30 ప్రాంతాల్లో నిర్వహించారు.

# నీళ్లు రావు.. వెతలు తీరవు



అమలాపురం : నీటి వనరులు అందుబాటులో లేక ఎద్దడి ఎదుర్కొంటున్న పంట పొలాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన ఎత్తిపోతల పథకాలు అలక్ష్యానికి గురవుతున్నాయి. గత వైకాపా పాలనలో కనీస మరమ్మతులకు నోచుకోలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 29 పథకాలుంటే, అయిదు మాత్రమే సేవలందిస్తుండగా, రెండు శిథిలావస్థకు చేరాయి. మరమ్మతులు, నిర్వహణకు నిధులు మంజూరుచేస్తే వచ్చే ఖరీఫ్ నాటికైనా పూర్తి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిర్వహణకు నోచుకోక..:మోటార్ల పంపులు మరమ్మతుకు గురైతే సరి చేసే పరిస్థితి లేదు. పైపులైన్ల లీకులున్నా కట్టడిలేదు. అన్ని పథకాలపై ఆధారపడి 47 వేల ఎకరాలుంటే 30 నుంచి 50 శాతం ఆయకట్టుకే నీరందుతోంది.మోటార్లు, పంపుల మరమ్మతులు, పైపులైన్ల పనులకు రూ.91.32 కోట్లు అవసరమని జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

**దాళ్వాకు సాగునీరందేనా..:** ఆత్రేయపురం మండలం పేరవరం ఎత్తిపోతల పథకం ఏకధాటిగా 24 గంటలు పనిచేస్తే ఏదో ఒక మరమ్మతులకు గురవుతుంది. మోటార్లు, పంపులు దెబ్బతింటున్నాయి. మరమ్మతులు చేయించేలోగా సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పథకం ద్వారా పేరవరం, రాజవరం, వెలిచేరు, వద్దిపర్రు, పులిదిండి ఆయకట్టు 3 వేల ఎకరాలు ఆధారపడి ఉంది.

వసంతవాడ పథకం భూగర్భ పైపులైను దెబ్బతింది. లీకులతో సాగునీరు వృథా అవుతోంది. దీనికింద వసంతవాడ, తాడిపూడి, కట్టుంగ, నార్కెడుమిల్లి, అంకంపాలెం వరకు 3వేల పైబడి ఎకరాలకు సాగునీరు అందుతోంది.ఉచ్చిలి ఎత్తిపోతల పథకం పాడై ఏడేళ్లయింది. మోటార్లు, పంపులు, భవనం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆయకట్టులోని పంట కాలువలు ఆక్రమణలకు గురై కుంచించుకుపోయి ఉన్నాయి.

# బుల్లెట్ రైలు మార్గం



కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా బుల్లెట్ రైలు వెళ్లేందుకు ‘మార్గం’ సుగమం అవుతోంది. దేశవ్యాప్తంగా కొన్ని మార్గాల్లో బుల్లెట్ ట్రైన్లు నడపాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా హైదరాబాద్- బెంగళూరు మార్గాన్ని ఎంపిక చేశారు.. అందుకు అనువైన ట్రాక్ నిర్మాణానికి మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. అదేవిధంగా గుంటూరు-గుంతకల్లు, ముద్కేడ్-డోన్ డబ్లింగ్ పనులు వేగవంతమయ్యాయి. అమృత్ భారత్ కింద స్టేషన్ల ఆధునికీకరిస్తున్నారు.

**1.20 గంటలో బెంగళూరుకు**

కర్నూలు-బెంగళూరు మధ్య దూరం 427 కి.మీ. మేర ఉంది. ప్రస్తుతం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో 5.30 గంటలు పడుతోంది. దీని గరిష్ఠ వేగం 180 కి.మీ.లు అయినప్పటికీ 130 కి.మీ. వేగంతోనే నడుపుతున్నారు.

బుల్లెట్ రైలు అందుబాటులోకొస్తే కర్నూలు నుంచి బెంగళూరు కంటోన్మెంట్ స్టేషన్‌కు 1.20 గంటలో చేరుకోవచ్చు. దీని గరిష్ఠ వేగం గంటకు 350 కి.మీ.. భద్రత కారణాల నేపథ్యంలో 320 కి.మీ. వేగంతోనే నడుపుతారు. ఈ వేగం తట్టుకునేలా అనువైన ట్రాక్ నిర్మించాల్సి ఉంటుంది.

**డబ్లింగ్.. వేగవంతం**

గుంటూరు- గుంతకల్లు రైలు మార్గంలో డబ్లింగ్ పనులు తుది దశకు చేరుకొన్నాయి. రూ.3,631 కోట్లు వెచ్చించి 401.47 కి.మీ. మార్గాన్ని బాగు చేస్తున్నారు. 57.738 కి.మీ. మేర పనులు చేయాల్సి ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇవి పూర్తైతే నంద్యాల నుంచి గుంటూరు, విజయవాడ, గుంతకల్లు వైపు పలు నూతన సర్వీసులు నడిపేందుకు అవకాశం ఉంటుంది.

ఉత్తర-దక్షిణ భారతదేశ ప్రాంతాలను కలిపే ఉద్దేశంతో ముద్కేడ్-డోన్ రైల్వే లైన్‌కు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మహారాష్ట్రలోని ముద్కేడ్ నుంచి ఏపీలోని డోన్ వరకు 417.88 కి.మీ. మేర రూ.4,686.09 కోట్లతో డబ్లింగ్ పనులు చేపడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న మహబూబ్‌నగర్- డోన్ మధ్య 197 కి.మీ. మేర పనులు 2029 నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. పూర్తైతే హైదరాబాద్ నుంచి బెంగళూరు, తిరుపతి, చెన్నై వైపు ఎక్కువ రైళ్లను నడిపే అవకాశముంటుంది.

# సహకార సంఘాలు.. దోచేశారు



తిరుపతి : ఐదేళ్ల జగన్ పాలనలో సహకార సంఘాలు భ్రష్టుపట్టాయి. రైతులకు అండగా నిలవాల్సిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సింగిల్‌విండో), జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) వైకాపా నాయకులకు దాసోహమయ్యాయి. ఎక్కడ చూసినా నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అర్హతాలేని వ్యక్తులకు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఒక్కమాటలో చెప్పాలంటే సహకార సంఘాలను నిర్వీర్యం చేశారు. గృహనిర్మాణం, ఇతర రుణ విభాగాల్లో రూ.12 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు తేలింది.

2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, మదనపల్లె నియోజకవర్గాల్లో నిబంధనలకు విరుద్ధంగా రూ.20 కోట్ల మేర రుణాలు మంజూరు చేశారు. భూములు తాకట్టు పెట్టి అంతా సక్రమంగా ఉందని నిర్ధారించుకున్న తర్వాతే అప్పు ఇవ్వాల్సి ఉండగా ఇవేవీ లేకుండానే డబ్బులు ఖాతాల్లో జమచేశారు. లబ్ధి పొందిన వారిలో 90 శాతం మంది వైకాపా నాయకులే కావడం గమనార్హం.

**అధికారులూ కుమ్మక్కు**

వైకాపా హయాంలో 76 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేశారు. పాలకవర్గాలతో అప్పటి అధికారులూ కుమ్మక్కయ్యారు. దాంతో అటు సభ్యులైన ఫ్యాను పార్టీ నాయకులు, అధికారులు, ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అందరూ ఎడాపెడా రుణాలు తీసుకున్నారు. ఈ మొత్తాలను తిరిగి డీసీసీబీకి చెల్లించలేదు. చాలాచోట్లా ఇదే పరిస్థితి. వసూలు చేయాల్సిన అధికారులు తమ పని కాదన్నట్టుగా వ్యవహరించారు.

**సభాసంఘం సిఫార్సులే తరువాయి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీఆర్వో మోహన్‌కుమార్ అక్రమాలపై విచారణ జరిపారు. ఈ క్రమంలోనే 11 మంది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ అక్రమాలపై రాష్ట్రస్థాయిలో ప్రత్యేక సభాసంఘాన్ని నియమించారు. ఛైర్మన్‌గా జిల్లాకే చెందిన పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలోని కమిటీ అక్రమాలపై ఎలాంటి చర్యలకు సిఫార్సు చేస్తుందన్నది చూడాలి.

పక్కదారి పట్టిన నిధులు
బైరెడ్డిపల్లె రూ.2 కోట్లు
పలమనేరు రూ.80 లక్షలు
శ్రీకాళహస్తి రూ.60 లక్షలు
సత్యవేడు రూ.60 లక్షలు

# పంట తెగుళ్ల భరతం పట్టారు!

అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లా అత్యంత కరవు నేల. ఇక్కడ ఏ పంట వేసినా వాతావరణం అనుకూలించకపోవడం, అన్నీ బాగున్నా వివిధ రకాల తెగుళ్ల బెడదతో పంట నాశనమవడం చూస్తూనే ఉన్నాం. తెగుళ్ల భరతం పట్టేందుకు అనంతపురంలోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలోని జీవ నియంత్రణ ప్రయోగశాల నడుం బిగించింది. ఎన్నో ప్రయోగాలు చేపట్టి ట్రైకోడెర్మా విరిడి, సుడోమోనాస్‌ను తయారు చేసింది. వీటిని ఉమ్మడి జిల్లా పరిస్థితితులను దృష్టిలో పెట్టుకొని చేయడం విశేషం. వేరుకుళ్లు, కాండం కుళ్లు, మాగుడు ఎండు తెగుళ్ల నివారణ, బ్యాక్టీరియా జాతికి చెందిన జీవన క్రిమినాశిగా పని చేస్తున్నాయి. విత్తన శుద్ధిలోనూ కీలకపాత్ర పోషిస్తున్నాయి. చెట్టు కాండానికి రక్షణ కవచంలా ఉంటూ అధిక దిగుబడులకు ఊతమిస్తాయి. ఆయా మందులను వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న పథకాలకు 50 శాతం రాయితీ,



రైతులకు పూర్తి ధరతో విక్రయిస్తున్నామని జీవ నియంత్రణ ప్రయోగశాల బాధ్యుడు సుంకరకు తెలిపారు.

# ఎప్పుడిస్తారో ఉపాధి వేతనాలు?

చిత్తూరు : ఉపాధి హామీ వేతనదారులు కూలి డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. ఆగస్టు 15 నుంచి చెల్లింపులు నిలిచిపోయాయి. జిల్లాలో వేతనాలు, మెటీరియల్ నిధి బకాయిలు రూ.70 కోట్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

**కూలీల సొమ్ము రూ.35 కోట్లు**

రోజుకు సగటున 35 నుంచి 50 వేల మంది వరకు జిల్లాలో ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఆగస్టు నుంచి 12 లక్షల పనిదినాలు నమోదవగా రూ.35 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి.

**భారీగానే మెటీరియల్ బకాయిలు..**



వేతన సొమ్ములో 40 శాతం కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కింద వస్తుసామగ్రి నిధులు విడుదల చేస్తుంది. వీటితో సీసీరోడ్లు, మురుగు కాలువలతో పాటు అభివృద్ధి పనులు చేస్తున్నారు. మినీ గోకులం షెడ్లు నిర్మించారు. వీటికి సంబంధించిన బకాయిలు మరో రూ.35 కోట్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నిధులు కేంద్రం విడుదల చేయాల్సి ఉందని డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు.

**జిల్లాలో వివరాలు..**

జాబ్‌కార్డులు: 2,67,000
వేతనదారులు: 4,79,000 మంది
హాజరు: 2 నుంచి 3 లక్షలు
సగటున పనికి వచ్చేవారు: 35 వేలు

# చలికి వణుకుతోంది‘రొయ్య’

కోట: రొయ్య రైతులు వరుసగా నష్టపోతున్నారు. ప్రస్తుతం దిత్వా తుపాను ధాటికి నాలుగురోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో ఉష్ణోగ్రతలు 18 డిగ్రీల కంటే పడిపోయాయి. ఈ నేపథ్యంలోనే రొయ్య చలితో గజగజలాడుతోంది. మేత తినకుండా స్తబ్ధుగా ఉంటోంది. వైరస్ బారిన పడుతూ చివరికి మృత్యువాత పడుతోంది. దీంతో కొందరు రైతులు తక్కువ కౌంట్‌తోనే వాటిని పట్టి విక్రయిస్తున్నారు. పెట్టుబడులు రాకపోగా ఎకరాకు రూ.2 లక్షల వరకు నష్టపోతున్నట్లు అన్నదాతలు వాపోతున్నారు.

**మత్స్యశాఖ ఎఫ్‌డీవో రెడ్యానాయక్ సూచనలు**

చెరువులో కనీసం 5 అడుగుల మేర నీరు విధంగా ఉండేలా చూసుకోవాలి. పక్క చెరువు నుంచి వైరస్ వ్యాపించకుండా బయో



సెక్యూరిటీ విధానాలు పాటించాలి.

రోజులో ఉష్ణోగ్రత అధిక ఉన్న సమయంలో మేత ఎక్కువగా వేయాలి.

రోగనిరోధకశక్తిని పెంచే సీ విటమిన్, పొటాషియం, మెగ్నీషియం ఖనిజాలు తగు మోతాదులో అందించాలి.

తగినన్ని ఏరియేటర్లు అమర్చి ఆక్సిజన్ సక్రమంగా అందేటట్లు చూస్తే నాణ్యత కలిగిన రొయ్య పెరుగుతుంది.

సాగు విస్తీర్ణం : 9,000 ఎకరాలు

60 రోజులకు 10  12 గ్రాములు ఉండాల్సి ఉండాలి. ప్రస్తుతం అందులో సగం కూడా లేన్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఇక్కడ.. సాగరంతో జాగ్రత్త..!

పెదవాల్తేరు: సహజ సిద్ధమైన విశాఖ తీరం ఎంతో అందమైనదిగా గుర్తింపు పొందింది. దేశవిదేశాల నుంచి నిత్యం పర్యాటకులు తీర అందాలు చూడటానికి వస్తుంటారు. అలల మాటున ప్రమాదం దాగి ఉందనే విషయం చాలా మంది గుర్తించడం లేదు. సరదాగా ఈత కొట్టడానికి వెళ్లి రాకాసి కెరటాల్లో చిక్కుకుపోయి మృత్యువాత పడుతున్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి నగర పోలీసు కమిషనర్ ప్రమాదకర తీర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పోలీసు యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది.

**ఇదిగో ఇక్కడ:** మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు తీర ప్రాంతాల్లో ఇప్పటికే జీవీఎంసీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు ఉన్నాయి. ఇటీవల మరికొన్ని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించామని, అక్కడ ఆరు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని సీఐ పైడయ్య తెలిపారు. ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయం ఎదురుగా, పాండురంగాపురం డౌన్లో, వై.ఎం.సి.ఎ., పార్కు హోటల్ వెనుక, లైట్ హౌస్ వద్ద, పెదజాలరిపేట ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా షిఫ్ట్‌కు ఆరుగురు చొప్పున 12మంది గజ ఈతగాళ్లు,




మెరైన్ పోలీసులు, బీచ్ పర్యవేక్షణ సిబ్బంది నిత్యం పహారా కాస్తుంటారని చెప్పారు.

**కాటేస్తున్న ‘కరెంట్’**

విశాఖ తీరం తూర్పు కనుమల్లో భాగం కావడంతో ఇక్కడ సముద్రంలో కొండలు, గుట్టలు, రాళ్లు అధికంగా ఉన్నాయి. అదే విధంగా హఠాత్తుగా అలల మధ్య ‘కరెంట్’ జలాలు పుట్టుకొస్తుంటాయి. వాటిల్లో చిక్కుకుంటే బయటపడటం అంత సులువు కాదు. దీంతో స్నానాలు చేయడానికి అనువైన తీరం కాదని సముద్ర అధ్యయన శాస్త్రవేత్తలు ఇప్పటికే హెచ్చరించారు. సంవత్సరాలుగా యంత్రాంగం సరైన చర్యలు తీసుకోకపోవడంతో తీరంలో తరచూ పలువురు మృత్యువాత పడుతున్నారు. ఎట్టకేలకు ఇప్పుడు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

## చీరలో శ్రీలీల గుబులు పుట్టించే ట్రీట్

తనదైన ప్రతిభతో ప్రజల హృదయాలలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్న శ్రీలీల పోటీలో ఎందరు ఉన్నా తన రేంజ్ వేరే లెవల్ అని ప్రతిసారీ నిరూపిస్తోంది. ఈ బ్యూటీ టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకూ కెరీర్ పరంగా దూసుకెళుతోంది. అన్ని పరిశ్రమల్లోని టాప్ హీరోల సరసన అవకాశాలు అందుకుంటోంది. ఓవైపు కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నా శ్రీలీల వరుస ఫోటోషూట్లతో అన్ లిమిటెడ్ ట్రీట్ ఇస్తోంది. 24 ఏళ్ల ఈ బ్యూటీ ఇప్పుడు చీరలో తన అందచందాలను ఎలివేట్ చేసిన తీరుకు కుర్రకారు సాహో అనేస్తున్నారు. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ ఇంటర్నెట్‌లో గుబులు పెంచుతోంది. డార్క్ గ్రీన్ కలర్ శారీలో బీచ్ పరిసరాలలో ప్రత్యేకంగా ఈ ఫోటోషూట్ ని ప్లాన్ చేయడం ఆసక్తిని కలిగిస్తోంది. సముద్రపు అంచున నల్లని మట్టి దిబ్బలపై సాహసోపేతంగా శ్రీలీల ఈ ఫోటోషూట్ లో పాల్గొంది. ఈ యూనిక్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. ప్రస్తుతం బాలీవుడ్ లో ఆరంగేట్రమే కార్తీక్



ఆర్యన్ సరసన శ్రీలీల అవకాశం అందుకుంది. అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తున్న రొమాంటిక్ మ్యూజికల్ డ్రామాకు తు మేరీ జిందగీ హై అనే అధికారిక టైటిల్‌ను ఫిక్స్ చేసారు. ఆషిఖి తరహాలో అద్భుతమైన మ్యూజికల్ డ్రామా నేపథ్యంలో ప్రేమకథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తుండడం ఆసక్తికరం. మే 2026లో ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. 2025 చివరి నాటికి టాకీ పూర్తవుతుంది.

పోస్ట్-ప్రొడక్షన్ పాటల చిత్రీకరణ 2026 ప్రారంభంలో జరుగుతుంది. మే 2026 లో సినిమాని విడుదల చేస్తారు. మరోవైపు శ్రీలీల టాలీవుడ్ లోను పలు క్రేజీ ప్రాజెక్టులకు కమిట్ అయింది. మాస్ జాతర ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. పరాశక్తి, ఉస్తాద్ భగత్ సింగ్ లాంటి భారీ చిత్రాలలోను ఈ బ్యూటీ నటించనుంది. కెరీర్ లో మొదటిసారి పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన ఉస్తాద్ భగత్‌సింగ్‌లో నటించే అవకాశం దక్కించుకుంది. ఈ క్రేజీ సినిమాలో తన పాత్ర చిత్రణ కోసం శ్రీలీల ఎంతో ఎగ్జయిటింగ్ గా వేచి చూస్తోంది. హరీష్ శంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో పవన్ పవర్ ఫుల్ పోలీసాఫీసర్ గా నటించనున్నారు.

## ఆ రిమార్క్ తో అవకాశాలు కష్టమేనా?

ఈ మధ్య కాలంలో శ్రీలీల ఫేమస్ అయినంతగా మరో తెలుగు నటి వెలుగులోకి రాలేదు. అంజలి తర్వాత ఆమెను మించిన ఫాలోయింగ్ దక్కించుకున్న నటిగా పేరులోకి వచ్చింది. మహేష్, రవితేజ , బాలయ్య, నితిన్ లాంటి స్టార్ హీరోల సినిమాల్లో భాగమవ్వడంతో అమ్మడి కెరీర్ కి తిరుగుండదనుకున్నారు. వాటితో పాటు ఐటం భామగాను సంచలనమవ్వడంతో? కొన్నాళ్ల పాటు వెనక్కి తిరిగి చూడకుండా కెరీర్ సాగుతుందనుకున్నారంతా.

ఆ రకంగా అవకాశాలు కూడా అందుకుంది. కానీ తిరస్కరణలో అమ్మడిని ఇరకాటంలో పడేసినట్లు కనిపిస్తోంది.

**సెకెండ్ ఛాన్స్ అంత సులభం కాదు:** అఖిల్ ఈరోగా నటిస్తోన్న లెనిన్ చిత్రంలో వచ్చిన అవకాశం వదులకున్న సంగతి తెలిసిందే. హిందీ సినిమాతో డేట్లు క్లాష్ అవ్వడంతో తెలుగు సినిమా ఛాన్స్ వదులుకుంది. అలాగే మరో స్టార్ హీరోకి జోడీగా కూడా ఛాన్స్ వచ్చింది. ఆ అవకాశాన్ని కూడా అమ్మడు చేతులారా వదులకుంది. మరి ఈ రకమైన పరిస్థితులతో టాలీవుడ్ లో ఛాన్సులు కష్టమేనా అంటే? సన్నివేశం అలాగే కనిపిస్తోంది. వచ్చిన అవకాశాలు వద్దనుకుని



వెళ్లిన నటీమణులకు టాలీవుడ్ సెకెండ్ ఛాన్స్ ఇవ్వదు. పూజాహెగ్డే, రకుల్ ప్రీత్ సింగ్ టాలీవుడ్ కి అలాగే దూరమయ్యారు.

**శ్రీలీలకు ఆ పరిస్థితి తప్పదా?...** కెరీర్ పీక్స్ లో ఉండగానే ఇద్దరు తెలుగు బాలీవుడ్ కి వెళ్లారు. అటుపై మళ్లీ తెలుగులో నటించాలని ఉందని ప్రయత్నాలు చేస్తున్నా? ఎవరూ ఛాన్స్ లివ్వడం లేదు. శ్రీలీలకు కూడా ఆ పరిస్థితి తప్పదనే విమర్శ వ్యకమవుతుంది. ప్రస్తుతం శ్రీలీల చేతిలో ఉన్న ఒకే ఒక్క చిత్రం ఉస్తాబ్ భగత్ సింగ్. పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రమిది. శ్రీలీల నటిగా బిజీగా ఉన్న సమయంలో కమిట్ అయిన ప్రాజెక్ట్ ఇది. కానీ ఇకపై కొత్త వకాశాలు అంత సులభం కాదు. గత రిజెక్షన్లను దృష్టిలో పెట్టుకుని ఇకపై మేకర్స్ అప్రోచ్ అవకాశం ఉంటుంది.

**రిజెక్షన్లు ఓ రిమార్క్ లా:** ఎంతటి ప్రతిభావంతురాలికైనా? రిజెక్షన్లు అన్నవి ఓ రిమార్క్ లా పడతాయి. సాయి పల్లవి విషయంలో కూడా ఇదే సందేహం వ్యక్తమవుతోందిప్పుడు. బాలీవుడ్ లో రామాయణం కమిట్ అయిన తర్వాత వచ్చిన కొన్ని ఆఫర్లను వదిలేసింది. అలాగే ఆమెని కథ తో మెప్పించడం కూడా ఏ దర్శకుడికైనా కత్తిమీద సాము లాంటిందే అన్న వాదన ఉంది. వెరసీ ఇవన్నీ సాయి పల్లవిని టాలీవుడ్ కి దూరం చేసేలా కనిపిస్తున్నవే. ఇలా మరి ఏడాది పాటు తెలుగు సినిమాలు చేయకుండా ఉంటే స్వీటీలా చప్పుడు లేకుండా ఉండాల్సిందే.




## ఆ స్టార్ హీరో ఈసారి పాత పద్ధతిలోనా?



కోలీవుడ్ స్టార్ సూర్య సరైన సక్సస్ అందుకుని చాలా కాలమవుతోంది. జైభీమ్ తర్వాత సరైన సక్సెస్ ఒక్కటీ పడలేదు. జైభీమ్ కూడా ఓటీటీ రిలీజ్ కావడంతో థియేట్రికల్ గా ఆడియన్స్ దూరంగానే కనిపించింది. కానీ ఆ సినిమాతో సూర్యకు వచ్చిన గుర్తింపు మాత్రం ఎంతో ప్రత్యేకమైనది. ఆ తర్వాత వరుసగా రిలీజ్ అయిన నాలుగైదు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ప్రత్యేకించి ఆ సినిమా రిలీజ్ లు కూడా అన్నీ తమిళ టైటిల్స్ తో తెలుగు లో రిలీజ్ అయ్యాయి. టైటిల్ మార్చాల్సిన ఆవశ్యకత లేకపోవడంతో అదే టైటిల్ తో ఏక కాలంలో రిలీజ్ చేసారు.

**తెలుగులో తమిళ టైటిల్స్ వాసన:** ఈటీ,కంగువ, రెట్రో లాంటి చిత్రాల టైటిల్స్ లో ఎలాంటి మార్పు కనిపించలేదు. ఈ నేపథ్యంలో తెలుగు టైటిల్ లేకుండా తమిళ సినిమా రిలీజ్ ఏంటనే విమర్శలు వ్యక్తమయ్యాయి. అంతకు ముందు మరికొంత మంది హీరోలు నటించిన సినిమాలు కూడా ఇలాగే రిలీజ్ అయ్యాయి. దీంతో టాలీవుడ్ నుంచి కాస్త నెగివిటీ కూడా మొదలైంది. కానీ తెలుగు అభిమానులంటే సూర్య ఎంతో గౌరవిస్తారు. ఆయన్ని ఇక్కడ ఆడియన్స్ ఎంతో ఆదరిస్తారు. తమిళ అభిమానుల కంటే తనకు ఓ మెట్టు పైనే తెలుగు అభిమానులుంటారు. సూర్య లాగే కార్తీ కూడా ఇక్కడ అభిమానులకు అంతే ప్రాధాన్యత ఇస్తారు.

**పోటీ కూడా అడ్డంకిగా:** తమిళ నుంచి ఎంత మంది హీరోలున్నా? అన్నదమ్ములిద్దరు మాత్రం తెలుగు ఆడియన్స్ కు ఎంతో ప్రత్యేకం. ఆ సంగతి పక్కన బెడితే తదుపరి సినిమా రిలీజ్ విషయంలో సూర్య సంచలన నిర్ణయానికి అవకాశం ఉందా? అంటే ఉందనే చెప్పొచ్చు. సూర్య నటించిన కరుప్పు సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ ఆ సీజన్ లో తమిళ సహా తెలుగు నుంచి చాలా సినిమాలు రిలీజ్ కు ఉండటంతో? సూర్య ఉన్న తాజా పరిస్థితుల్లో వాళ్లకు పోటీగా రావడం కంటే పోటీ లేని సమయంలోనే వస్తే బాగుంటుంది అన్న ఆలోచనతో వెనక్కి తగ్గినట్లు తెలిసింది.

**గత సినిమాల వైఫల్యం నేపథ్యంలో:** ఈ నేపథ్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26 కరుప్పు ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేసుకుంటున్నారుట. అయితే ఈ సినిమాకు తెలుగు లో టైటిల్ ఉండాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. సూర్య గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తెలుగు అభిమానుల కోసం తెలుగు టైటిల్ తో రావాలని ఆశీస్తున్నారు. అందుకు సూర్య ఎంత మాత్రం అడ్డు చెప్పే న టుడు కాదు. గత సినిమాల వైఫల్యం నేపథ్యంలో ఈసారి తెలుగు టైటిల్ తోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మధ్యలో దర్శక , నిర్మాతలు మాతృభాషపై అతి మమకారంతో ఎలాంటి రాజకీయాలకు పాల్పడకుండా ఉంటే సాధ్యమే.

## ప్రభాస 'రాజా సాబ్'.. ఒక్క తెలుగులోనే అన్ని కోట్లా?




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లీడ్ రోల్ లో దర్శకుడు మారుతి ది రాజా సాబ్ మూవీ తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. హారర్ కామెడీ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఆ సినిమా.. మరికొన్ని రోజుల్లో థియేటర్స్ లో రిలీజ్ కానుంది. పాన్ ఇండియా స్థాయిలో వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా గ్రాండ్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఇప్పటికే మూవీపై ఆడియన్స్ లో మంచి అంచనాలు ఉండగా.. మేకర్స్ వాటిని భారీగా పెంచుతున్నారు. వరుస అప్డేట్స్ తో ఫుల్ హైప్ ను క్రియేట్ చేస్తున్నారు. అదే సమయంలో ఇప్పుడు ప్రీ రిలీజ్ బిజినెస్ ను పూర్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. థియేట్రికల్, నాన్ థియేట్రికల్ రైట్స్ కు డిమాండ్ ఉందని, అనేక మంది ఎగబడుతున్నారని సమాచారం. తెలుగు, తమిళ, హిందీ, మలయాళం, కన్నడ వెర్షన్లకు వేర్వేరుగా బిజినెస్ డీల్స్ జరుగుతున్నట్లు వినికిడి. ముఖ్యంగా తెలుగు వెర్షన్ థియేట్రికల్ కోసం డిస్ట్రిబ్యూటర్ల మధ్య భారీ పోటీ నెలకొందని తెలుస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన హక్కుల కోసం రూ.130 కోట్లకు పైగా మొత్తంలో డీల్ కుదుర్చుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రూ.100 కోట్లకు పైగా ప్రీ రిలీజ్ బిజినెస్ చేసిన మరో సినిమాగా రాజా సాబ్ నిలిచినట్లు తెలుస్తోంది. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో ది రాజా సాబ్ మూవీ బ్రేక్ ఈవెన్ టార్గెట్ అందుకుని లాభాల్లోకి రావాలంటే రూ.200 కోట్లకుపైగా వసూళ్లను సాధించాల్సి ఉందని ఇప్పుడు ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఇక సినిమా విషయానికొస్తే.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఐవీవై ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్స్ పై ప్రముఖ నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల, ఇషాన్ సక్సేనా.. ది రాజా సాబ్ ను రూపొందిస్తున్నారు. దాదాపు 400 కోట్లకు పైగా భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నట్లు సమచారం. ప్రొడక్షన్ విషయంలో ఎక్కడా తగ్గకుండా తీశారని వినికిడి. మూవీలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ది కుమార్ లు హీరోయిన్లుగా నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బోమన్ ఇరానీ, జరీనా వహబ్, సముద్రఖని, బ్రహ్మానందం, వీటీవీ గణేష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కార్తీక్ పళని సినిమాటోగ్రాఫర్ గా వ్యవహరిస్తున్నారు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్ గా వర్క్ చేస్తున్నారు. తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. అయితే రాజా సాబ్ ఎలాంటి విజయం సాధిస్తుందో వేచి చూడాలి.

## ఉక్కిరి బిక్కిరి చేస్తున్న అందాల సోనమ్

పంజాబీ మూవీ 'శుభం కలుగుగాక'తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ సోనమ్ బజ్వా. ఈ అమ్మడు తెలుగులోనూ వెంకటేష్ హీరోగా నటించిన బాబు బంగారం సినిమాలో ఐటెం సాంగ్ చేయడం ద్వారా పరిచయం ఉంది. ఆ సినిమా తర్వాత సోనమ్ తెలుగులో కనిపించలేదు. బాలీవుడ్‌కే ఈ అమ్మడు పరిమితం అయింది. పంజాబీ, హిందీ సినిమాలతో బిజీ బిజీగా ఉండే ఈ అమ్మడు సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా సౌత్‌లోనూ ఈ అమ్మడికి గుర్తింపు లభించింది.

ఎప్పటికప్పుడు ఈ అమ్మడి గురించి నెటిజన్స్ మాట్లాడుకుంటూనే ఉన్నారు. తాజాగా మరోసారి ఈ అమ్మడు ఆకట్టుకునే విధంగా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. సోనమ్ బజ్వా అందానికి ప్రతి ఒక్కరూ ఫిదా కావాల్సిందే అని మరోసారి నిరూపితం అయ్యింది.

**సోనమ్ బజ్వా అందాల ఆరబోత...**2012 ఫెమినా మిస్ ఇండియా కాంటెస్ట్‌లో పాల్గొనడం ద్వారా ఈ అమ్మడికి గుర్తింపు లభించింది.



పంజాబీ సినిమాతో ఎంట్రీ ఇచ్చినప్పటికీ వెంటనే తమిళ చిత్రంలోనూ నటించే అవకాశం దక్కింది. అయితే తమిళ సినిమాతో హిట్ దక్కక పోవడంతో అక్కడ మరిన్ని సినిమాలు చేయలేక పోయింది. అర్దాబ్ ముతియారన్ చిత్రంలోని ఈ అమ్మడి నటనకు గాను ఉత్తమ నటి అవార్డ్‌ను దక్కించుకుంది. పంజాబ్ నుంచి దక్కిన ఆ అవార్డ్ కారణంగా మరింతగా ఈమె బిజీ అయింది. తెలుగులో ఈమె ఆటాడుకుందం రా అనే సినిమాలోనూ నటించింది. కానీ కనీసం ఆ సినిమాలో ఈమె ఉన్న సంగతి కూడా ఎవరికీ తెలియదు. అందుకే ఆ సినిమా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికీ హిందీ, పంజాబీలో వరుస సినిమాలు చేస్తున్న ఈమె మరింత బిజీ కావాలని ప్రయత్నాలు చేస్తోంది.

**బాలీవుడ్‌లో వరుస సినిమాలు..** మూడు పదుల వయసు దాటిన తర్వాత సాధారణంగా హీరోయిన్స్ జోరు తగ్గుతుంది అంటారు. కానీ సోనమ్ బజ్వా ప్రస్తుత వయసు వికీపీడియా అనుసారం 36 ఏళ్లు, అయినప్పటికీ అమ్మడు చాలా బిజీగా సినిమాలు చేస్తూనే ఉంది. ఉదాహరణకు చెప్పాలంటే ఈ ఏడాదిలోనే ఈమె నటించిన నాలుగు సినిమాలు వచ్చాయి. అందులో హిందీ సినిమాలు సైతం ఉండటం విశేషం. కేవలం హీరోయిన్‌గా నటించాలి అనుకోకుండా వచ్చిన ప్రతి ఆఫర్‌ను ఈ అమ్మడు సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అందాల ఆరబోత విషయంలోనూ ఈమె వెనక్కి తగ్గదు. అందుకే గ్లామర్ పాత్రలు దక్కించుకుంటూ ఇప్పటికీ ఇండస్ట్రీలో తాను ఉన్నాను అంటూ ఉనికి చాటుకుంటుంది. ఇలా చేస్తే తప్పకుండా ముందు ముందు కూడా మంచి ఆఫర్లు వస్తాయనే విశ్వాసం వ్యక్తం అవుతోంది.

## అవమానించారని కసితో బెంజ్ కొన్న నటి!

ముంబై బ్యూటీ మృణాల్ ఠాకూర్ చిత్ర పరిశ్రమలో ఎలా ఎదిగందన్నది చెప్పాల్సిన పనిలేదు. బుల్లి తెరపై ఎంట్రీ ఇచ్చి అక్కడ సక్సెస్ అనంతరం వెండి తెరకు ప్రమోట్ అయింది. ఈ మధ్యలో ఎన్నో అవమానాలు...సవాళ్లు ఎదుర్కుంది. ఇండస్ట్రీలో బ్యాక్ గ్రౌండ్ లేకపోతే ఎదురయ్యే అన్ని రకాల ఇబ్బందులు ఎదుర్కుంది. బాలీవుడ్ అనే మహాస ముద్రంలో తాను చేప పిల్లలా మొదలై పెద్ద చేపగా మారింది. అక్కడ నుంచి సీతారామంతో టాలీవుడ్ లోనూ సంచలన భామగా మారింది. కేవలం సక్సస్ మాత్రమే తనని ఇంత దూరం తీసుకొచ్చింది.

**చిన్న తనంలో అలాంటి అవమానం:** ఎన్నో హేళనలు..అవమానాల తర్వాత ఈ స్థాయికి చేరుకుంది. కొత్తగా వచ్చే వాళ్లకు పరిశ్రమలో ఇవన్నీ సహజమే. వాటిని పట్టించుకుంటే గమ్యాన్ని చేరడం అసాధ్యం. కానీ జీవితంలో మర్చిపోలేని ఓ సంఘటనని తనని బాలీవుడ్ వైపు స్ట్రాంగ్ గా ఉండేలా చేసిందని తెలుస్తోంది. ఇటీవలే అమ్మడు కష్టపడి సంపాదించిన డబ్బుతో లగ్జరీ మెర్స్ డెస్ బెంజ్ కారు కొంది. ఈ సందర్భంగా ఓ అవమానం గురించి మరోసారి గుర్తు చేసుకుంది. తన చేతుల్లో డబ్బులేని సమయంలో? చిన్న తనంలో తన తల్లిని చుట్టాలే కారు ఎక్కించుకోవాలంటే? ఆలోచించేవారుట.

**చుట్టాలందరిలో బెంజ్ నాకే ఉంది:** ఓ సారి అయితే కారు ఎక్కే



అర్హతే తన తల్లికి లేదన్నట్లు అవమానించారట. అలా ఓసారి తన తల్లిని ఒంటరిగా వదిలేసి కారులో వెళ్లిపోయారట. ఆ సంఘటన గుర్తొచ్చినప్పుడల్లా తానెంతో బాధపడతానంది. ఆ ఘటన తర్వాత డబ్బు సంపాదించి ఖరీదైన కారులో అమ్మను తీసుకెళ్లాలని బలంగా డిసైడ్ అయిందిట. ఆ కల ఇప్పటికి నెర వేరిందని తెలిపింది. తమ బంధువుల్లో ఎవరికీ బెంజ్ కారు లేదని...తానే ఆ కారు మొదట కొన్న వ్యక్తిగా చెప్పు కొచ్చింది. ఇప్పుడా కారులో అమ్మను ఎక్కించుకుని తిరుగుతున్నప్పుడు ఆ పాత సంఘటనలు గుర్తొచ్చాయంది.

**మనుషుల నిజ స్వరూపం:** అప్పుడు వాళ్లు అవమానించారని..ఇప్పుడు వాళ్లను తక్కువ చేయడం తన ఉద్దేశం కాదని..దగ్గర అనుకునే వాళ్లు కొందరు ఎలా ఉంటారు? అన్నది డబ్బు లేనప్పుడే తెలుస్తుంది. డబ్బు లేనప్పుడు సమభావంతో చూసిన వాళ్లే గొప్ప మనసున్న వ్యక్తులు అవుతారంది. ఇప్పుడు తాను డబ్బు సంపాదించినా? డబ్బు లేని రోజుల్ని మాత్రం ఎప్పటికీ మర్చిపోనంది. ప్రస్తుతం మృణాల్ హిందీ సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. అలాగని తెలుగు సినిమాలకు దూరమవ్వలేదు. అడవి శేష్ హీరోగా నటిస్తోన్న డెకాయిట్ లో నటిస్తోంది. అలాగే అల్లు అర్జున్ హీరోగా నటిస్తోన్న 26వ చిత్రంలోనూ ఓ హీరోయిన్ గా నటిస్తోంది. వీటితో పాటు మరికొన్ని కమిట్ మెంట్లు కూడా ఉన్నాయి. కానీ వాటి వివరాలు ఇంకా అధికారికంగా బయటకు రాలేదు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536